సెప్టెంబర్
2014

101

సంపుటి : 9 సంచిక : 5

వెల రు. 10/-

ఈ సంచికలో........

సాంస్కృతిక రంగం - పార్టీ కృషి
అవరోధాలు - అవకాశాలు
తెలంగాణా ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగా నామ్మడి కృషి
కార్మిక హక్కులు హరించే చట్ట సవరణలు: ప్రతిఘటనకు సిద్ధమవుతున్న కార్మికవర్గం
సంస్కరణలు - పేదరికం
చరిత్ర పరిశోధనా పీఠంపై ఆర్ఎస్ఎస్ ప్రచారకుడు
స్మార్ట్ సిటీల్లో పేదలకు చోటేది?
సోషలిజం కోసం నాద్యమాలు: ముందున్న సవాళ్లు
నైజాం వ్యతిరేక పోరాటానికి తోడ్పాటునిచ్చిన తునికిపాడు రాజకీయ పాఠశాల

స్ఫూర్తి

# నైజాం వ్యతిరేక పోరాటానికి తోడ్పాటునిచ్చిన తునికిపాడు రాజకీయ పాఠశాల

**యు. రామకృష్ణ**


తునికపాడులో రాజకీయ పాఠశాల జరిగిన ప్రాంతం. ఎదురుగా కనిపిస్తున్న లైబ్రరీ నాడు విద్యార్థులకు ఆశ్రయం ఇచ్చింది.

తునికిపాడు.. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలోని ఓ చిన్న గ్రామం. దానికి ఉత్తరాన నిజాం సంస్థానం (హైదరాబాద్ స్టేట్) సరిహద్దుగా ఉండేది. తునికిపాడు గ్రామస్తుల బంధువులనేకమంది నిజాం సంస్థానంలో ఉండేవారు. ఆ గ్రామం సరిహద్దున ఉన్న నైజాం ప్రజల బాధలు వర్ణింపశక్యం కాదు. ప్రజలు స్వతంత్రించి సభలు, ఉత్సవాలు చేసుకోవడానికి వీల్లేదు. వాటిని నిజాం ప్రభుత్వం అనుమతిస్తేనే నిర్వహించుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి బంధువులు వచ్చినా నిజాం సంస్థానంలో ఉండటానికి వీలులేదు. ఆ సంస్థానంలో పంటల విలువకు మించిన శిస్తులు, శాయిరీ (కస్టమ్స్) పన్నులు, అధికారుల జులుం, లంచగొండితనం విపరీతంగా ఉండేది.

నిజాం సంస్థానానికి సరిహద్దునున్న తునికిపాడు జమీందారీ పీడనకు గురికాకుండా స్వేచ్ఛ అనుభవిస్తున్న గ్రామం. 1937 ఫిబ్రవరిలో మద్రాసు రాష్ట్ర అసెంబ్లీ ద్విసభ్య నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా జయంతిపురం రాజా వాసిరెడ్డి సదాశివేశ్వం ప్రసాద్, స్వాతంత్ర్య సమర యోధులు కాట్రగడ్డ నారాయణరావు విజయం సాధించారు. వీరి విజయానికి కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (అప్పటివరకూ కాంగ్రెస్‌లోనే ఉండి విడిపోయి కమ్యూనిస్టులు ఏర్పాటు చేసుకున్న పార్టీ) కార్యకర్తలు ఎంతగానో కృషి చేశారు. ఎన్నికల ప్రచార సమయంలోనేగాక అనంతరం కూడా జమీందారీ విధానానికి నలిగిపోయిన ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యకర్తలు (కమ్యూనిస్టు కార్యకర్తలు) ఆ గ్రామంలో పనిచేయసాగారు. అంతేగాక పొరుగున నిజాం సంస్థాన ప్రాంతంలో జరుగుతున్న నిజాం వ్యతిరేక పోరాటాలకు తునికిపాడులాటి సరిహద్దు గ్రామాలు ఎంతగానో తోడ్పడ్డాయి. 1938లో నిజాం సంస్థానంలో సత్యాగ్రహ ాద్యమం సాగినప్పుడు ఈ సరిహద్దు గ్రామాల్లో సభలు జరిపి సంస్థాన సత్యాగ్రహులకు సంఘీభావం తెలిపేవారు. ఇలాంటి సభల్లో ఆచార్య ఎన్‌జి రంగా, ఇందూలాల్ యాజ్ఞిక్ లాంటి రైతు నాయకులు ాపన్యసించేవారు. తునికిపాడులో స్టేట్ సత్యాగ్రహ శిబిరం నెలకొల్పాలనే ప్రయత్నం జరిగింది. కానీ ఫలించలేదు. స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం విరమించబడిన తరువాత జమలాపురం కేశవరావు, వట్టికొండ నాగేశ్వరరావు, వట్టికొండ రామకోటయ్య, వట్టికొండ కాంతయ్య, వాసిరెడ్డి వెంకటపతి, పైడిపల్లి లింగయ్య మొదలగు సత్యాగ్రహులను ఆహ్వానించి ఈ గ్రామంలో సన్మానించారు.

ఇలాంటి వాతావరణం ప్రాతిపది కగా తునికిపాడులో చండ్ర రాజేశ్వరరావు నేతృత్వాన 1939 మే 25వ తేదీ నుంచి జూన్ 13 వరకూ రాజకీయ శిక్షణా శిబిరం కొనసాగింది. 20 రోజులపాటు జరిగిన ఈ రాజకీయ పాఠశాలకు నైజాం సంస్థాన ప్రాంతం నుంచీ, ఆంధ్ర ప్రాంతం నుంచీ సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. అయితే నైజాం సంస్థాన ప్రాంతం నుంచే ఎక్కువ మంది యువకులు పాల్గొన్నారు. ఈ పాఠశాల ప్రారంభోత్సవానికి గోల్కొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డిని అహ్వానించారు. తాను రావడానికి వీలు పడకపోవడంతో శిక్షణా శిబిరం జయప్రదం కావాలని ఆయన సందేశం పంపించారు. "నవశక్తి' సంపాదకుడు మద్దుకూరి చంద్రశేఖరరావు ఆ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకుడు పేట బాపయ్య పతాకావిష్కరణ చేశారు. ఆనాటి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు జవహర్‌లాల్ నెహ్రూ (స్వాతంత్ర్యానంతర తొలి ప్రధాని), ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లు ఈ రాజకీయ పాఠశాల జయప్రదం కావాలని సందేశాలు పంపించారు. ఈ పాఠశాలకు ఎన్‌జి రంగా ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, సుంకర వీరభద్రరావు కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ పాఠశాల గురించి పత్రికాముఖంగా తెలుసుకున్న నైజాం సంస్థానంలో నిజాం వ్యతిరేక పోరాటాలు నిర్వహిస్తున్న రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ఈ విద్యాలయాన్ని చూసేందుకు వచ్చారు. పేట బాపయ్య, గద్దె రంగయ్య నాయుడు, పిడికిడి రామకోటయ్య, మద్రాసు రాష్ట్ర శాసనసభ్యుడు కాట్రగడ్డ వెంకట నారాయణరావు పాఠశాలను సందర్శించి సందేశాలిచ్చారు.

ఈ శిబిరానికి అల్లినగరం, రామన్నపేట, కన్నెవీడు, ఖమ్మం, ఊటుకూరు, ముష్టికుంట్ల, తిరువూరు, శనగపాడు, కొణతమాత్మకూరు, వీరులపాడు, విజయవాడ, నేలకొండపల్లి, నాగారపాడు తదితర గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చారు. ఈ పాఠశాలకు విద్యార్థులుగా.. వట్టికొండ నాగేశ్వరరావు, కాళోజీ నారాయణరావు, రావెళ్ల జానకిరామయ్య, మచ్చా వీరయ్య, నీరుకొండ అప్పారావు, వాసిరెడ్డి వెంకటపతి, వాసిరెడ్డి సత్యనారాయణ, వట్టికొండ కాంతయ్య, వాసిరెడ్డి సూర్యనారాయణ, పైడిపల్లి హనుమయ్య, పారుపల్లి రామయ్య, కర్నాటి సాంబయ్య, హనుమారెడ్డి, చావా కొండయ్య, వెరవల్ల వెంకట రమణ, పెండ్యాల సత్యనారాయణ, ఎ.బోధాయన, గద్దె ప్రభాకరరావు, ములుకుట్ల వెంకటప్పయ్య, పాటిబండ్ల సత్యనారాయణ, జవ్వాజి అప్పయ్య, బోడెపూడి సత్యనారాయణ, వాసిరెడ్డి రాధాకృష్ణ, సుంకర శివరామయ్య, బోడేపూడి లక్ష్మి

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...


**1. నైజాం వ్యతిరేక పోరాటానికి తోడ్పాటునిచ్చిన తునికిపాడు రాజకీయ పాఠశాల**
– యు. రామకృష్ణ 2

**2. సాంస్కృతిక రంగం - పార్టీ కృషి**
– బి.వి. రాఘవులు 4

**3. అవరోధాలు - అవకాశాలు**
– ఎస్. వీరయ్య 14

**4. తెలంగాణా ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగానమ్మడి కృషి**
-10 వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల సంయుక్త ప్రకటన 15

**5. కార్మిక హక్కులు హరించే చట్ట సవరణలు: ప్రతిఘటనకు సిద్ధమవుతున్న కార్మికవర్గం**
– సిహెచ్. నర్సింగరావు 17

**6. సంస్కరణలు - పేదరికం**
– కొండూరు వీరయ్య 20

**7. చరిత్ర పరిశోధనా పీఠంపై ఆర్ఎస్ఎస్ ప్రచారకుడు**
– రామ్ పునియాని 24

**8. స్మార్ట్ సిటీల్లో పేదలకు చోటేది?**
– దివ్య త్రివేది 26

**9. సోషలిజం కోసం ఉద్యమాలు: ముందున్న సవాళ్లు**
– సమీర్ అమీన్ 30



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# భ్రమలు - వాస్తవాలు

**వా**స్తవాన్ని మార్చలేకపోతే భ్రమల్లో బతకడం మినహా మరో మార్గం కనిపించదు. ప్రస్తుతం మన దేశంలో అభివృద్ధి ప్రణాళికలు ప్రజల జీవన వాస్తవాలను మార్చడానికి కాకుండా భ్రమలు సృష్టించడానికే అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు కనిపిస్తోంది.

'జన్,ధన్ యోజన' కార్యక్రమంతో దేశంలో పేదరికం నిర్మూలించబడుతుందని ప్రధానమంత్రి మోడీ ప్రకటిస్తున్నారు. గతంలో 'ఆధార్'తో దేశ ప్రజల తలరాతలు మారుతాయని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రకటించినట్లే ఉందిది. దేశవ్యాపితంగా 100 స్మార్ట్ సిటీలు, బుల్లెట్ రైలు కారిడార్లు, మరిన్ని నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, ప్రతి పల్లెకూ హై స్పీడ్ ఇంటర్‌నెట్ కనెక్షన్లు....ఇవన్నీ దేశాన్ని ఆధునిక దేశంగా మార్చేస్తాయన్న భ్రమ ప్రజల్లో సృష్టిస్తున్నారు. ఈ ప్రాజెక్టులకు వేలకోట్ల రూపాయల ఖర్చుకు సిద్ధమవుతున్నారు.

కానీ వాస్తవాలేమిటి? జన్,ధన్ పేరుతో దేశంలోని పేద ప్రజలందరికీ బ్యాంకు పుస్తకాలిస్తారు సరే. కానీ ఆ పుస్తకాల్లో వేసుకోడానికి డబ్బేది? ఆరు మాసాల తరువాత ప్రభుత్వమే రూ. 5,000 అప్పు ఇస్తుందట. కానీ ఆ అప్పు తీర్చే మార్గమేది? ప్రజల ఆదాయాలు పెరిగే మార్గం చూపకుండా ఆదాయాలు దాచుకునే సదుపాయాలు చేయడం, అదే అభివృద్ధి అని చెప్పడం పిచ్చితనం కాక మరేమిటి?

యుపిఏ ప్రభుత్వం అనుసరించిన నయా-ఉదారవాద విధానాల వల్ల కొద్దిమంది బడాబాబుల బొక్కసాలు నిండిపోయి డబ్బు పొంగి పొరులుతుంటే, మరోవైపు సామాన్యుడికి గోచి గుడ్డ మాత్రమే మిగిలింది. ఇప్పుడు నరేంద్ర మోడీ గారి విధానాలు ఆ గోచీని కూడా ఊడగొట్టేట్లున్నాయి. రైతులు, సామాన్య ప్రజల ఆదాయాలు తగ్గి, అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతుంటే వారికి మోడీగారు బ్యాంకు ఖాతాలు తెరిచి డబ్బు దాచుకోమంటున్నారు.

మన నగరాలు, పట్టణాలు సరైన పారిశుధ్యం లేక, పౌర సదుపాయాలు లేక మురికి వాడలుగా మారుతుంటే వాటికి ఇవ్వాల్సిన నిధులిచ్చి ఆదుకోని ప్రభుత్వం కొత్తగా 100 స్మార్ట్ సిటీలు నిర్మిస్తుందట.

మన రైల్వేలు రానురాను ప్రయాణీకుల పాలిట యమకూపాలుగా మారుతున్నాయి. సరిపడ్డా రైళ్లు లేవు. సీట్లు లేవు. సదుపాయాలు లేవు. ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్ పాయఖానా ఏది అంటే మన రైల్వేలే. ప్రతి రైలు స్టేషనూ, ప్రతి రైలు ట్రాకూ ఒక పబ్లిక్ పాయఖానాయే. దేశంలో 32 వేల రైలు క్రాసింగులుంటే వాటిలో 13 వేల క్రాసింగులకు రక్షణ లేదు. ప్రతి ఏటా ఇక్కడ ప్రమాదాల్లో వందాలాది మంది ప్రజలు చనిపోతున్నారు. వీటిని అలాగే ఉంచి 50,000 కోట్ల రూపాయలతో అహమ్మదాబాద్‌నుండి ముంబయికి బుల్లెట్ రైలు మార్గం నిర్మించడానికి ప్రభుత్వం పూనుకుంటోంది.

దేశంలో 58 శాతం గృహాల్లో మరుగుదొడ్లు లేవు. పల్లెల్లో అయితే 70 శాతానికి లేవు. వాటిని వదిలిపెట్టి ప్రతి పల్లెకూ హైస్పీడ్ ఇంటర్‌నెట్ వేయడానికి స్పీడ్‌గా కదులుతోంది ప్రభుత్వం.

భారత దేశ వాస్తవాలను దృష్టిలో పెట్టుకోకుండా రూపొందించి, అమలు చేస్తున్న ఈ అభివృద్ధి ప్రణాళికలు సామాన్యులను భ్రమల్లో ఉంచి ధనికులకు ప్రయోజనం చేకూర్చడానికే. ఇవి దేశాన్ని వెలుగుతున్న ఇండియా, వెతలపాలవుతున్న ఇండియాగా మరింత విడగొడతాయి. బుల్లెట్ రైళ్లు, స్మార్ట్ సిటీలు.. వంటివన్నీ వెలుగుతున్న ఇండియాకు మోదాన్నిచ్చేవే. కానీ 80 శాతం ప్రజలున్న వెతల ఇండియా సంగతేమిటి? వారి ఆదాయాలు పెంచకపోతే, వారి జీవన ప్రమాణాలు పెంచకపోతే వెలుగుతున్న ఇండియా కూడా ఎక్కువ కాలం వెలగదు.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా: **రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),**
**అజామాబాద్, హైదరాబాద్- 20**

ఈ మాసం ముఖ్యాంశం

# సాంస్కృతిక రంగం - పార్టీ కృషి


బి.వి. రాఘవులు



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
పొలిట్‌బ్యూరో సభ్యులు


సాంస్కృతిక రంగానికి సంబంధించి మన పార్టీ పనిలో కొన్ని బలహీనతలున్నాయి. ఆ బలహీనతలను అధిగమించాలని చాలా సార్లు అనుకున్నాము. కాని దానిమీద తగినంత ప్రయత్నం జరగకపోవడంవల్ల తగిన ఫలితాలు రాలేదు.

ప్రస్తుతం దేశంలో మతత్వశక్తులు బలపడి, అధికారంలోకి వచ్చి, పార్లమెంట్‌లో ఏకైక పెద్ద శక్తిగా, ఒంటరిగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేస్థితికి వచ్చిన తరువాత సాంస్కృతిక రంగ ప్రాధాన్యత మరింత పెరిగింది. ఎందుకంటే అటు ఆర్.ఎస్.ఎస్.–సంఘపరివార్ శక్తులు గానీ, ఇటు ముస్లిం ఫండమెంటలిస్టులు గానీ, ప్రధానంగా మతతత్వాన్ని ఆధారం చేసుకుని పెరగడానికి ప్రయత్నిస్తున్నారు. మతం అనేది సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. ఆ విధంగా ఈ శక్తులు ప్రజల సంస్కృతిని తమకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా ప్రజలను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నాయి. అందువల్ల నేడు మనం సాంస్కృతిక రంగంలో కృషి అవసరాన్ని గుర్తించి, నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం వచ్చింది.

మన ఉద్యమాలలోకీ, పోరాటాలలోకీ వస్తున్న ప్రజలను మనం రాజకీయంగా సంఘటితం చేసుకోలేకపోతున్నాం అని ఇటీవలి కాలంలో మనం చెప్పుకుంటున్నాం. అంటే మన పోరాటాల్లో పాల్గొనే ప్రజలు కూడా బూర్జువా రాజకీయ పార్టీలకు అనుకూలంగా వారి ప్రభావంలోనే ఉంటున్నారు. ఎన్నికల సందర్భాలలో, కొన్ని కీలకమైన సందర్భాలలో అది మనకు కనపడుతోంది. అంటే మన వెనుకనున్న ప్రజల్ని బూర్జువా రాజకీయ సైద్ధాంతిక ప్రభావం నుండి వేరుచేసి మన రాజకీయ ప్రభావంలోకి తెచ్చుకోలేకపోతున్నాం. ఉద్యమాలు, పోరాటాలలో పాల్గొంటున్నవారు మన పార్టీ వెనుక రాజకీయంగా ఎందుకు సంఘటితం కావడం లేదు అంటే మనం సాధారణంగా చెప్పుకునేది మనం పోరాటాలు, ఉద్యమాలు మీద పెడ్తున్న శ్రద్ధ రాజకీయ విద్యమీద పెట్టడంలేదు అని. కానీ అది పాక్షిక సత్యమే. ఎందుకంటే రాజకీయ విద్య మీద మనం శ్రద్ధపెట్టినా మన ఉద్యమాలలో పాల్గొన్న ప్రజలందరికీ రాజకీయ విద్య గరపలేం కదా! రాజకీయ విద్య అంటే మనం ఎంపిక చేసిన కొద్ది మందికి రాజకీయ విద్య చెప్పడం. అందువల్ల ప్రజలు మన వెనుక రాజకీయంగా సంఘటితం కాకపోవడానికి రాజకీయ విద్య లేకపోవడమనే సమాధానం పూర్తి సంతృప్తికరమైన లేదా అర్థవంతమైన వివరణ, విశ్లేషణకాదు. కాబట్టి ప్రజానీకం రాజకీయంగా మన వెనుక నిలవాలంటే వారి మధ్య సైద్ధాంతిక పోరాటాలు జరగాలి. ప్రజలలో సైద్ధాంతిక రంగంలో కృషి జరగాలి. సైద్ధాంతిక రంగ కృషిలో కీలక భాగం సాంస్కృతిక రంగంలో కృషే.

**ప్రజానీకం రాజకీయంగా మన వెనుక నిలవాలంటే వారి మధ్య సైద్ధాంతిక పోరాటాలు జరగాలి. ప్రజలలో సైద్ధాంతిక రంగంలో కృషి జరగాలి. సైద్ధాంతిక రంగ కృషిలో కీలక భాగం సాంస్కృతిక రంగంలో కృషే.**

### సంస్కృతి – మార్క్సిస్టు అవగాహన

సాంస్కృతిక రంగం అంటే మనం సాంస్కృతిక సంఘం అనే అర్థంలో చూస్తున్నాయి. సాంస్కృతిక సంఘం అంటే ప్రజానాట్యమండలి. లేక కళా సాహిత్య రంగాల్లో పనిచేసే సంఘాలు. కాబట్టి ఒక సంఘాన్ని పెట్టుకుని ఆ సంఘం ద్వారా సాంస్కృతిక రంగంలో కృషి చేయడాన్ని సాంస్కృతిక రంగంలో కృషిగా మనం భావిస్తున్నాం. ఈ సంఘం కృషి కూడా క్రమ క్రమేణా కుదించుకు పోయి పార్టీ కార్యక్రమాలలో పాటలు పాడే సంఘంగా, నాటకాలు, నాటికలు వేయడం లేదా ఇంకా ఇలాంటి కార్యక్రమాలు చేసే సంఘంగానే పరిమితమయ్యింది. అంటే పార్టీ ప్రచార ప్రయోజనాలు నెరవేర్చే సంఘంగా ప్రజానాట్యమండలి పరిమితమయింది. కొన్ని ఇతర సందర్భాలలో పార్టీ పరిధి దాటి కొన్ని ఇతర కార్యక్రమాలు స్వతంత్రంగా చేసి ఉండవచ్చు. కానీ ఆ కృషి చాలా పరిమితం ఈ లోపాలన్నీ సంఘం వైపునుండీ, పార్టీ వైపునుండీ జరుగుతున్నాయి. వీటిని మనం అధిగమించాలి.

సాంస్కృతిక రంగంలో కృషి అంటే ఏమిటి అనేది తెలుసుకోవాలంటే కొన్ని ప్రాథమికమైన విషయాలపై మనకు అవగాహన ఉండాలి.

### సంస్కృతి నిర్వచనం

సంస్కృతి అంటే ఏమిటి అనేదే పెద్ద గందరగోళమైన సమస్య. దాన్ని నిర్వచించాలని ఎవరైనా పూనుకుంటే దానికి సవాలక్ష ప్రశ్నలొస్తాయి. కాబట్టి సంస్కృతికి సంక్షిప్తమైన నిర్వచనాలు, అతి విస్తృతమైన నిర్వచనాలు అనేకం ఉన్నాయి. వాటిని మూడు భాగాలుగా చెప్పు కోవచ్చు:

మొదటిది వ్యక్తి సంస్కారం: వ్యక్తిని సంస్కారవంతుడిగా తీర్చిదిద్దేది సంస్కృతి అని క్లుప్తమైన అర్థంలో చెప్తారు. ఒక వ్యక్తి చాలా సంస్కారవంతుడురా అంటాం. అతను చాలా మొరటోడురా అంటాం. అంటే సంస్కారవంతుడికీ, మొరటోడికీ వ్యత్యాసం ఏమిటి? మనిషి మొరటుతనాన్నుండి సంస్కారవంతుడిగా తీర్చిదిద్దే ప్రక్రియనంతటినీ సంస్కృతి అంటాం. మర్యాద, పరిశుభ్రత, చదువు, నడవడిక మొదలైన వాటిని బట్టి సంస్కారం నిర్ణయిస్తాం. అంటే మనిషిని సంస్కారవంతుడిగా, మంచి

వ్యక్తిగా తీర్చిదిద్దే వ్యవస్థల్ని మంచి సంస్కృతి అర్థంలో వాడతాం.

రెండోది, మానవుని విజ్ఞానాన్నీ, ఊహలనూ పొందుపరచే వ్యవస్థలన్నింటినీ సంస్కృతి అంటాం. అంటే ఊహాత్మకమైన విజ్ఞానం అతంటినీ, అనుభవాలన్నింటినీ క్రోడీకరించే, నిల్వచేసే వ్యవస్థలన్నింటినీ సంస్కృతిగా చూస్తాం. ఉదాహరణకు కవిత్వం, లేదా చిత్రలేఖనం ఊహాల్తో రాస్తాం. సాహిత్యం, నాటకాలు, సంగీతం, కళలు, సినిమా, టివీ వంటి మనం సాధారణంగా చెప్పుకునే సాంస్కృతిక అంశాలన్నీ దీనిలోకి వస్తాయి.

మూడవది, కాస్త విస్తృతమైన నిర్వచనం. సమాజంలోని వ్యక్తుల జన్యు సంబంధంకాని సామాజిక ప్రవర్తన రీతులు గల సమగ్ర వ్యవస్థను సంస్కృతి అంటాం. అంటే అనువంశికంగా వచ్చే విషయాలు మినహాయించి సామాజికంగా మనం సమకూర్చుకునే అన్ని రకాల అర్థాలు, విలువల్ని కలిపి వ్యక్తీకరించే వ్యవస్థలన్నింటినీ సంస్కృతి అంటాం. దీన్లో భౌతికపరమైనవి, ఊహాజనితమైనవి, ఆలోచనపరమైనవి, సామాజిక పరమైనవి అనేక అంశాలు వస్తాయి. సమాజంలోని విలువల్ని, అర్థాల్ని, వ్యాప్తి చేసే, నిక్షిప్త పరిచే పద్ధతులు, వ్యవస్థలు, మేధోపరమైన వాటన్నింటినీ సంస్కృతి అని చెప్తాం.

స్థూలంగా చెప్పాలంటే అర్థాల్నీ, విలువల్నీ వ్యాప్తిచేసే వ్యవస్థల, ఆచరణల, పద్ధతుల, ప్రవర్తనల సమాహారమే సంస్కృతి. ఈ అర్థంలో కాకుండా మరో అర్థంలో సంస్కృతిని గురించి చెప్పడం వల్ల అనేక గందరగోళాలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు, సామ్రాజ్యవాద సంస్కృతి వచ్చి మన దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నదని చెబుతున్నారు. కోకో కోలా వచ్చి మన చల్ల ముంత స్థానాన్ని అక్రమిస్తున్నదనీ (డిస్‌ప్లేస్), క్రీములు వచ్చి పసుపు స్థానాన్ని ఆక్రమిస్తున్నవనీ చెబుతున్నారు. ఇది ఒకరకమైన ఆధునికానంతర వాద (పోస్ట్ మోడరనిస్ట్) సిద్ధాంతం. చాలా మంది వామపక్ష వాదులు ఇటువంటి అభిప్రాయంతో ఉన్నారు. కానీ నిజానికి కోకో కోలా వచ్చి చల్ల ముంత స్థానాన్ని అక్రమించడం లేదు. చల్ల ముంతే కోకో కోలాగా మారిపోతున్నది. డబ్బుకు అమ్ముడు పోయే రంగునీళ్లు వచ్చి అమ్మకం సరుకు కాని చల్లను అమ్మకం సరుకుగా మార్చేస్తున్నది. ఇదే సాంస్కృతిక సామ్రాజ్యవాదం. అంటే సామ్రాజ్యవాదం సాంస్కృతిక వైవిధ్యాన్ని పూర్తిగా నాశనం చేయదు. అన్ని వైవిధ్యాలను అమ్మకం సరుకుగా లాభాలకు సాధనంగా మార్చేస్తుంది.

**❝ సామ్రాజ్యవాద సంస్కృతి వచ్చి మన దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నదని చెబుతున్నారు. కోకో కోలా వచ్చి మన చల్ల ముంత స్థానాన్ని అక్రమిస్తున్నదనీ (డిస్‌ప్లేస్), క్రీములు వచ్చి పసుపు స్థానాన్ని ఆక్రమిస్తున్నవనీ చెబుతున్నారు. ఇది ఒకరకమైన ఆధునికానంతర వాద (పోస్ట్ మోడరనిస్ట్) సిద్ధాంతం. చాలా మంది వామపక్ష వాదులు ఇటువంటి అభిప్రాయంతో ఉన్నారు. ❞**

బంజారా డ్రస్‌ని నాశనం చేసి జీన్స్ ప్యాంట్ రావడం కాదు, బంజారా డ్రస్‌ను కూడా ఎత్నిక్ కల్చర్ పేరుతో అమ్మకం సరుకుగా మార్చేస్తారు. ఆ డ్రస్‌లు మనం వేసుకోకపోవచ్చు. కానీ ఎత్నిక్ కల్చర్ పేరుతో విదేశీయులు వాటిని ధరించి తిరుగుతుంటారు. కాబట్టి సాంస్కృతిక సామ్రాజ్యవాదం అంటే అంతటినీ మార్కెట్ చేసేయ్యడం. సాంస్కృతిక వైవిధ్యాన్ని మార్కెట్ చేసుకునే అవకాశం ఉంటే సామ్రాజ్యవాదం ఆ వైవిధ్యాన్ని పెంచుతుందే తప్ప నాశనం చెయ్యదు. ఇప్పుడు వాస్తవంగా అది వైవిధ్యాలను నాశనం చేయడం లేదు. ఒకవేళ ఏదైనా వైవిధ్యాన్ని ఒక సరుకుగా మార్చుకొని దాని లాభంకోసం వినియోగించుకోవడం సాధ్యం కాకపోతే అప్పుడది ఆ వైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. అలా కాక దాన్ని సరుకుగా మార్చుకొని మంచి లాభాలు చేసుకోవచ్చునుకుంటే దాన్ని నాశనం చెయ్యదు. లాభం వస్తుందనుకుంటే విప్లవకారున్ని కూడా సరుకుగా మార్చేయడానికి దానికి అభ్యంతరమేమీ ఉండదు. విప్లవాన్ని సరుకుగా మార్చి అమ్మితే కమ్యూనిస్టులందరూ బాగా కొంటారంటే దాన్ని ఒక సరుకుగామార్చి కమ్యూనిస్టులకు అమ్ముతుంది సామ్రాజ్యవాదం. కాబట్టి ఇక్కడ రూపం గురించే కాదు. ఏ అర్థాలు, ఏ విలువల్ని సామ్రాజ్యవాద సంస్కృతి వ్యాప్తి చేస్తుందనేది ముఖ్యం.

**భావాలు - విలువలు**

సంస్కృతి వ్యాపింపజేసే అర్థాలు, విలువలు ఒక్కో వ్యవస్థకి ప్రత్యేకంగా వర్తించేవి ఉంటాయి. ఫ్యూడల్ వ్యవస్థను గుర్తించటానికి వీలుపడే అర్థాలు, విలువలు కొన్ని ఉంటాయి. అంటే ఆ విలువల్ని, అర్థాల్ని ఫ్యూడల్ సమాజాన్ని రక్షించుకొనేందుకు సంస్కృతి వ్యాప్తి చేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో కొన్ని అర్థాలు, విలువలు ఉంటాయి. ఆ విలువల్నీ, అర్థాల్నీ వ్యాప్తి చేయడం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించటానికి సంస్కృతి బాధ్యత తీసుకుంటుంది. అలాగే సోషలిస్టు వ్యవస్థ వచ్చిన తరువాత కొన్ని విలువలు అర్థాలు వ్యాప్తి చెందించేందుకు సంస్కృతి పూనుకుంటుంది. ఏమిటి ఆ విలువలు, అర్థాలు?

ఇప్పుడు సరళీకరణ విధానాలు, ప్రపంచీకరణ విధానాలు వచ్చిన తరువాత పెట్టుబడిదారి వ్యవస్థలో అంతకుముందు నుండి ఉన్న కొన్ని విలువల్లో మార్పులు చేర్పులు వచ్చాయి. కొన్ని ఒక్కాణింపులు మారాయి. కాబట్టి ఇప్పుడున్న సంస్కృతి ఏ విలువల్ని, అర్థాల్ని వ్యాప్తి చేస్తోంది అనేదాన్ని మనం చూడాలి. ఇప్పుడు కొన్ని విలువల గురించి చూద్దాం: మంచి–చెడు, పరువుప్రతిష్ఠ, ప్రేమ–ఈర్ష్య ద్వేషం, ఉన్నతం–నీచం, ఆధిక్యం–హీనం, అందం– వికారం, సత్యం–అసత్యం, ధర్మం–అధర్మం, స్వేచ్ఛ, గొప్ప–తక్కువ, పాపం–పుణ్యం, స్వర్గం–నరకం, పునర్జన్మ, కర్మ, ఆత్మ–పరమాత్మ, నిరాడంబరత, కష్టపడేతత్వం, నిజాయితీ, మానమర్యాద, నిర్భయత్వం, సేవాతత్పరత, దయ, త్యాగం, స్వార్థం, గర్వం, శౌర్యం, పరాక్రమం, సాహసం, ధైర్యం, పిరికితనం, ఆడంబరత్వం, లాభాపేక్ష వగైరా విలువల్లో ఒక్కో వ్యవస్థలో ఒక్కో రకమైన విలువలు వ్యాపింపబడతాయి.

ఫ్యూడల్ విలువలు: అంతస్థు, దైవాంశ, హానర్, సాహసం, దాతృత్వం, నిరంకుశత్వం, ప్రాతివత్యం.

పెట్టుబడిదారీ విలువలు: పోటీ తత్వం, వ్యక్తితత్వం, వినిమయ తత్వం అరాచకం, దురాశ.

సోషలిస్టు విలువలు: సమానత్వం– సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం, సమిష్టి తత్వం, సంఘీభావం, సహకారం, ఐక్యత, సామరస్య, శ్రమ గౌరవం.

ఫ్యూడల్ వ్యవస్థలో 'నిష్ఠ' అనేది ఒక లక్షణం. ఫ్యూడల్ వ్యవస్థలోనే ఎక్కువగా ఋషులు సన్యాసులు, మతగురువులు, బాబాలు, క్రైస్తవ మతంలో నన్స్ కనిపిస్తారు. కోటీశ్వరుడు కూడా సన్యాసిని పూజిస్తాడు. సన్యాసి అంటే ఏమిటి

> "స్వదేశీ సంస్కృతి మొత్తం మంచిది, దాన్ని ముట్టుకోకూడదు అన్నట్లు మనం మాట్లాడ కూడదు. భారతీయ సంస్కృతి అంతా మంచిది, విదేశీ సంస్కృతి మొత్తం చెడ్డదైనట్లు భావించడం అంటే సంస్కృతిని విమర్శనా రహితంగా పరిశీలన చేశామన్న మాట."

గొప్ప. అతనికి ఏమీ ఉండదు కాబటి. ఏమీ లేకపోవడం గొప్ప కాబట్టి. కోటీశ్వరుడికి అన్నీ ఉన్నా అతని దగ్గరకు వెళతాడు. కనుక ఆ సమాజంలో ఉన్నవాడూ, లేనివాడూ అందరూ గౌరవించేది నిష్ఠ. ఇది ఫ్యూడలిజానికి ఒక ప్రత్యేకమైన లక్షణంగా ఉంటుంది. అలాగే స్త్రీ, పురుష సంబంధాలలో పాతివ్రత్యం, శీలం అని ఫ్యూడల్ వ్యవస్థ లక్షణాల్లో ఒకటి. అంటే పురుషాధిక్యతను విస్తారంగా చాటి చెప్పే ఒక విలువ అర్థం పాతివ్రత్యం. అలాగే దైవాంస. ఏదన్నా జరిగిందంటే దైవాంశ మీదకు నెడతారు. దాజు దైవాంశ సంభూతుడు. అలాగే సాహసం ఫ్యూడల్ వ్యవస్థ లక్షణం. ముఖాముఖి తేల్చుకునేందుకు యుద్ధాలకు తలపడ్డం. పెట్టుబడిదారులు ముఖాముఖి తేల్చుకుందాం అనరు. కోర్టులో తేల్చుకుందాం అంటారు. భారతంలో భీముడికి-దుర్యోధనుడికి, జరాసంధు డికి-భీముడికి కుస్తీ పోటీ జరుగినట్లు చెబుతారు. యూరప్‌లో డ్యూయెల్స్ అంటారు. కావాలను కున్న యువతి కోసం రాజ్యావారసత్వ కోసం ఇద్దరు వ్యక్తులకు పోటీపెడతారు. అలాగే ఫ్యూడల్ వ్యవస్థలో అన్నిటికంటే కీలకమైనది అంతస్థు. అంతస్థు అనేది ఫ్యూడల్ వ్యవస్థకు ఒక నికరమైన లక్షణం. పై అంతస్థు, కింద అంతస్థు. నిమ్న కులం, శూద్రకులం, చెండా లుడు. ఇలా సమాజం అంతస్థులుగా విడిపో తుంది. మనం దేశంలో అయితే కుల వ్యవస్థ. అంతస్థు అనేది ఫ్యూడల్ లక్షణం. యూరప్‌లో ఫ్యూడల్ సొసైటీలో ఆర్డర్స్ కూడా అలాగే ఉండేవి. ఇక్కడ మనం జన్మరీత్యా వారి కులాల్ని నిర్ణయించినట్టే, యూరప్‌లో కూడా ఆర్డర్స్‌లో కూడా వారి జన్మరీత్యానే అంతస్థు నిర్ణయించ బడేది. అయితే జన్మతః పుట్టిన అంతస్థునుండి మరొక అంతస్థుకి వెళ్ళేందుకు అక్కడ ఆర్డర్స్‌లో అవకాశం ఉండేది. కాని ఇక్కడ అటువంటి అవకాశాలు పూర్తిగా రద్దు చేయబడ్డాయి.

ఇలాగే మిగిలిన వ్యవస్థల్లో కూడా వాటి ప్రత్యేక విలువలను వ్యాపింపజేయడానికి సంస్కృతి సాధనమవుతుంది.

ఒక సాంస్కృతిక కార్యక్రమం లేదా సాంస్కృతిక వస్తువు, సాంస్కృతిక ఆచరణ ఏ వ్యవస్థకు సంబంధించిందనేది... దానిలో ఉన్న అర్థం ఏమిటి, దానిలో ఉన్న విలువలు ఏమిటి అనేది గమనిస్తేనే మనకు అర్థం అవుతుంది. ఆ విలువల్నీ, అర్థాల్ని గమనించ కుండా మనం సంస్కృతిగురించి మాట్లాడితే ప్రయోజనం రాందదు.

స్వదేశీ సంస్కృతి మొత్తం మంచిది, దాన్ని ముట్టుకోకూడదు అన్నట్లు మనం మాట్లాడ కూడదు. భారతీయ సంస్కృతి అంతా మంచిది, విదేశీ సంస్కృతి మొత్తం చెడ్డదైనట్లు భావించడం అంటే సంస్కృతిని విమర్శనా రహితంగా పరిశీలన చేశామన్న మాట. ఒక సంస్కృతిలో ఏ విలువలు, ఏ అర్థాలు ఉన్నవి అని పరిశీలన చేసి అవి కమ్యూనిస్టులుగా మనం ఆహ్వానించ దగినవా, వ్యతిరేకించవలసినవా లేక నాశనం చేయాల్సినవా అని నిర్ణయించుకోవల్సిన అవస రం ఉంటుంది.

ఏ సమాజంలో అయినా ఆధిపత్య సంస్కృతే సమాజ సంస్కృతిగా చెలామణి అవు తుంది. అందువల్ల సంస్కృతి అనేది తటస్థమైనది కాదు. అది ఆధిపత్య వర్గ సంస్కృతి మాత్రమే. అందువల్ల సంస్కృతి అనగానే మనం ఆధిపత్య సంస్కృతి అనే అర్థంలో కాకుండా గొప్ప సంస్కృతి, హీన సంస్కృతి అని విమర్శనా రహి తంగా చూడకూడదు. ప్రస్తుతం ప్రపంచంలో ఆధిపత్య సంస్కృతులే ఉన్నాయి.

విలువలు, అర్థాలు ఆ సంస్కృతిలో భావాలుగానే ఉండవు. వివిధ రూపాలలో ఉంటాయి. కొన్ని వ్యవస్థలలో వ్యక్తమవుతూ ఉంటాయి. కొన్ని సాంప్రదాయాలలో, ప్రవర్తన లలో, అలవాట్లలో వ్యక్తమవుతూ ఉంటాయి. కొన్ని ఆచరణలలో వ్యక్తమవుతూ ఉంటాయి.

### భావ వ్యవస్థలు

సాంప్రదాయాలు, అలవాట్లు, కట్టుబాట్లు, నమ్మకాలు, తతంగాలు, ప్రవర్తనలు, సత్యాలు (సూక్తులు) ఇవన్నీ కూడా భావ వ్యవస్థలు. రాద్యమాలు, ధోరణులు కూడా ఇందులోకే వస్తాయి. కొన్ని సందర్భాలలో మనుషులు అనుసరించే ఆచరణల్ని మనం సాంప్రదాయాలు అంటాం. సాంప్రదాయాలే కాక తతంగాలు కూడా వుంటవి. పెళ్ళిలో, చావులో తతంగాలు ఉంటాయి. అనేక నమ్మకాలు, సూక్తులు, తిట్లు రాంటాయి. వాటన్నింటిలో కొన్ని అర్థాలు ఉండే అవకాశం ఉంది. సూక్తులు తీసుకుంటే పెద్దల్ని గౌరవించాలి. దొంగతనం చేయరాదు, అబద్ధాలు చెప్పరాదు వంటివి రాన్నాయి. అలాగే సూక్తులు కూడా ఆయా సంస్కృతులను సూచిస్తాయి. తిట్లలో కూడా కొన్ని విలువలు, అర్థాలు ఉంటాయి. తిట్లన్నింటినీ పరిశీలిస్తే స్త్రీని హీనంగా చూడటం రాంటుంది. ఈ తిట్లద్వారా పితృస్వామిక వ్యవస్థ గొప్పది లేక ఆడవాళ్ళు తక్కువ అనే విలువలు పిల్లలకు వచ్చేస్తాయి. ఆ విధంగా తిట్లు కూడా సంస్కృతిలో ఒక భాగం. అలాగే నడవడిక, శరీర హావభావాల్లో కూడా ఇది కనిపిస్తుంది. గ్రామంలో ఒక పాలేరు, ఒక దళితుడు అగ్రకుల భూస్వామి ముందు నడిచే తీరు, అగ్రకులంవాడు నడిచే తీరు భిన్నంగా రాంటాయి ఇవన్నీ కూడా సంస్కృతిలో భాగం అని అర్థం చేసుకోవాలి.

సంబోధనలో కూడా ఈ అంశం మనం గమనించ వచ్చు. రష్యన్ విప్లవంలో కార్మికుల ఇచ్చే ప్రతి వినతి పత్రం చివర మమ్మల్ని వాడూ, వీడూ అని పిలవొద్దు అనే డిమాండ్ రాండేది. ఫ్యూడల్ సంస్కృతిలో ఉన్న సంభోదనకు విసిగిపోయి కార్మికులు మమ్మల్ని మర్యాదగా సంబోధించండి అనే ఉద్యమం చేస్తే దాన్ని మనం అనవసరమైన ఉద్యమం అనుకో వక్కర్లేదు. ఇది కొన్ని భావాల్నీ, వ్యవస్థలో ఉండే అర్థాల్నీ వ్యతిరేకించే ఒక రకమైన సైద్ధాంతిక పోరాటం లాంటిదే. నిత్య జీవితంలో మనం ఏ తరగతుల్లో పనిచేస్తుంటే ఆ తరగతుల్లో ఈ భావ వ్యవస్థలు ఏమేమి ఉన్నవో అధ్యయనం చేయవచ్చు. సినిమాల్లో చూస్తే సమాజంలో ఉండే నమూనా ప్రవర్తనకి, ఒక నమూనా ప్రతినిధిగా పాత్రలు ఉంటాయి. ఒక అనుమానపు భర్తను చూపిస్తారు. సమాజంలో అలాంటివారు చాలామంది ఉంటారు. ఒకడు అబద్ధాల కోరుగా ఉంటాడు. ఇంకొకడు వాడికి అవసరం ఉన్నా లేకపోయినా ఎక్కడికిపోతే అక్కడి వస్తువుల్ని తస్కరించుకొని వెళ్ళిపోతుంటాడు. గుండమ్మ కథలో చాయాదేవి లాగా. ఇలాంటి భావ వ్యవస్థలు కొందరు వ్యక్తుల ప్రవర్తనలో కూడా సందర్భావశాత్తు కనపడతాయి.

సినిమాల్లో మనకు అర్థమయ్యేందుకు గాను వీటిని పెద్దవి చేసి, చాలా ఏకపక్షంగా చూపిస్తారు. జీవితంలో అంత ఏకపక్షంగా ఉండకపోవచ్చు.

**సాంస్కృతిక ఆచరణలు - సాంస్కృతిక ఉత్పత్తి రూపాలు**


జానపద కళలు, థియేటర్, సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం, సినిమా, ఆటలు, ఆహారం, ఆహార్యం, వినోదం, టివి, ఇంటర్‌నెట్ మొదలైనవి సాంస్కృతిక ఆచరణలు, లేక సాంస్కృతిక ఉత్పత్తి రూపాలు.

జానపద కళల్లో ఫ్యూడల్ అర్థాలు, ఫ్యూడల్ భావాలు ఎక్కువగా ఉంటాయి. తోలుబొమ్మలాట చూడండి. అందులో భూస్వామ్య వ్యవస్థ పట్ల విమర్శ ఉంటుంది. ఆ వూరి కరణాన్నో, మున్సబునో, వాడి బోడిగుండునో ఎగతాళి చేయడానికి పూనుకుంటారు. కాబట్టి హరికథలు, బుర్రకథలు, జానపద కళలు ఇవన్నీ కూడా ఫ్యూడల్ వ్యవస్థలో ఉండే అర్థాల్ని, భావాల్ని, కొన్ని సందర్భంలో వాటి మధ్య ఉండే ఘర్షణలనీ వ్యక్తం చేసే రూపంలో ఉంటాయి. అలాగే సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం ఇవన్నీ సాంస్కృతిక రూపాలు. ఈ సాంస్కృతిక రూపాల్లో కూడా ఒక అర్థం ఒక విలువే కాకుండా రకరకాల అర్థాలు, విలువల్ని వ్యక్తీకరించేవి ఉంటాయి. ఇప్పుడు ఆధునిక యుగంలో టి.వి., ఇంటర్నెట్, బుక్‌పబ్లిషింగ్, పాప్‌కల్చర్ ఇవన్నీ కూడా సాంస్కృతిక ఆచరణలు, ఉత్పత్తి రూపాల కిందకు వస్తాయి.

**సాంస్కృతిక పాత్ర నిర్వహించే వ్యవస్థలు**

విద్యా వ్యవస్థ, మత వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, భాషా వ్యవస్థ, రాజ్య వ్యవస్థ, అలాగే ఆధునికంగా కార్మిక సంఘం, క్లబ్‌లు ఇట్లాంటివన్నీ ఈ కోవలోకి వస్తాయి. ఈ వ్యవస్థలు కూడా సాంస్కృతిక పాత్రను నిర్వహిస్తాయి. ఉదాహరణకు:- కుటుంబం. కుటుంబం అనేది కొత్త శ్రమ శక్తిని ఉత్పత్తిచేసే ఒక కేంద్రం. ఉత్పత్తి సంబంధాల్ని అక్కడ పునరుద్ధరిస్తుంటారు, పునరుత్పత్తి చేస్తుంటారు. అదే సందర్భంలో సామాజిక విలువల్నీ, సమాజంలో ఉండే అర్థాల్ని కూడా ఉత్పత్తి చేస్తుంటారు. కుటుంబం ఆ రకంగా రెండూ చేస్తుంది. విద్య విజ్ఞానాన్ని నేర్పుతుంది. విలువల్ని, అర్థాల్ని కూడా వ్యాప్తి చేస్తుంది. మతం కూడా మానవుని ఆధ్యాత్మిక (స్పిరిట్యువల్) మథనానికి సమాధానాలివ్వడంతోబాటు వ్యవస్థను కాపాడే విలువలను వ్యాపింపజేస్తుంది. దేవుడిమీద భారంవెయ్యి, వ్యవస్థను మార్చుటానికి ప్రయత్నం చేయవద్దు అనే

> ❝ సమాజంలో, మొత్తం వ్యవస్థలో సంస్కృతి పాత్ర ఏమిటి అనేది ముఖ్యమైనది. ఈ విషయంలో మార్క్సిస్టుల్లోనూ, కమ్యూనిస్టుల్లోనూ రకరకాల భావాలు, రకరకాల వివాదాలు ఉన్నాయి. ❞



వినిమయదారీ సంస్కృతిని పెంచి పోషించే ఒక పెద్ద సాధనం టీవీ

అర్థాలు, విలువల్ని ఇది వ్యాప్తి చేస్తుంది. భాషలో కూడా అదే ఉంటుంది. భాషలో కమ్యూనికేషన్ ఒక్కటే కాకుండా దాని ద్వారా కొన్ని భావాల్ని, అర్థాల్ని వ్యాప్తి చేయడం జరుగుతుంది. కాబట్టి ఈ వ్యవస్థలన్నీ కూడా సాంస్కృతిక రంగంలో ముఖ్యమైన విలువల్ని, అర్థాల్ని చాలా జయప్రదంగా నిలబెట్టడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయి.

**పునాది - ఉపరితలం సమస్య**

సమాజంలో, మొత్తం వ్యవస్థలో సంస్కృతి పాత్ర ఏమిటి అనేది ముఖ్యమైనది. ఈ విషయంలో మార్క్సిస్టుల్లో, కమ్యూనిస్టుల్లో రకరకాల భావాలు, రకరకాల వివాదాలు ఉన్నాయి. ఆ వివాదాల గురించి కొద్దిగా తెలుసుకుందాం. రాజకీయ అర్థశాస్త్ర విమర్శకు రాసిన ఉపోద్ఘాతంలో కారల్ మార్క్స్ సామాజిక వ్యవస్థలో సంస్కృతి స్థానం గురించి వివరించాడు: సామాజిక వ్యవస్థలో ఆర్థిక శక్తులు, ఆర్థిక సంబంధాలు పునాదిగా ఉంటాయి. ఈ పునాదిమీద కుటుంబం, కళలు, మతం ఇటువంటి భావజాలానికి సంబంధించిన అంశాలు.

ఈ పునాది ఉపరితలం ఉపమానాన్ని మార్క్స్ వాడటం చాలా సమస్యలకు, చాలా చర్చలకు దారితీసింది. మార్క్స్ కాలంలోనే దీనికి చాలా మంది అభ్యంతరం పెట్టారు. కొంతమంది ఈ ఉపమానం వల్ల అపోహలు వస్తున్నవన్నారు. కొంతమంది మార్క్స్ చెప్పింది తప్పు అన్నారు. మరి కొంతమందేమో మార్క్స్ చెప్పింది తప్పేమి కాదు కానీ ఉపమానం పొరపాటు అవగాహన కలిగి స్తుందన్నారు. పునాది ఉపరితలం అనే ఉపమానాన్ని మనం యథా తథంగా తీసుకుంటే ఉపరితలం పునాదిని ప్రభావితం చెయ్యలేదు, పునాది మాత్రం ఉపరితలాన్ని ప్రభావితం చేస్తుంది అనే అర్థం వస్తుంది. అంటే పునాదిని దెబ్బ తీస్తే ఏ నిర్మాణమైనా కుప్పకూలిపోతుంది. దీన్ని బట్టి ఈ సమాజాన్ని మార్చాలి అంటే పునాదిని మార్చితే సరిపోతుంది, ఉపరితలాన్ని మార్చే కృషి మనకు అవసరం లేదు అనే అర్థం వస్తుంది. అంటే సాంస్కృతిక రంగం, రాజ్యం, మత వ్యవస్థ వంటి భావ వ్యవస్థలను మార్చడానికి సంఘర్షణ, పోరాటం అనేవి అవసరంలేదు. పునాది అయిన వర్గ, ఆర్థిక వ్యవస్థలో పోరాటాలు చేస్తే సరిపోతుంది అని మార్క్స్ చెప్పాడు అని దీనికి వ్యాఖ్యానం చేశారు. మార్క్స్ చెప్పిన ఉపమానం అటువంటి వ్యాఖ్యానానికి కారణం అయింది.

ఈ వ్యాఖ్యానాన్నే మనం రోజువారి పరిభాషలో ఎకనామిజం అంటాం. అంటే ఆర్థిక పోరాటాలు, ఇతర వర్గ పోరాటాలు చేస్తే చాలు, కులం, మతం వంటివి కూడా అంతం అయిపోతాయని చెప్పడం. అలాగే ఆర్థిక పోరాటాలు చేస్తే భావ మార్పు దానంతట అదే జరుగుతుందని చెప్పడం. ఆర్థిక పోరాటాలు చేస్తూ ఉంటే కార్మికుల్లో సోషలిజం కావాలనే చైతన్యం ఆటోమెటిక్‌గా వస్తుంది అని చెప్పడం. కమ్యూనిస్టు ఉద్యమంలో దీనిపై చర్చ నాటి నుండి నేటివరకు జరుగుతూనే ఉంది. కమ్యూనిస్టు ఉద్యమంలో ఉపరితలానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే డీవియేషన్ ఎక్కడ కనబడదు కానీ ఉపరితలాన్ని విస్మరించే డీవియేషన్

> **"సాంస్కృతిక రంగంలో పునాది-ఉపరితలం అనే మార్క్సిస్టు పదజాలాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే ఆర్థిక నియతివాదం (ఎకనామిజం)లోకి వెళతాము. ఎకనామిజం తప్ప, దాన్ని అధిగమిం చేందుకు సాంస్కృతిక రంగంలో, భావ జాల రంగం లో కూడా కృషి చేయాల్సి వస్తుంది."**

మాత్రం అనేక సందర్భంలో వస్తోంది. ముఖ్యంగా రివిజనిజం ప్రధానమైన సిద్ధాంతమే అది. కాట్‌స్కీ లాంటివాళ్లంతా చెప్పిన సిద్ధాంతం. పెట్టుబడిదారీ వ్యవస్థకు సహాయపడి, ఉత్పత్తి శక్తులను బాగా పెంచితే పునాదిలో మార్పు వస్తుంది. అప్పుడు ఉపరితలం బాగు పడుతుంది అనేది వీరి వాదన. కాబట్టి రష్యన్ విప్లవంలో మెన్షివిక్కులు ప్రతి సందర్భంలోనూ 'మనం పెట్టుబడిదారులను కూలదోయకూడదు, వాళ్లను అధికారానికి తీసుకురావాలి, వాళ్ళు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహాయం చేయాలి' అనే వైఖరి తీసుకునేవారు.

కానీ ఇటువంటి చర్చకు ఎంగెల్స్ సమాధానం చెప్పాడు: నేను ఎప్పుడూ ఉపరితలం యొక్క ప్రమేయం లేదు అని అనలేదు. కొన్ని సందర్భాల్లో ఉపరితలమే ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. కాకపోతే ఒక సుదీర్ఘకాలంలో చూసుకున్నప్పుడు అంతిమంగా పునాది ముఖ్యమైన నిర్వహిస్తది అన్నాం. అంతే తప్ప ఉపరితలం ప్రభావం ఉండదని చెప్పలేదు అని ప్రత్యేకంగా ఉత్తరాల్లో ఆయన రాయాల్సిన పరిస్థితి వచ్చింది. మార్క్స్ అంతిమంగా పునాది నిర్ణయిస్తుంది అన్నాడు కాబట్టి అన్నిటినీ ఆర్థికంతో ముడిపెట్టే ధోరణి కొనసాగుతూ వస్తోంది. దీన్నే ఆర్థిక నియతివాదం (ఎకనామిక్ డిటర్మినిజం) అంటారు. ఆర్థిక నియతివాదం పనికిరాదు. సమాజాన్ని ఒక మొత్తంగా ఆలోచించాలి తప్ప విడివిడిగా అంటే ఆర్థికం, సామాజికం, సాంస్కృతికం...ఇలా విడదీసి చూడ్డం సరికాదని లూకాక్స్ వంటి వారు చెప్పారు. ఇవన్నీ పరస్పర ఆధారంగా ఉంటాయి. పరస్పరం ప్రభావితం చేసుకుంటాయి. ఆయా సందర్భాలను బట్టి ఒకటి ముఖ్యం అవుతుంది. ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ అనేది నిర్దిష్టంగా అధ్యయనం చెయ్యాల్సిందే తప్ప సిద్ధాంత పరంగా ఒకదాన్ని విడదీసి ఏకపక్షంగా ముఖ్యం కాదు అని చెప్పటం తప్పు అన్న అంశంపై స్థూలంగా ఇప్పుడు ఏకీభావం ఉంది.

అందువల్ల సాంస్కృతిక రంగంలో పునాది –ఉపరితలం అనే మార్క్సిస్టు పదజా లాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే ఆర్థిక నియతివాదం (ఎకనామిజం)లోకి వెళతాము. ఎకనామిజం తప్ప, దాన్ని అధిగమించేందుకు సాంస్కృతిక రంగంలో, భావ జాల రంగంలో కూడా కృషి చేయాల్సి వస్తుంది. కొన్ని సందర్భాలలో ఈ భావజాల రంగంలో కృషి, ఆర్థిక రంగంలో కృషి కన్నా ముందుకు రావచ్చు. ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితుల్లో ఆర్థిక రంగంలో వర్గ పోరాటం వెనుక పట్టు పట్టింది. వెనుక పట్టు పట్టడం కాదు ఆర్థిక రంగంలో పోరాటం చాలా కష్ట భూయిష్టం అయింది. ఇలాంటప్పుడు భావ జాల రంగం నుంచి వచ్చి ఆర్థిక రంగాన్ని ఉత్సాహపరచాల్సి వస్తుందని మనం అనుకోవచ్చు. కాబట్టి ఇది కూడా మనం ఆలోచించాలి.

**సాంస్కృతిక పరిణామం – వైవిధ్యం**

సంస్కృతి సమాజంలో అంతర్భాగం. సమాజంతో పాటు నిరంతరం పరిణామం చెందుతుంది. ఆదిమ వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థలకు సంబంధించిన సాంస్కృతిక రూపాలు, విలువలు కూడా ఆయా వ్యవస్థలకు తగ్గట్టుగా ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. ఒకే వ్యవస్థలో కూడా భాషా, మతం, వాతావరణం, వారసత్వం వంటి అనేక ఇతర అంశాల ప్రభావం వల్ల అనేక వైవిధ్యాలు ఏర్పడతాయి.

సాంస్కృతిక రూపాల్లో చాలా వైవిధ్యం ఉంటుంది. అయితే, రూపాల్లో వైవిధ్యానికీ, భావాల్లో వైవిధ్యానికీ ఉన్న తేడాలను గమనించాలి. రూపాలు వేరుగా ఉన్నా, సమాజ వ్యవస్థ స్వభావాన్ని బట్టి భావాల్లో సారూప్యత ఉంటుంది. ఏ సమాజంలోనైనా ఆధిపత్య విలువలు, అవశేష విలువలు, ఆవిర్భవిస్తున్న విలువలు ఉంటాయి. పాత సమాజాలనుండి సంక్రమించిన నమ్మకాలు, విలువల్లో కొన్ని మృతప్రాయమైనవి, తిరస్కరించాల్సినవి ఉంటాయి. కొన్ని సజీవంగా ఉండి ప్రస్తుతానికి, భవిష్యత్‌కు ఉపయోగపడేవి ఉంటాయి. రెండవ తరహా వాటిని స్వీకరించి ప్రోత్సహించాల్సి ఉంటుంది.

**ఆధిపత్యం: పాలకవర్గ భావాలు – ప్రాచుర్య భావాలు**

ఇక గతంలోనే చెప్పినట్లు సంస్కృతి అనే దాన్ని ఒకే ఒక సార్వజనిన భావంగా మనం తీసుకోకూడదు. మార్క్సిస్టులు చెప్పే సంస్కృతి అంటే ఆధిపత్య సంస్కృతనే అర్థం చేసుకోవాలి. పాలకవర్గ భావాలే ప్రాచుర్య భావాలు అన్నాడు మార్క్స్. అందరూ నమ్మే భావాలు పాలక వర్గ భావాలు. కాబట్టి సాంస్కృతిక రంగంలో వ్యాపించి ఉండే అర్థాలు, విలువలే పాలక వర్గానివే. ఆ భావాల్నే మనం సంస్కృతిగా తీసుకుంటున్నాం. కాబట్టి సంస్కృతి గురించి మాట్లాడేటప్పుడు ఆధిపత్య సంస్కృతి అర్థంలోనే మాట్లాడాలి. ఈ ఆధిపత్య సంస్కృతిలో అధీన సంస్కృతి ఎక్కడన్నా ఉన్నదా, ఎక్కడన్నా ఏ మూలన్నా నక్కి ఉన్నదా, అని కనుగొనే ప్రయత్నం చెయ్యాలి. విమర్శనారహితంగా సంస్కృతినంతటిని సమర్థించి గొప్ప సంస్కృతి కింద చెప్పకూడదు. వాస్తవంగా సంస్కృతి అంతా ఒక్కటే అన్న భావం కల్పించటం సామ్రాజ్య వాద లక్షణం. తమ భావాలు, తమ ప్రయోజనాలు, తమ లక్షణాలన్నీ తమవి కావు విశ్వజనీనమైనవి, అందరివీ అని చెప్పి నమ్మించే కృషినే హెజమోని (ఆధిపత్యం) కృషి అంటాం. ప్రజలు దీన్ని నమ్ముతారు. మార్క్సిస్టులు కూడా ఇదంతా ఒక్కటే సంస్కృతి అనుకుంటే మనం కూడా ఆ హెజమోనిలోకి పోయినట్లే. అంటే మనం కూడా కోఆప్షన్ అయిపోయాం అన్నమాట. మనం కూడా పాలక వర్గాలలో కలిసిపోయామన్నమాట.


నేటి సామాజిక వ్యవస్థలో ఫ్యూడల్ విలువలు, పెట్టుబడిదారి విలువలు ఆధిపత్యం కలిగి ఉండేట్టు చూసుకుంటున్నాయి. ఇక్కడ గౌతమ బుద్ధుని ప్రేమిస్తారు. అంబేద్కర్‌ని ప్రేమిస్తారు. జ్యోతిబా పూలేని ప్రేమిస్తారు. గురజాడ అప్పారావునీ ప్రేమిస్తారు. ఇంకో పదేళ్ళకో, పదిహేనేళ్ళకో సుందరయ్యను కూడా ఆ స్థితికి తీసుకువస్తారు. అంటే ఆధిపత్య సంస్కృతుల్లోకి వీళ్ళందర్నీ పరివర్తన (ట్రాన్స్‌ఫాం) చేసి, వీళ్ళని పలచనజేసి, శుద్ధి చేసి, కో–ఆప్ట్ చేసుకుంటారు. కో–ఆప్ట్ చేసుకోవడం అనేది ఆధిపత్య సంస్కృతి లక్షణాల్లో ముఖ్యమైనది. వాస్తవంగా అలా మార్చటానికీ, పలుచన చెయ్యటానికీ సాధ్యం కాని వాటిని

నాశనం చేసేస్తారు. చరిత్రలో చార్వాకుల్ని, ఇతరుల్నీ నాశనం చేసినట్లు. వారి ఆనవాళ్లు కూడా మనకి కనబడకుండా చేస్తారు. రాజ్యం, రాజ్య వ్యవస్థ ప్రజల్ని బలవంతంగా అధీనంలో ఉంచుకొనేందుకు ప్రయత్నం చేస్తే. మిగతా సాంస్కృతిక వ్యవస్థ ఆధిపత్య వర్గాల భావాల్నీ, విలువల్నీ అందరి భావాలూ, విలువలుగా నమ్మించడం ద్వారా ప్రజలను తమ ఆధిపత్యం లోకి తెచ్చుకోవడాన్నే హెజిమోని అంటున్నాం. ఈ హెజిమోనిలో బలవంతం ఉండదు. నమ్మించడం ఉంటుంది. అలా నమ్మించగలిగితే సాంస్కృతిక వ్యవస్థ చాలా శక్తిమంతంగా ఉన్నట్లు. ఈ రోజు సామ్రాజ్యవాద సంస్కృతి అటువంటి శక్తి కలిగి ఉంది. సైనికంగా బలహీనపడుతుంది. ఆర్థికంగా బలహీనపడుతుంది. అవన్నీ బలహీనంగా ఉన్నా సరుకు (కమొడిటీ) బలంగా వ్యాపించి ఉన్నది. సంస్కృతిని సరుగ్గా మార్చింది. పెట్టుబడిదారీ విధానానికి వ్యాపారం అనేది మందుగుండే అయితే మార్కెట్ అనేది ఆయుధం. ఆ మార్కెట్ వీధివీధికీ, వాడవాడకూ, మూలమూలకు వ్యాపించి ఉన్నది. తద్వారా తన హెజిమోనిని సాధిస్తున్నది.

> **“ కమ్యూనిస్టులం ఈ హెజిమోనీలో పడిపోకూడదు. ఉదాహరణకు మా యాస గొప్పది, మా తిండి గొప్పది అంటాం. మా కట్టుబొట్టు గొప్పవి అని చెబుతాం. నిరంకుశ వాదులు రూపానికి ప్రాధాన్యత ఇచ్చే వారు ఎప్పుడూ యథాతథ వాదులైఉంటారు. ఎందుకంటే రూపం అంత త్వరగా మారదు. రూపాన్ని యథాతథంగా ఉంచటం అంటే సమాజాన్ని యథాతథంగా ఉంచటం. ”**

కమ్యూనిస్టులం ఈ హెజిమోనీలో పడిపోకూడదు. ఉదాహరణకు మా యాస గొప్పది, మా తిండి గొప్పది అంటాం. మా కట్టుబొట్టు గొప్పవి అని చెబుతాం. నిరంకుశ వాదులు రూపానికి ప్రాధాన్యత ఇచ్చే వారు ఎప్పుడూ యథాతథ వాదులై ఉంటారు. ఎందుకంటే రూపం అంత త్వరగా మారదు. రూపాన్ని యథాతథంగా ఉంచటం అంటే సమాజాన్ని యథాతథంగా ఉంచటం. రూపం మారకుండా ఉంటే రూపంతో పాటు సారాన్ని కూడా కొనసాగించటం సులువు. ఇటువంటి ప్రమాదంలో కమ్యూనిస్టులం, మార్క్సిస్టులం పడుతుంటాం.

రెండోది భిన్నత్వంలో ఏకత్వం అనే మాట మనం సాధారణ అర్థంలో వాడేస్తుంటాం. దీనికి ఒక సానుకూలమైన అర్థం ఉన్నది కాబట్టి దాన్నే వాస్తవ అర్థంగా మార్చేస్తున్నాం. కుల వ్యవస్థ కూడా భిన్నత్వంలో ఏకత్వమే. మరి దాన్ని రద్దుచేసి నాశనం చేయాల్సిన పనేముంది. మల్టీ కల్చరిజం, అంటే బహుళ సంస్కృతులు కలిసి ఉండడం వంటి కాన్సెప్ట్‌లను ఆధునీకానంతర వాదం ముందుకు తీసుకొస్తోంది. నల్లజాతి ప్రజల సంస్కృతి ఈ రోజు అధీన సంస్కృతి. తెల్లజాతి సంస్కృతి ఆధిపత్య సంస్కృతి. అయితే దీనికి తెల్లజాతి ప్రజలు బాధ్యులు కాదు. కానీ



కొనడానికే పుట్టావురా నాన్నా!

ఆ సంస్కృతి యొక్క అర్థాలు, విలువలు దాన్ని ప్రతిపాదిస్తున్నవి. కాబట్టి ఒక ఆధిపత్య సంస్కృతి, ఒక అధీన సంస్కృతి ఇవన్నీ కలిసి పక్కపక్కనే నివసించడం అనేది గొప్ప విషయంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే మల్టీకల్చరలిజం లేక భిన్నత్వంలో ఏకత్వం అనేదాన్ని కొన్ని సందర్భాల్లో మనం ఒక శత్రువుకి వ్యతిరేకంగా పోరాడేందుకు ఉపయోగించుకోవచ్చు. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పనికొచ్చేప్పుడు 'స్వాతంత్ర్యం, సమానత్వం, ప్రజాస్వామ్యం' నినాదాలను మనం ఉపయోగించుకోవచ్చు. కాని పెట్టుబడిదారీ వర్గానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అంటే ఏమిటి? సరుకులు ఎక్కడికంటే అక్కడ ప్రయాణం చేయటానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం. సమానత్వం ఏమిటి భారతదేశం సరుకు, అమెరికా సరుకు రెండూ సమానంగా వ్యవహరించే దానికి సమానత్వం. అసమానుల మధ్య సమానత్వం. అసమానతలు పోయే సమానత్వం కాదు. అందుకని ఈ పదాలు ఏ వ్యవస్థకి వ్యతిరేకంగా వాడుకున్నాం అనే దాన్ని బట్టి కూడా వాటియొక్క అర్థం ఉంటుంది. కాబట్టి భిన్నత్వంలో ఏకత్వం, అలాగే బహుళ సంస్కృతుల సంగమం ఇట్లాంటి మాటలు మనం పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా వాడినప్పుడు వీటి అర్థాలు స్పష్టంగా ఉండాలి.

సామ్రాజ్యవాదం సంస్కృతి మొత్తాన్ని సరుకులుగా మార్చుకోవాడం ద్వారా తన ఆధిపత్యంలోకి తెచ్చుకుంటుంది. సరుకుగా మారనిది ఏదైనా ఉంటే దాన్ని పక్కకు నెట్టేయవచ్చు, నాశనం చేయవచ్చు. లేక అది సరుకుగా మారి తనకు ఉపయోగపడుతుందంటే దాని రూపాన్ని, పేరుని మార్చేసి, సరుకుగా మార్చేసి దాన్ని తన సరుకుల జాబితాలో కలిపేసుకొంటుంది. ఆ రోజున ఉన్న శాస్త్రపరిజ్ఞానం ఇంటర్నెట్, కమ్యూనికేషన్ సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు వచ్చేసిన తర్వాత ఏ మూల ఏ ప్రాంతం ఏ బ్రాంచ్‌లోనైనా అమ్ముకోగలిగిన అవకాశం వచ్చిన నేటి కాలంలో అన్నింటిని నాశనం చేయవలసిన అవసరం సామ్రాజ్యవాదానికి లేకుండా వినియోగించుకుంటున్నది.

అందువల్ల సాంస్కృతిక సామ్రాజ్యవాదం అనేదాని విషయంలో మనం స్పష్టంగా లేకపోతే స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జీవోలు) చెప్పే వాదనలో పడి కొట్టుకుపోయే అవకాశం ఉంది. భాష విషయంలో కూడా ఇదే రకమైన స్పష్టత మనకు ఉండాలి. ఇంగ్లీషు అవసరం లేనంతగా తెలుగుభాషను నీవు అభివృద్ధి చేసుకుంటే తెలుగు నాశనం కాకుండా ఉంటుంది. లేకపోతే తెలుగు భాషను అనివార్యంగా ఇంగ్లీషు ఆక్రమిస్తుంది. అంటే ప్రపంచంలో ఏ అర్థాన్నయినా ఇవ్వగలిగే విధంగా తెలుగును అభివృద్ధి చేసుకుంటే అటువంటి పరిస్థితి రాదు. అప్పుడు చిన్నవైన జర్మనీ, జపాన్, ఫ్రెంచ్ భాషల మాదిరిగా తెలుగు కూడా బతుకుతుంది. అలా కానప్పుడు సంస్కృతం, గ్రీకు భాషల మాదిరిగా తెలుగు కూడా నాశనమవుతుంది. కాబట్టి సామ్రాజ్యవాదం ఏం చెప్తుందంటే అన్నిటిని సరుకులుగా వ్యాప్తిచేసి, సరిహద్దులు లేకుండా అమ్మకాలు చేస్తున్నప్పుడు నీ సరుకన్నా బయటకు పోవాలి? లేదా వాళ్ళ సరకన్నా నీవద్దకు రావాలి.

**“ప్రపంచీకరణ నేపథ్యంలో సాంస్కృతిక రంగంలో చాలా తీవ్రమైన మార్పులు వచ్చాయి. విలియమ్స్ వంటివారు చెప్పింది ఏమిటంటే సాంస్కృతిక రంగాన్ని భావజాలం రంగంగానే చూడకూడదు. అది ఇప్పుడు భౌతిక రంగం అయింది. సంస్కృతి అనేది భౌతిక ఉత్పత్తిగా మారింది. బియ్యం ఎట్లా ఉత్పత్తి చేస్తారో, తారు ఎట్లా ఉత్పత్తి చేస్తారో, నాటకాలను కూడా అలానే ఉత్పత్తి చేస్తున్నారు.”**

సరుకులను రానీయను, బయటకు పోనీయను అంటే కుదరదు. నీ భాష ఎక్కడకు పోయినా చలామణీయ్యేట్లు నీవు చేసుకోవాలి. అప్పుడు అది బతుకుతుంది. తమిళనాడు వాళ్ళు ఎప్పుడో ఆ ప్రయత్నం మొదలెశారు. ఇప్పుడు హింది వాళ్ళు కూడా అటువంటి ప్రయత్నం చేస్తున్నారు. చైనా వాళ్ళు ఆ ప్రయత్నం ముందు నుండే చేస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో సాంస్కృతిక రంగంలో చాలా తీవ్రమైన మార్పులు వచ్చాయి. విలియమ్స్, వంటివారు చెప్పింది ఏమిటంటే సాంస్కృతిక రంగాన్ని భావజాలం రంగంగానే చూడకూడదు. అది ఇప్పుడు భౌతిక రంగం అయింది. సంస్కృతి అనేది భౌతిక ఉత్పత్తిగా మారింది. బియ్యం ఎట్లా ఉత్పత్తి చేస్తారో, తారు ఎట్లా ఉత్పత్తి చేస్తారో, నాటకాలను కూడా అలానే ఉత్పత్తి చేస్తున్నారు. సినిమాలను ఉత్పత్తి చేస్తున్నారు. సాంస్కృతిక రంగం ఒక పెద్ద పరిశ్రమ అయిపోయింది. అందుకని ఇప్పుడు సాంస్కృతిక రంగం కేవలం భావజాల రంగం కాదు, సాంస్కృతిక పరిశ్రమ అయింది. కాబట్టి ఇతర రంగాలకీ, సాంస్కృతిక రంగానికీ వ్యత్యాసం ఏమీ లేదు. అక్కడ కార్ల ఉత్పత్తి జరిగితే, ఇక్కడ పుస్తకాల ఉత్పత్తి, సినిమాల ఉత్పత్తి, సీరియల్స్ ఉత్పత్తి జరుగుతాయి. అక్కడ కోకాకోలా మినిమయం అయితే ఇక్కడ సినిమా మినిమయం అవుతున్నది. ఆ విధంగా ఇతర వినిమయ వస్తువుల ఉత్పత్తికీ, సాంస్కృతిక రంగ ఉత్పత్తికీ వ్యత్యాసం లేకుండా పోయింది. ఇంతకుముందు ఎక్కడైనా కొన్ని భావాలుగా మిగిలి ఉన్నా ఆ భావాలన్నింటినీ కూడా ఇప్పుడు ప్రపంచీకరణ వినిమయ సరుకులుగా మార్చేసింది. డాక్టర్ సలహా చాలా కాలం క్రితమే సరుకు అయింది. ఇప్పుడు పెళ్ళి కూడా సరుకు అయింది. పెళ్ళి సంబంధాలు చూడటం ఒక సరుకు. ఆ విధంగా ప్రపంచీకరణ వచ్చిన తరువాత సాంస్కృతిక రంగం అంతా సరుకులు, అమ్మకాలు కొనుగోళ్లు అయిపోయాయి. కొవ్వుమీద ఆసక్తి మానవునికి జన్యుపరమైనది. దాన్ని ఆసరా చేసుకుని చాక్లెట్లు, కొవ్వు వస్తువులు అమ్ముతున్నారు. దాంతో ఊబకాయం వచ్చింది. ఊబకాయం అనేది పెద్ద అవమానకరమైన విషయం అని మళ్ళీ ప్రచారం చేస్తారు. అంటే కాస్త లావుగా ఉంటే అది అందం కాదనీ, సన్నగా ఉంటే అందం అనీ ఒక సాంస్కృతిక అర్థాన్ని ముందు సృష్టిస్తుంది. అప్పుడు లావుని తగ్గించుకోవడం అనేది ఒక సరుకు. సన్నబడటం అనేది ఒక సరుకు. అలాగే స్త్రీలు సన్నగా వుంటేనే అందమైన వాళ్ళు, వాళ్ళకి పెళ్ళిళ్ళు అవుతవి అని ఒక పెద్ద భావం సృష్టించి దాన్ని సరుకుని చేసి అమ్ముకుంటున్నారు. బార్బీ డాల్‌ని ప్రచారం చేసిన తరువాత ఆడపిల్లలు ఎదిగాక బార్బీ డాల్‌లా ఎలా ఉండాలి అని రకరకాలుగా ప్రయత్నిస్తారు. అదో పెద్ద మార్కెట్ అయింది.

కాబట్టి ప్రపంచీకరణలో అన్నీ, చివరికి సంస్కృతి కూడా సరుకులుగా మారుతుంది. దీన్నే వినిమయ సంస్కృతి అంటున్నాం. ఒక వ్యక్తి వినియోగించే వస్తుసముదాయం ద్వారా అతని స్టేటస్ నిర్ణయించడం వినిమయవాదం. అందుకనే ఇప్పుడు ప్రతి ఇంటి డ్రాయింగ్ రూం ఒక షాపుగా మారిపోతోంది. ఆ షాపును బట్టి నీ స్టేటస్ వ్యక్తం అవుతోంది. ప్రపంచీకరణ ఈ రకమైన వస్తు వినిమయ సంస్కృతిని పెంచి పోషిస్తోంది. ఈ వస్తువులు నీ సంపాదనతో కొనాలంటే చాలా కాలం పడుతుంది. కాబట్టి ఇప్పుడే అప్పులిచ్చి నీ చేత కొనిపిస్తున్నారు. ఆ రకంగా మొత్తం విలువల్ని మార్చారు.

సరుకులనూ, విశ్రాంతినీ వినియోగించే రీతులను కూడా సంస్కృతి అంటారు. మానవుడు విశ్రాంతిని గతం నుండీ వినియోగిస్తున్నాడు. కానీ ప్రపంచీకరణ ఇప్పుడు విశ్రాంతి మొత్తాన్ని సరుకుల్ని వినియోగించటంగా మార్చింది. విశ్రాంతిని వినియోగించుకోవడం అంటే గతంలో ఇంటిముందు అరుగుమీద కూర్చొని మాట్లాడుకునేవారు. లేకపోతే నాటకాలు, రిహార్సిల్స్ వంటివి చేసేవారు. ముసలివాళ్ళు అంతా ఒక చోట కూర్చొని ముచ్చట్లు చెప్పుకునేవారు. టీ దుకాణం దగ్గర కూర్చొని నాలుగు కబుర్లు చెప్పుకునేవారు. ఇప్పుడు విశ్రాంతి స్వరూపమే మారిపోయింది. ఆ విశ్రాంతి రెండుగంటలు ఉంటే గంట టి.వి.ముందుకు కూర్చుంటావు. లేకపోతే కంప్యూటర్ ముందు కూర్చుంటావు, సోషల్‌నెట్‌వర్క్ చేస్తుంటావు. ఇప్పుడు రెండు గంటల సమయం ఉన్నదను కోండి ఆ రెండు గంటలు ఎవరికైనా అమ్ముకుంటావు. లేదా అరగంట చిట్టీలు వేసే చోట కూర్చుంటావు. అందుకని గతంలో విశ్రాంతి అనేది నీ యొక్క వస్తువు. ఇప్పుడది వస్తువు కాదు. విశ్రాంతిని ఒక సరుకుగా మార్చేసింది. ఇప్పుడు నీకు రెండు గంటలు విశ్రాంతి కాలం ఉంటే అరగంట సెల్‌ఫోన్ మాట్లాడేస్తావు. సెల్‌ఫోన్ వాడితే నీకు నష్టం, కంపెనీ వాడికి లాభం. కాబట్టి విశ్రాంతిని వినియోగించుకోవటంలో విపరీతమైన మార్పులు వచ్చాయి. ఈ మార్పుల వలన వర్గ పోరాటంలో పాల్గొనే స్థితి కూడా తగ్గిపోయింది. మీటింగులకు రావడం కాని, సమావేశాలకు కూర్చోవడం కాని తగ్గిపోతోంది. అప్పుచేసి వినిమయ వస్తువులు తీసుకున్న తరువాత వాయిదాలు తీర్చడమే నీకు ప్రధానఅంశం అవుతుంది. ఆ వాయిదాలు తీర్చటానికి ఆ విశ్రాంతి సమయం కూడా వినియోగిస్తాం. వినియోగించటానికి వాయిదాలు కట్టి అప్పు తీర్చేదానికి అప్పుడు విశ్రాంతిని ఉపయోగిస్తావు.

ఆ రకంగా నయా-ఉదారవాదం సమాజంలోని మనిషిని సంపూర్ణంగా తన అధీనంలోకి తెచ్చుకుంది. ఇంతకుముందు కార్మికుడికి పరాయికరణ పాక్షికంగా ఉండేది. ఇంతకు ముందు శ్రమను 8గంటలకు అమ్ముకుంటే ఆ 8గంటలే యజమాని ఆధిపత్యం ఉండేది. మిగిలిన గంటల్లో కార్మికునికి తనపై తన ఆధిపత్యం ఉండేది. ఇప్పుడు నిద్రలో కూడా ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యమే ఉంటుంది. అప్పులు, వాయిదాలకు సంబంధించిన కలలు వస్తాయి. అందుకని ఆత్మహత్యలు, మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నవి. కాబట్టి మనిషి తన శరీరం మీద తన ఆధిపత్యం కోల్పోవడం అంటే పరాయికరణ సంపూర్ణమైన స్థాయిలో పెరిగిపోయినట్లు.

**ప్రత్యామ్నాయ సంస్కృతి**

ప్రత్యామ్నాయ సంస్కృతికి సంబంధించి రెండు అంశాలున్నాయి.

మానవుడు కొత్త సమాజపు విలువల్ని పాటిస్తూ జీవించే పద్ధతిని ప్రత్యామ్నాయ

సంస్కృతి అంటారు. ఈ వ్యవస్థలో ప్రత్యామ్నాయ సంస్కృతికి కూడా అవకాశం ఉంది. ఎప్పుడంటే, ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణానికి అవకాశాలు ఉన్న తరగతుల్ని, సందర్భాల్ని, కార్యాచరణల్నీ గమనించి వాటిని అభివృద్ధి చేసి క్రమబద్దీకరించి, స్థిరపర్చే ప్రయత్నం చేయడం ద్వారా ఆ పనిచేయగలం. ఉదాహరణకు కార్మికులు సహకరించుకొని సంఘం పెట్టుకోవడం ప్రత్యామ్నాయ సంస్కృతి. సభ్యత్వం చేర్పించి ఎవరి ఇళ్ళ దగ్గర వారు పడుకుంటే అది ప్రత్యామ్నాయ సంస్కృతి కాదు. సభ్యత్వం చేర్పించి, యూనియన్ పెట్టిన తరువాత సమానమైన వ్యక్తులు సంఘంలో సమూహంగా చేరి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల వ్యక్తివాదాన్ని వదులుకొని సమిష్టిగా ఉండాలని నిర్ణయించుకుంటే అది ప్రత్యామ్నాయ రూపం అవుతుంది. ఆ ప్రత్యామ్నాయ రూపాన్ని ఒక సాంస్కృతిక ప్రాక్టీస్‌గా మార్చగలిగాం అనుకోండి ఆ ట్రేడ్‌యూనియన్ ఒక సహకార సంస్థ పెట్టుకోవడం, ఆ ట్రేడ్‌యూనియన్‌లో అందరూ కలిసి నిత్యజీవితాంశాలన్నింటిలో సహకరించుకోవడం మొదలైనవి. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యక్తివాదాన్ని పెంచి పోషిస్తే, దానికి ప్రత్యామ్నాయంగా సమిష్టి కార్యాచరణను మనం పెంచాలి. సమిష్టి వాదం ముందుకు తీసుకురావాలనుకున్నప్పుడు నీ తరగతికి సంబంధించిన చావులు, పుట్టుకలు, పండగలు మొదలైన వాటిల్లో సామూహిక సహకార ధోరణులు కొత్త పద్ధతిలో అనుసరించాలి. గతంలో అనుసరించిన క్రతువుల్లో మూఢనమ్మకాలు లాంటి వాటిని మినహాయించి చేస్తే సామూహిక వాతావరణం వస్తుంది.

మొత్తంగా చెప్పేదేమంటే, ప్రత్యామ్నాయ సంస్కృతికి ఈ వ్యవస్థలోనే కొన్ని అవకాశాలు ఉన్నవి. వాటిని ఉపయోగించుకోవాలి. ఉదాహరణకు మేడే సందర్భం. ప్రతి కార్మికుడు మేడే నాది అనుకుంటాడు. ఆ రోజు సెలవిస్తారు. సెలవివ్వకపోయినా సాధారణమైన మార్క్సిస్టులే కాదు మేడేని అందరూ తమది అనుకుంటారు. మేడే రోజు జెండాలు పట్టుకుని ప్రదర్శన చేయడమే కాకుండా నాటకాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలతో దాన్ని ఒక సాంస్కృతిక మేళాగా నిర్వహించాలి. మేడే రోజు మన చుట్టుపక్కలవారినీ, బంధువుల్ని పిలిచి భోజనం ఎందుకు పెట్టకూడదు? మనం ప్రత్యామ్నాయ సంస్కృతి అందించకపోతే ప్రజలు పాత సంస్కృతిలోనే ఉంటారు. ప్రత్యామ్నాయ సంస్కృతి రూపాలు ఈ వ్యవస్థలో బీజ రూపాల్లో

> **“పెట్టుబడిదారీ వ్యవస్థలో మనం అనుకుంటున్న ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రధానమైన రూపం చెయ్యలేం. పెట్టుబడిదారీ వ్యవస్థను బద్దలుకొట్టి, ప్రజల్నందర్నీ సమీకరించే కొద్ది ప్రత్యామ్నాయాలు బలపడుకుంటూ వస్తాయి. ఆ రకంగా పెట్టుబడిదారీ విధానాన్నీ, దాని సంస్కృతినీ బలహీనం చేయాలంటే ఆ సంస్కృతిని ఎండగట్టి, దాని లో మంచి అంశాలు ఏమైనా ఉంటే వాటిని బయటకు తీసేందుకు ప్రయత్నం చేయాలి. అంటే సాంస్కృతిక విమర్శ (కల్చరల్ క్రిటిసిజం) అనేది మన పనిలో ప్రధానమైన అంశంగా ఉండాలి.”**

చాలా ఉన్నాయి. ఆ బీజరూపాల్ని పెద్దవి చేసి వాటిని ముందుకు తీసుకురావటం ఎట్లా అనేది చూడాలి.

కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో మనం అనుకుంటున్న ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రధానమైన రూపం చెయ్యలేం. పెట్టుబడిదారీ వ్యవస్థను బద్దలుకొట్టి, ప్రజల్నందర్నీ సమీకరించే కొద్ది ప్రత్యామ్నాయాలు బలపడుకుంటూ వస్తాయి. ఆరకంగా పెట్టుబడిదారీ విధానాన్నీ, దాని సంస్కృతినీ బలహీనం చేయాలంటే ఆ సంస్కృతిని ఎండగట్టి, దానిలో మంచి అంశాలు ఏమైనా ఉంటే వాటిని బయటకు తీసేందుకు ప్రయత్నం చేయాలి. అంటే సాంస్కృతిక విమర్శ (కల్చరల్ క్రిటిసిజం) అనేది మన పనిలో ప్రధానమైన అంశంగా ఉండాలి. సాహిత్యం సినిమా, నాటకాలు, పెళ్ళి, తంతులు – అన్నిటిపై విమర్శ ఉండాలి. మాటల ద్వారా, రాతల ద్వారానే కాదు, ప్రత్నామ్నాయ రూపాల సృష్టి ద్వారా కూడా విమర్శ చేయవచ్చు. ఉదాహరణకు, ప్రత్యామ్నాయ సినిమా తీయవచ్చు. ఇప్పుడున్న సినిమాను ఏకి పాతరేసి పుస్తకం రాయొచ్చు. సెమినార్‌పెట్టొచ్చు. టీవీ సీరియళ్ల మీద విమర్శ పెట్టొచ్చు.

అంటే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపక్ష (అపొజిషనల్) కృషి ప్రత్యామ్నాయ (ఆల్టర్‌నేటివ్) కృషిగా చేయాలి. ఈ రోజు ఈ ప్రతిపక్ష కృషిని చాలా పెద్ద ఎత్తున ఉన్న ఆధిపత్యం సాంస్కృతిక వ్యవస్థలను బలహీనం చేయడం, బీజప్రాయంగా ఉన్న ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించుకుంటూ పోవడం ద్వారా ముందుకు పోవల్సిన అవసరం ఉంటుంది. గ్రామంలో పేద రైతులందరితో సహకార సంఘం పెట్టి ఎరువులు, మార్కెటింగ్ పనులు చేయడం లాభనష్టాలు పంచుకోవడం ఒక ప్రత్నామ్నాయం. ఇలా సహకారం చేసుకొని ఎరువులు సంపాదించుకుందాం అనే సహకార మనస్తత్వాన్ని అభివృద్ధి చేయకపోతే కమ్యూనిస్టు మనస్తత్వంతో వాళ్ళు విప్లవానికి ఎలా వస్తారు. అందుకని సమిష్టి సంస్కృతి ప్రోత్సహించడం, సమిష్టి ఉద్యమాలు చేయడం విడదీయరాని అంతర్భాగంగా ఉంటాయన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. చాలా సందర్భాల్లో మనతో నిమిత్తం లేకుండానే సమిష్టిగా వ్యవహరించే పని ప్రజలు చేస్తుంటారు. అటువంటి వాటినన్నింటిని కనిపెట్టి మనం ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఉంది.

**సాంస్కృతిక రంగంలో పార్టీ కృషి**

సాంస్కృతిక రంగ కృషిలో లోపాల్ని అధిగమించడానికి పనికొచ్చే కొన్ని సూచనలు.

1. ప్రజానాట్యమండలి ద్వారా పనే సాంస్కృతిక రంగం పని అనుకోకూడదు. ప్రజానాట్యమండలి ఇంకా సమర్ధవంతంగా, ఇంకా మెరుగ్గా, ఇంకా విస్తృతంగా అనేక

**‘మార్క్సిస్టు’ పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

> **" సంఘంలోని ప్రతివ్యక్తికీ ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉండాలి. ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వామి కావడమంటే ప్రతి వ్యక్తి సాంస్కృతిక సృష్టికర్త అయినట్లే. అప్పుడు సాంస్కృతిక వినియోగదారుడు లేకుండా పోతాడు. అందుకని సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ ప్రతిమనిషినీ సాంస్కృతిక వినియోగదారుడిగా మారుస్తున్నాయి. అందరినీ సాంస్కృతిక సృష్టి కర్తలుగా మార్చడమే దానికి విరుగుడు. "**

రూపాల్లో ఎలా చేయవచ్చో ఆలోచించవచ్చు. ఎంత బ్రహ్మాండంగా పనిచేసినా కూడా మొత్తం వ్యవస్థలో ఉండే సాంస్కృతిక కృషినంతటినీ ఒక సంస్థ చేయడం సాధ్యం కాదు. కాబట్టి సాంస్కృతిక రంగంలో పెట్టుబడిదారీ వినిమయ సంస్కృతికీ, కులవ్యవస్థ సంస్కృతికీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఇప్పటికే పోరాడుతున్న అన్ని రకాల శక్తులు, వ్యక్తులు, సంస్థలను ఒకే వేదిక మీదికి, లేక పలు వేదికల మీదికి తీసుకురావాలి. అలా తీసుకొచ్చేందుకు మన పార్టీ, ప్రజాసంఘాలు కృషి చేయాలి. అటువంటి వాటిని ప్రోత్సహించడానికి అవసరమైతే కొంతమంది వ్యక్తుల్ని, బృందాల్ని కూడా ప్రోత్సహించవచ్చు.

2. మన పత్రికలను బులెటెన్‌లులా కాకుండా సాంస్కృతిక పోరాటం నిర్వహించే పత్రికలుగా అభివృద్ధి చేయాలి. మన ప్రజా సంఘాల పత్రికలన్నీ నేడు బులిటెన్‌లు లాగా నడుస్తున్నవి. వాటిని బులిటిన్‌ల లాగా కాకుండా ఆ తరగతిలోనే పనిచేసే ఆ తరగతికి సంబంధించిన సాంస్కృతిక వేదికలుగా, రాజకీయ సాంస్కృతిక వేదికలుగా అభివృద్ధి చేయాలి. అంటే ఆ పత్రికలు యాజిటేటర్స్, ఆర్గనైజర్స్ ప్రాపగాండిస్ట్ అని అంటున్నామే అటువంటి స్థితికి రావాలి.

మీరు ఎన్ని యూనియన్‌లు పెట్టి, ఎన్ని సభలు పెట్టి, ఎన్ని చోట్లకు పోయి మాట్లాడితే ఏం మాట్లాడినా.. దానికన్నా పత్రికద్వారా ఒక రాజకీయ వ్యాఖ్యానం కానీ, ఒక విమర్శకానీ, ఒక సాంస్కృతిక రూపం కాని నాలుగు మూలలకు వెళ్ళితే, ప్రజలను అది ఇంకా బాగా చైతన్యం చేస్తుంది. పత్రిక వాళ్ళ నిత్యసాంస్కృతిక జీవితంలో ఎదుర్కొనే సంఘర్షణలో అంతర్భాగంగా ఉండాలి. పత్రికను అటువంటి పద్ధతిలో నడపడానికి లెనిన్ వర్కర్స్ కరస్పాండెంట్స్‌ని నియమించాడు. పేటల్లోను ఉండే వాళ్ళని విలేకరులుగా నియమించి వాళ్ళని వార్తలు రాయమనేవాడు. కథనాలు రాయమనేవాడు. వాళ్ళు భాష సక్రమంగా లేకపోతే కరెక్షన్స్ చేసి వేసుకునేవారు. అప్పుడు రెండు ప్రయోజనాలు నెరవేరేవి. ఆ పత్రిక చుట్టూ ఆర్గనైజేషన్ ఏర్పడేది.

ప్రస్తుత అవసరాల దృష్ట్యా కొత్తకొత్త పత్రికలను కూడా పెట్టాలి. ఉదాహరణకు సినిమా రంగం, టి.వి.లను విమర్శనాత్మకంగా (క్రిటికల్‌గా) చూడగలిగే సంస్కృతిని మనం అభివృద్ధి చేసేందుకు మన పత్రికలను వాడుకోవాలి. అవసరమైతే కొత్త పత్రికలు పెట్టాలి. టివీలో విస్తారంగా చూసే సీరియల్స్ మీద మనం క్రిటికల్ కామెంట్‌ని వ్యక్తం చేయొచ్చు, డిబేట్ నడపవచ్చు. సినిమానే గాక ఇంకా ఏమైనా ఇతర పత్రికలు అంటే, కన్స్యూమరిజం, విద్యా రంగం మొదలైన వాటి గురించి విమర్శనాత్మకంగా రాసే బృందాలను తయారుచేసుకోవాలి. ట్రెయిన్ చేసుకోవాలి.

ప్రజాసంఘాల కార్యకలాపాలన్నింటిలోనూ సాంస్కృతిక అంశం ప్రధానంగా ఉండాలి. సాంస్కృతిక అంశం అంటే వట్టి ఆట, పాటే కాదు. సదస్సు పెట్టినా, కరపత్రం వేసినా, కవితల పోటీలు పెట్టినా, కథల పోటీలు పెట్టినా, కార్మికుల యొక్క జీవితంమీద కార్టూన్ల పోటీ పెట్టినా, ఫోటోగ్రాఫర్స్ అందరికీ పోటీ పెట్టినా అన్నీ కూడా సాంస్కృతిక అంశాలే. కాకపోతే మనం ప్రోత్సహించే అంశాల్లో ప్రతిఘటన ఉండేట్లు చూడాలి. ప్రజల భాగస్వామ్యం ఉండాలి. గ్రాంసీ చెప్పిందేమిటంటే అందరూ కళాకారులే. కళాకారుడు కాని జనం ఎవ్వడూ లేడు. ఈ రోజు 120 కోట్ల సెల్‌ఫోన్‌లు ఉంటే 100 కోట్ల మంది ప్రజలు ఈ రోజు ఫోటో గ్రాఫర్స్ కింద మనం చెప్పుకోవచ్చు. కాబట్టి ఆ రూపంలో ఆలోచన చేయాల్సి ఉంది. తరు వాత విజ్ఞాన కేంద్రాలు, భవనాలు, మన ఆఫీసులు, పుస్తకాల షాపులు ఇవన్నీ సాంస్కృతిక సేవా కేంద్రంగా మారాలి.

జానపద కళాకారులనూ, కళారూపాలనూ ప్రోత్సహించాలి. మన ప్రజా సంఘాలు,ఉద్యమ శ్రేయోభిలాషులు కార్మికులు వాళ్లను పోషించాలి. వెనకటి కాలంలో భూస్వాములు వాళ్ళని పెంచి పోషించేవాళ్ళు ఇప్పుడున్న కాలంలో వాళ్ళని పెంచిపోషించే వాళ్ళు లేరు. మనం వాళ్ళని పోషించాలి. 1940 దశకంలో మాదిరిగా జానపద కళారూపాలను మనం సంస్కరించుకుని, వాటి సారాంశాన్ని మార్చి ఉపయోగించుకోవాలి. దళితులు పాత సాంప్రదాయంలో పాడిన పాటలను, ఆటలను అభివృద్ధి చేయాలి. పండుగలను ఉపయోగించుకోవాలి. పండగల్లో దేవుడు, కొబ్బరికాయ, పూజల్ని తీసివేస్తే అన్నీ నిరభ్యంతర సాంస్కృతిక కార్యక్రమాలే కదా!

సంఘంలోని ప్రతివ్యక్తికీ ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉండాలి. ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వామి కావడమంటే ప్రతి వ్యక్తి సాంస్కృతిక సృష్టి కర్త అయినట్లే. అప్పుడు సాంస్కృతిక వినియోగదారుడు లేకుండా పోతాడు. అందుకని సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ ప్రతిమనిషినీ సాంస్కృతిక వినియోగదారుడిగా మారుస్తున్నాయి. అందరినీ సాంస్కృతిక సృష్టి కర్తలుగా మార్చడమే దానికి విరుగుడు. కాబట్టి మన విజ్ఞాన కేంద్రాల్ని సాంస్కృతిక సృష్టి కేంద్రాలుగా తయారుచేయాలి. జానపద కళారూపాల్ని మనం ప్రోత్సహించాలి.

**జోక్యం చేసుకోవాల్సిన అంశాలు**

ఇలా మనం జోక్యం చేసుకోవాల్సిన అంశాలు:

1.కుటుంబం, పుట్టుక, పెంపకం, పెళ్లి (వరకట్నం, ప్రేమ, కులం) చావు, వారసత్వం, స్త్రీ-పురుష అసమానత్వం, వ్యాపారీకరణ.

2. మతం, ఆచారాలు, మూఢనమ్మకాలు, పండుగలు, విశ్వాసాలు, మోసాలు, వ్యాపారీకరణ, రాజకీయీకరణ, హేతువాదం, నాస్తికవాదం, మ్యాజిక్, పండుగలు, ఉత్సవాలు.

3. కులం: రూపం-సారం, అసమానత్వం, అస్పృశ్యత, శ్రమద్వేషం, మెరిట్‌వాదం.

4. భాష: రూపం-భావం, ప్రసారం, భావ జాలం

5. విద్య, నైపుణ్యం బదిలీ, విలువల బదిలీ, వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ, ప్రత్యామ్నాయాలు

6. కళలు : రూపం-సారం, సార్వజనీనత, సామాజిక దృక్పథం, వ్యాపారీకరణ

7. సినిమా, టీవీ, ఇంటర్‌నెట్ : స్వభావం-స్వరూపం, ప్రపంచీకరణ, సాంస్కృతిక సామ్రాజ్యవాదం, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ.

కుటుంబం రెండు పనులు నిర్వహిస్తుంది.

కుటుంబం అనేది పుట్టినవాడిని ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుగుణంగా– ఉత్పాదక నిపుణినిగా వినియోగదారుడిగా – తీర్చిదిద్దే వ్యవస్థ. అంటే ఈ వ్యవస్థకు పనికివచ్చే అర్థాల్నీ, విలువల్నీ చిన్నప్పట్నుంచే అది తయారు చేస్తుంది. రెండోది పితృస్వామిక కుటుంబాన్ని పరిరక్షించే కార్యక్రమం చేస్తుంది.

పెళ్లిలో పితృస్వామిక వ్యవస్థను రక్షించే కార్యక్రమం అంటే మహిళను అబలగా, అనుయాయిగా, భోగవస్తువుగా చూడడం. స్త్రీ తక్కువ, పురుషుడు ఎక్కువ అని చెప్పే సాంప్రదాయాలు పెళ్లిలో మరీ ఎక్కువ ఉంటాయి. కుటుంబ పెద్దలు విప్లవంలో చేరినా ఒప్పుకుంటారేమో కాని సాంప్రదాయాన్ని ఉల్లంఘిస్తే మాత్రం ఒప్పుకోరు. అంటే అంత తీవ్రమైన ఒత్తిడి తెస్తారు. సాంప్రదాయాన్ని యథాతథంగా అమలుచేయడం వ్యవస్థను కాపాడే ముఖ్యమైన సాధనం. సాంప్రదాయాన్ని పాటించడమనేది వ్యవస్థ స్వభావం నరనరాల్లో జీర్ణించేందుకు, వ్యవస్థను కాపాడేదానికి ఉపయోగపడుతుంది. అందుకే ఆ సాంప్రదాయమనేది అంత బలీయంగా పన్జేస్తుంది. అందుకనే కుటుంబ వ్యవస్థలో దానికి చాలా ప్రాముఖ్యముంది. పెళ్ళిలో, కుటుంబంలో తాళిబొట్టు అనేది చాలా బలీయమైంది. తాళిబొట్టు అనేది స్త్రీ అసమా నత్వానికి ఒక సింబల్‌గానే ఉంది. కాని పెళ్ళిలో ఇంకా అనేక అనేక రకాలున్నాయి. అలాగే ఒట్టి తాళిబొట్టు దగ్గరే అసమానత్వం కాదు వంట గదిలోను అసమానత్వమే. కాబట్టి ఈ రోజు కుటుంబమనేది వినియోగదారీ పోకడకు, వినియోగదారీ వ్యవస్థకు పునాదిగా ఉంది. పెళ్ళి అయిన రోజు వాహనాలు, బంగారం, పట్టు చీరలు ఇవన్నీ ఏ రకంగా ఉందో వీటన్నింటిని మించిపోయి ఇప్పుడు భోజనాలు, కళ్యాణ మండపాలు వచ్చాయి.

పెళ్ళి వ్యవస్థను ప్రశ్నించడం అంటే పితృస్వామిక వ్యవస్థను ప్రశ్నించడంగానే మనం చూడాల్సి ఉంటుంది. యూరప్‌లోనూ, అమెరికాలోనూ ఫెమినిస్టు ఉద్యమం కుటుంబ వ్యవస్థలో భార్యా భర్తల సంబంధాల్లో మార్పు తెచ్చింది. అక్కడ గృహహింస అసాధ్యమైన పరిస్థితిని వారు సృష్టించారు. ఒకరే వంటచేసే స్థితి తెల్లజాతిలో అయితే దాదాపు లేకుండా పోయింది. పిల్లల్ని కొట్టే పద్ధతి లేకుండాపోయింది. దాన్ని మనం అధ్యయనం చేయాల్సివుంది.

పితృస్వామిక అంశాన్ని బద్దలు చేయడానికి ప్రేమ వివాహం ఒక పునాదిగా ఉపయోగపడుతుంది. అయితే ఈ ప్రేమ వివాహాల్లో

> “కుటుంబ పెద్దలు విప్లవంలో చేరినా ఒప్పకుంటారేమో కాని సాంప్రదాయాన్ని ఉల్లంఘిస్తే మాత్రం ఒప్పకోరు. అంటే అంత తీవ్రమైన ఒత్తిడి తెస్తారు. సాంప్రదాయాన్ని యథాతథంగా అమలుచేయడం వ్యవస్థను కాపాడే ముఖ్యమైన సాధనం. సాంప్రదాయాన్ని పాటించడమనేది వ్యవస్థ స్వభావం నరనరాల్లో జీర్ణించేందుకు, వ్యవస్థను కాపాడేదానికి ఉపయోగపడుతుంది.”

కన్స్యూమరిజం బాగానే ఉంటుంది. ప్రేమ వివాహాలను, కులాంతర వివాహాలను ప్రోత్సహించడం అనేది పురుషాధిక్య కుటుంబ వ్యవస్థను క్రమంగా బలహీనం చెయ్యటానికి ఉపయోగపడతాయి.

మనిషికి అనేక భయాలు ఉన్నాయి. వాటిలో చావు భయం, భవిష్యత్తు భయం ముఖ్యమైనవి. ఈ రోజు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థలు ఈ భయాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నాయి. నయా–ఉదారవాదం సృష్టించిన ఇన్‌సెక్యూరిటి, స్టాక్‌మార్కెట్, వ్యాపారంలో పోటీ...వీటన్నిటివల్ల వచ్చే అభద్రతా భావం మతోన్మాదం, మత భావాల వ్యాప్తికి ఊతమిస్తున్నాయి. వీటని మనం సాంస్కృతికంగా ఎదుర్కొనాలంటే వివిధ రకాల పండుగలలో జోక్యం చేసుకోవాలి. గతంలో జనం అంతా కోటప్ప కొండకు తిరునాళ్ళకు వెళ్ళితే, కమ్యూనిస్టులు అమరవీరుల బొమ్మలను పెట్టుకొని ప్రభలు తీసుకు పోయేవారు. హేతువాదాన్ని, నాస్తిక వాదాన్ని ప్రోత్సహించాలి. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి. మండలకేంద్రాల్లో ఆటోడ్రైవర్స్, హమాలీలు, రిక్షా కార్మికుల్లో అత్యధికులు దళితులు ఉన్నారు. వీరు ఇప్పుడు మత కార్యక్రమాలవైపు పోతున్నారు. మండలకేంద్రంలో కులవ్యవస్థకు వ్యతిరేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

భాష అనేది కూడా ఇటువంటిదే. అన్ని రకాల భావాల్ని, పనుల్ని వ్యక్తం చేయగలిగే పద్ధతిలో భాషను అభివృద్ధి చేసుకోవడం అనే దృక్పథం ఉండకుండా ఇప్పుడున్న భాష గొప్పది, మా యాసే గొప్పది అంటే దురంహంకారం అవుతుందే తప్ప మార్క్సిస్టు దృక్పథం కాదు.

ఇక అన్ని రంగాల కన్నా ప్రత్యామ్నాయ సంస్కృతికై పోరాడే అవకాశం విద్యా రంగంలో వున్నది. ఆర్‌ఎస్‌ఎస్ వాళ్ళు సరస్వతి విద్యాలయాలు, శిశు, శారదా విద్యాలయాలు రకరకాల వాటి ద్వారా వాళ్లు జోక్యం చేసుకుంటున్నారు. దానికి ఫండ్స్ ఇచ్చేవాళ్ళు ఉన్నారు. అమెరికా నుంచి ఇచ్చేవాళ్ళు ఉన్నారు. పదో తరగతి విద్యార్థులకు సెలవుల్లో తొమ్మిదో తరగతి సమ్మర్ హాలిడేస్ అంతా వాళ్ళే భోజనంపెట్టి, వసతి ఇచ్చి, నెలరోజుల పాటు ట్రైనింగ్ ఇస్తున్నారు. అటువంటి నేపథ్యంలో మనం సాంస్కృతిక రంగంలో ఇంకా బాగా జోక్యం చేసుకోవాలి.

ఈ రకమైన కృషిలో మనకు సాంస్కృతిక రంగంలో చాలా మంది మిత్రులు, మనం ఊహించని మిత్రులు దొరుకుతారు. వర్గ రీత్యా మనకు మిత్రులు కాని వాళ్ళు కూడా ఇలాంటి విషయాల్లో దొరుకుతారు.

### ముగింపు

ప్రపంచ సంస్కృతిలో వ్యక్తమయ్యే అనేక అంశాలు మన సంస్కృతిలోనూ ఉన్నాయి. అయితే మన దేశ చారిత్రక వారసత్వాన్ని బట్టి ప్రత్యేక అంశాలు కూడా ఉన్నాయి. ఇంకా కింది స్థాయికి వస్తే ప్రాంతాల చరిత్రను బట్టి విశిష్టాంశాలు కూడా అనేకం ఉన్నాయి. అలాగే పురాతన తెగల నాటి, రాజరిక, వలసపాలన నాటి అవశేషాలు కూడా అనేకం ఉన్నాయి. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకున్న స్థితిలో ఇప్పుడు ప్రపంచీకరణతో మన దేశం పెనవేసుకుంటున్న నేపథ్యంలో సాంస్కృతిక రూపాల్లోనూ, విలువల్లోనూ, అనేక అంశాలు కొత్తగా చేరాయి. వీటిల్లో అనేక హానికర అంశాలు ఉన్నాయి. సంఘ్ పరివార్ శక్తులు వైవిధ్యాన్ని పక్కకు నెట్టి, సాంస్కృతిక జాతీయ వాదం పేరుతో హిందూత్వ, అగ్రకుల ఆధిపత్య వాదాన్ని నెలకొల్పడానికి సాంస్కృతిక రంగాన్ని ఉపయోగించు కుంటున్నాయి. వీటిని ప్రతిఘటించే ప్రయత్నంలో అనేక సానుకూల అంశాలు అభివృద్ధి అవుతున్నాయి. ఉన్న సంస్కృతిలో మృతప్రా యమైన వాటిని తిరస్కరించి, సజీవమైన వాటిని స్వీకరించి, సమాజ పురోగమనానికి అనుగు ణంగా కొత్త వాటిని సృష్టించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది.

పార్టీ నిర్మాణం

# అవరోధాలు - అవకాశాలు


ఎస్. వీరయ్య



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, ప్రజాశక్తి తెలంగాణా సంపాదకులు


లక్ష్య సాధనలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటాము. ఆటంకాలు, అవకాశాలు సహజం. ఆటంకాలను అధిగమించడం, అవకాశాలను వినియోగించుకోవడం ఒక కళ. ఇందులో నైపుణ్యం పెంచుకోవడం లక్ష్య సాధనకు ఎంతైనా అవసరం.

**(1) ఆటంకాలనధిగమించగలమా?**

అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనుకుంటే అందుకోసం అవకాశాలన్నీ పరిశీలించాలి. వీటితో పాటు అవరోధాలనూ గమనించాలి. ఆటంకాలు ఎదురవుతున్నాయనే పేరుతో లక్ష్యంనుండి వైదొలగలేము. ఆటంకాలనధిగమించవలసిందే తప్ప వాటినుండి తప్పించుకోజాలము. తప్పించుకునేందుకు ఎంతగా ప్రయత్నిస్తే అంతగా అవి మనల్ని వెన్నాడుతూనే ఉంటాయి. లక్ష్యం నెరవేరాలంటే అధిగమించవలసిందే. కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యం విప్లవం సాధించటమే. విప్లవ సాధనలో అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నాం. దశాబ్దాలు గడిచినా ఒక అవరోధం పోతే మరొక అవరోధం వస్తూనే ఉన్నది. అంత మాత్రాన ఇక సోషలిజం లక్ష్యాన్ని వదులుకుంటామా? ఈ రోజు సమావేశం లేదా ధర్నా నిర్వహించడం దగ్గరి నుండి సోషలిజం సాధించాలన్న లక్ష్యం వరకు ప్రతిదానికి అవరోధాలుంటాయి. అధిగమించే మార్గాలూ ఉంటాయి. పరిష్కారంలేని సమస్యలేమీ ఉండవు. ఏ ఇబ్బందీ లేకపోతే ఎవరైనా చేయగలరు. దానికి ప్రత్యేకమైన నైపుణ్యం, సామర్థ్యం అవసరం లేదు. ఇబ్బందులను అధిగమించడమే అసలు సమస్య. లక్ష్య సాధనలో వెనకబడినప్పుడు పరిస్థితులు అనుకూలించలేదని చెప్పడం చూస్తూ ఉంటాము. సామర్థ్యం సరిపోలేదని అంగీకరించడం చాలా కష్టం. అమలు చేయడంలో లోపాలు గుర్తించడంకూడా కష్టమే. కానీ సత్ఫలితాలు వచ్చినప్పుడు మాత్రం చాలా ఉత్సాహంగా తాము సాధించిన ఘనతగా చెప్పుకోవటం సాధారణంగా జరుగుతుంటుంది. సులభమైన పనులైతే నేను చేస్తానని చెప్పడం, కష్టమైనవి ఇతరులు చేయాలనడం బాధ్యతనుంచి తప్పించుకోవడమే. సామర్థ్యం చాలకపోతే అదే చెప్పాలి. తప్పులేదు. సమర్థులకే అప్పగించవచ్చు.

**(2) సాధ్యా సాధ్యాలు**

వాస్తవిక పరిస్థితుల ఆధారంగానే లక్ష్యాలను నిర్ణయించుకోవాలి. పరిస్థితులను ఉన్నవి ఉన్నట్టు అర్థంచేసుకోవాలి. ఆశలు, అవసరాలను బట్టి మాత్రమే కాదు. అవకాశాలు కూడా పరిశీలించాలి. గత శాసనసభ ఎన్నికలలో అత్యధిక స్థానాలు గెలుపు లక్ష్యంతో పోటీ చేయలేదు కదా! దానర్థం గెలవాలన్న కోరిక మనకు లేదా? గెలవాలనే అందరం కోరుకుంటాం. కానీ గెలిచేందుకు అవకాశాలు లేవన్నది వాస్తవం. అననుకూల రాజకీయ పరిస్థితులలో ఆ ఎన్నికలు జరిగాయి. అందుకే, ఉన్న పునాదిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆచరణ సాధ్యమైన లక్ష్యాలే నిర్ణయించుకోవాలి. ఒక పని నెరవేరాలంటే అందుకు అనుకూల పరిస్థితులు, నిర్వహించగల సమర్థులూ ఉండాలి. పార్టీకి మంచి ప్రతిష్ట ఉన్నప్పుడు ఏ ఇంటికి వెళ్లి అడిగినా ఉదారంగా విరాళాలిస్తారు. అంత మాత్రాన పట్టణంలోని కుటుంబాల సంఖ్యను బట్టి నిధుల లక్ష్యాన్ని నిర్ణయించగలమా? పార్టీ ప్రతిష్ట ఒక అనుకూల అంశం. కానీ ఇండ్లన్నీ తిరిగి వసూళ్ళు చేసేందుకు అవసరమైనన్ని దళాలు వేయగలమా? అందుబాటులో ఉన్న కార్యకర్తల సంఖ్య కూడా ముఖ్యం. ప్రత్యేక తెలంగాణా/ సమైక్యాంధ్ర ఉద్యమాలు జరుగుతున్నప్పుడు ప్రజా సమస్యలపై ఉద్యమాలకు అవకాశాలు పరిమితం. అందుకనుగుణంగానే ప్రణాళికలూ వేసుకున్నాం. ఉన్న పునాదిని కాపాడుకొనేందుకు ప్రజలతో సంబంధాలు కొనసాగించేందుకు ప్రయత్నించాం. అందుకనుగుణమైన కార్యక్రమాలే నిర్ణయించుకున్నాం. స్థానిక సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. కార్యకర్తలు ప్రజలతో సన్నిహితమయ్యేందుకు ప్రయత్నించాం.

**(3) లక్ష్యంపైనే దృష్టి**

లక్ష్యం నిర్ణయం అయిన తర్వాత దాని మీదనే దృష్టి లగ్నం చేయాలి. లక్ష్యం నుండి దృష్టి మరలినప్పుడు చేసే పని దారి తెన్నూ లేకుండా ఉంటుంది. ప్రణాళికా బద్ధంగా ఉండదు. తగిన ఏర్పాట్లు చేసుకోకుండానే పని ప్రారంభిస్తాం. తగు సాధనాలను సమకూర్చుకోవడంలో వెనకబడతాం. పార్టీ విస్తరణకోసం మండలకేంద్రాల మీద కేంద్రీకరించాలనుకున్నాం. మండలకేంద్ర కార్యకర్తను అదే పనిమీద నిలకడగా ఉంచడంలో మాత్రం అనేక మండల కేంద్రాలలో జయప్రదం కాలేకపోయాం. ఇందుకు కారణం మనకు అర్థం కానిదేమీ కాదు. తోసుకొచ్చిన పనులకు ఆ కార్యకర్తలను వినియోగించాం. కేంద్రీకరించే నియోజక వర్గాల్లోనూ జరిగింది ఇదే. ఇప్పుడు తెలంగాణలోనైనా, ఆంధ్రప్రదేశ్‌లోనైనా నిర్ణయించుకునే ప్రణాళికలకు కూడా ఈ అనుభవాలు ఉపయోగపడతాయి. కావలసిందల్లా లక్ష్యశుద్ధి. కమిటీలకే కాదు వ్యక్తిగతంగా కూడా లక్ష్యశుద్ధి అవసరం. తరచూ లక్ష్యం నుంచి దృష్టి మరలే అలవాటు ఉన్నవారు ఏంచేయాలి? తమ గత అనుభవాలన్నీ నెమరువేసుకోవాలి. సాధ్యమైనంత మేరకు చిన్నచిన్న లక్ష్యాలు నిర్ణయించుకోవడం మంచిది. ఇలాంటి కామ్రేడ్స్ చిన్న బాధ్యతలు తీసుకోవడమే ఉపయోగకరం. ఫలితాలు సాధించడం సులభం. ఉత్సాహపడతాం. నష్టం జరిగినా తక్కువే ఉంటుంది. పెద్ద బాధ్యతలు, పెద్ద లక్ష్యాలు సంక్లిష్టమైన లక్ష్యాలు పెట్టుకోవడం వల్ల పనిలో జయప్రదం కాలేరు. నిరుత్సాహమే మిగులుతుంది. ముఖ్యంగా నిర్మాణ బాధ్యతలు, కీలక కర్తవ్యాల బాధ్యతలు తీసుకునేటప్పుడు ఒకటికి పది సార్లు ఆలోచించాలి. లక్ష్యంమీద దృష్టి లగ్నం చేయనప్పుడు అదనపు నష్టం జరుగుతుంది. పని ప్రారంభించి వదిలేస్తూ ఉంటాం. దీని వల్ల అదనపు సమస్యలు ఎదురవుతాయి. గిరిజనుల్లో కొద్దిరోజులు పనిచేసి ఇతర తోసుకొచ్చిన పనిలో పడిపోతే మళ్లీ వేళ్లే నాటికి వచ్చిన సంబంధాలు నిలబడకపోవచ్చు. మళ్లీ మొదటినుంచి ప్రారంభించవలసి వస్తుంది. కార్మికులలలో కొంత కృషి చేసి వదిలివేస్తే కొన్ని సందర్భాలలో అపార్థాలుకూడా వస్తాయి. కార్మికులు అనుమానించవచ్చు. కార్యకర్తలమీద శ్రద్ధ తగ్గితే వారి అభివృద్ధి కుంటుబడవచ్చు. వారిపై పరిసరాల ప్రభావాలను గమనించలేకపోవచ్చు. అనుకున్న లక్ష్యం మీద దృష్టి చెదరకుండా చూసుకుంటే సమస్యలు తగ్గుతాయి.

**(4) అవరోధాలు**

అనేక సందర్భాలలో లక్ష్యం సాధించడానికి మన పని విధానంలోని లోపాలే ఆటంకం అవుతాయి. అందులో మొదటిది ఆచరణ

(మిగతా 16వ పేజీలో)



# తెలంగాణా ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగా ఉమ్మడి కృషి

## 10 వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల సంయుక్త ప్రకటన

**తెలంగాణాలోని 10 వామపక్ష, కమ్యూనిస్టు పార్టీలు ఆగస్టు 28న హైదరాబాద్‌లోని సిపిఐ కార్యాలయం 'ముగ్దుం భవన్'లో సమావేశమై విడుదల చేసిన సంయుక్త ప్రకటనను దిగువ ఇస్తున్నాం. సదస్సులో సిపిఐ(యం), సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసిపిఐయు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, సిపిఐఎంఎల్, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్, ఎస్‌యుసిఐ(సి)లు పాల్గొన్నాయి. ప్రకటన పూర్తి పాఠం:**

దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణా ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతం వెనుకబాటుకు గురైందనీ, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే నీళ్లు, నిధులు, కొలువులు అందరికీ అందుబాటులోకొస్తాయనీ సాగిన సుదీర్ఘ ఉద్యమ నేపథ్యంలో జరిగిన మొదటి ఎన్నికలలో టి.ఆర్.యస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే తమ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని భావించిన ప్రజలు కొత్త ప్రభుత్వ పాలనలో గంపెడాశతో అందుకు ఎదురు చూస్తున్నారు.

నూతన తెలంగాణా రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి కావాలనీ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు, ఉపాధి పెరుగుదలకు అవసరమైన సకల చర్యలు తీసుకోబడాలనీ, అందుకవసరమైన ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయిక విధానాలు రాష్ట్రంలో అమలు జరగాలనీ వామపక్ష, కమ్యూనిస్టు పార్టీలుగా మేము దృఢంగా కోరుకుంటున్నాము.

ఎన్నికలలో ప్రజలకు అనేక హామీలు, వాగ్దానాలు చేయబడ్డాయి. రైతుల రుణమాఫీ, దళిత, గిరిజన కుటుంబాలకు 3 ఎకరాలు భూమిపంపిణీ, ఇండ్ల నిర్మాణం, పెన్షన్ల పెంపు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య, నూతన ఉద్యోగాల సృష్టి, రైతాంగానికి సాగునీటి ప్రాజెక్టులు వంటి అనేక భారీ వాగ్దానాలు వీటిలో ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూడా ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఎన్నికల వాగ్దానాలన్నింటినీ అమలు చేస్తామని శాసన సభలోనూ, బయటా విస్పష్టంగా ప్రకటించారు. ఈ హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడాలనీ, అందుకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి, రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కొత్త ప్రభుత్వం కృషి చేయాలనీ కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలుగా మేము కోరుతున్నాము.

ప్రస్తుత ప్రపంచీకరణ దశలో అమలౌతున్న ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రభుత్వ ఖర్చుకూ, సబ్సిడీలకూ వ్యతిరేకం. ఈ విధానాలనే మన పాలకులు అనుసరిస్తే అవి ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ఆటంకమవుతాయి. సరళీకృత ఆర్థిక విధానాలను వ్యతిరేకించకుండా రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని సాధించటం అసాధ్యమనే విషయాన్ని కొత్త ప్రభుత్వాధినేతలు గ్రహించాలి. అలాకాక ప్రజలకు చేసిన వాగ్దానాలను పక్కనబెట్టి, పారిశ్రామికాభివృద్ధి పేర బడా కంపెనీలకూ, కార్పొరేటు శక్తులకూ ప్రభుత్వ వనరులను దోచి పెట్టటానికి ఎలాంటి ప్రయత్నం జరిగినా ప్రజలు సహించరని మేము హెచ్చరించదలిచాం. పాలకులు ఆ మార్గాన్ని ఎంచుకుంటే, అలాంటి అన్ని ప్రయత్నాలనూ ప్రజా ఉద్యమాల ద్వారా అడ్డుకోవల్సి ఉంటుంది.

తెలంగాణా రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల జనాభా ఎక్కువ. వెనుకబడిన ఆర్థిక వ్యవస్థలో ఫ్యూడల్ అవశేషాలు పుష్కలంగా ఉన్న సమాజం మనది. కులం, మతం, లింగ వివక్షతలతో బాటు భూస్వామ్య పెత్తందారీ పీడనతో పల్లెలు నలుగుతున్న స్థితి ఇంకా తెలంగాణాలో కొనసాగుతోంది. ఈ స్థితిలో సామాజిక న్యాయ సాధన ముఖ్య సమస్యగా ముందుకొస్తోంది. సామాజిక న్యాయమంటే అధీన కులాలకు చెందిన కొందరికి రాజకీయ పదవులు అప్పగించటం, ఆర్థికంగా కొందరికి అవకాశాలివ్వటం మాత్రమే కాదు. ఇలాంటి చర్యలకే సామాజిక న్యాయాన్ని పరిమితం చేయటం మన

పాలకుల నైజంగా ఉంది. అలాకాక మొత్తం దళిత, బలహీన వర్గాల ప్రజలందరికీ లబ్ధి జరిగే విధంగానూ, వారందరూ ఆత్మగౌరవంతో జీవించే విధంగానూ పరిస్థితి మార్చబడాలి. తెలంగాణా సమాజంలో ఉన్న సకల ఆధిపత్య కుల ధోరణులనూ సమూలంగా తుడిచి పెట్టటమే సామాజిక న్యాయానికి సరైన అర్థం అవుతుంది. యస్.సి, యస్.టిల సంక్షేమానికి పెద్దపీట వేస్తామనీ, 50వేల కోట్లు ఖర్చు పెడతామనీ ప్రభుత్వం చెబుతున్నది. కానీ దళిత గిరిజనులకు భూ పంపిణీ కార్యక్రమాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రకటించినా, ఆచరణలో ఆ ప్రక్రియను నామమాత్రపు తంతుగా టి.ఆర్. యస్ ప్రభుత్వం నీరుగారుస్తోంది. యస్.సి, యస్.టి సబ్ ప్లాన్ చట్టం ఆమోదించి రెండు సంవత్సరాలు గడిచినా ఇంతవరకూ ఆ చట్టం అమలుకు నిబంధనలే రూపొందించబడ లేదు. ఇప్పటికీ విస్తృతంగా అస్పృశ్యత అవరించి ఉన్నా దానికి వ్యతిరేకంగా నిర్దిష్ట కార్యాచరణ శూన్యం. మాటలకు చేతలకు ఎంతో వ్యత్యాసమున్న పాలకుల ఈ ధోరణిని మేము నిరసిస్తున్నాం. సామాజిక న్యాయసాధనకు నిరంతర కృషి సాగిస్తామనీ, ఈ కృషిలో భాగస్వాములయ్యే సకల దళిత, బడుగు, బలహీన ప్రజల సంఘాలతో, వ్యక్తులు, శక్తులతో కలిసి పోరాడతామనీ ప్రకటిస్తున్నాం.

అభివృద్ధి అంటే హైదరాబాద్ నగరం మాత్రమే కాదు. ఆ మాటకొస్తే హైద్రాబాద్ నగరంలోనూ మురికివాడలు, పేదల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, నివాసగృహం ఇత్యాది కనీస సౌకర్యాలు తెలంగాణాలో ప్రతి మారుమూల పల్లెకూ, పట్టణాలలోని పేదలందరికీ అందుబాటులోకి రావటమే సమగ్రాభివృద్ధికి సరైన అర్థం అవుతుంది. అభివృద్ధిలో అలాంటి వికేంద్రీకరణను పాలకులు అనుసరించాలని కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలుగా మేము కోరుతున్నాము.

పెట్టుబడిదారీ విధానం అసమానతలకు మూలం. లాభం ఎక్కడ ఉంటే పెట్టుబడి అక్కడకు పరుగులు పెడుతుంది. లాభార్జనే ధ్యేయంగా పనిచేసే ప్రైవేటు పెట్టుబడి ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధి అసాధ్యం. అందువల్ల ప్రభుత్వ రంగానికి పెద్దపీట వేయాలనీ విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, సాగు, త్రాగునీరు ఇత్యాది రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులకు ప్రాధాన్యమివ్వటం అవసరమనీ మేము దృఢంగా నమ్ముతున్నాం. ఆ విధమైన చర్యలకు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చే విధంగా ప్రజా చైతన్యాన్ని పెంపొందించటానికి మేము నిరంతర కృషి సాగిస్తాం.

రాష్ట్రాలు రెండైనా తెలుగు జాతి ఒక్కటేనని మేము నమ్ముతున్నాం. పరస్పర సహకారం, సుహృద్భావంతోనే మన జాతి ముందుకు సాగటం, ఉభయ రాష్ట్రాలు అభివృద్ధి చెందటం ఆధారపడి ఉంటుంది. సహజంగా ఉభయ రాష్ట్రాల మధ్య తలెత్తే సమస్యలను సామరస్యంగా, పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకునే పద్ధతులు ఉభయ ప్రభుత్వాలు అనుసరించాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా వ్యవహరించే ధోరణి తమ పాలనా వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించే ఎత్తుగడగా భావించాల్సి వుంటుంది. పాలకుల ఈ కుటిల యత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటం అవసరమని విజ్ఞప్తి చేస్తున్నాం.

కేంద్రంలో మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చింది. గత యుపిఎ ప్రభుత్వ ఆర్థిక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తోంది. కీలక ఆర్థిక రంగాలన్నింటిలోకీ ప్రైవేటు, విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. సామాజిక రంగంలో మతోన్మాద, హిందూత్వ విధానాలకు మరింత పదును పెడుతోంది. ఈ పరిణామాలు దేశ రాజకీయ వ్యవస్థలో మితవాద మలుపుగా, ప్రజాజీవనానికి మరింత ప్రమాదకర సంకేతంగా మేము భావిస్తున్నాం. 80 రోజుల మోడీ పాలనలో అనేక ప్రాంతాలలో మత ఘర్షణలు జరిగాయి. ప్రతి అవకాశాన్నీ ఉపయోగించి ప్రజల మధ్య మత విభజన రేపటానికి హిందూత్వ శక్తులు పథకం ప్రకారం పనిజేస్తున్నాయి. ఈ ప్రమాదానికి వ్యతిరేకంగా దేశ సెక్యులర్ శక్తుల సమీకరణకు కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు కృషి సాగిస్తాయని ప్రకటిస్తున్నాం.

సమాజంలో ప్రస్తుతం ఆధిపత్యంలో వాన్న బూర్జువా, భూస్వామ్య భావజాలాన్ని ఎండగట్టేందుకు ప్రత్యామ్నాయ సాంస్కృతి కోద్యమ నిర్మాణ ఆవశ్యకతను కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు గుర్తిస్తున్నాయి. వర్గ ఐక్యతకు ఆటంకంగా ఉన్న కులవ్యత్యాసాలను నిర్మూలించేందుకు ప్రత్యేక కృషి అవసరం. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో కార్మికవర్గ హక్కులపై సాగుతున్న దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టడానికి ఆర్థిక, సామాజిక, రాజకీయ పోరాటాలను ఏకకాలంలో సమ్మిళితంగా సాగించాల్సిన అవసరం ఉందని కార్మికవర్గానికీ, సకల ప్రజానీకానికీ మేము విజ్ఞప్తి చేస్తున్నాం.

బూర్జువా, భూస్వామ్య పాలకులు ఏ పార్టీల రూపంలో ఉన్నా, కొత్త భ్రమలు ఎన్ని విధాలుగా ప్రజలకు కల్పించినా, ఆచరణలో ప్రజలను మరింత దోపిడీ, పీడనలకు గురిచేయటం మినహా ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చటం వారి వల్ల జరిగే పనికాదు. మానవ జాతి ఎదుర్కొంటున్న సకల సమస్యలకూ పరిష్కారం చూపించగల శాస్త్రీయ అవగాహన, సైద్ధాంతిక స్పష్టత కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు మాత్రమే కల్గిఉన్నాయనేది వాస్తవం.

రాబోయే కాలంలో తెలంగాణా రాష్ట్రంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మేము పని చేస్తాం. సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, మతోన్మాద, మనువాద సిద్ధాంతాలకు వ్యతిరేకంగా రాజీ లేని పోరాటాలు సాగిస్తాం. నూతన తెలంగాణా రాష్ట్రంలో మేము సాగించే ఈ కృషిలో భాగస్వాములవాలనీ, అండ దండలివ్వాలనీ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

# అవరోధాలు - అవకాశాలు

(14వ పేజీ తరువాయి)

లోపం. అంటే సోమరితనం. ఇది ఎట్టి పరిస్థితులలోనూ ఉండకూడనిది. లక్ష్యశుద్ధి లేని ఆచరణ మరొకటి. బాధ్యతా రహితమైన ఆచరణ మరీ నష్టం. చేస్తున్న పని పట్ల బాధ్యతగా, జవాబుదారీగా వ్యవహరించడం అవసరం. పని ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా అయిష్టంగా, బలవంతంగా చేసే పనిలోనూ ఫలితాలు కష్టం. వాస్తవ పరిస్థితులకనుగుణంగానే ఆచరణ ఉండాలి. ఉద్వేగంతోనూ, పౌరుషంతోనూ బాధ్యతలు తీసుకోవద్దు. గొప్పలకు పోవడం, పోటీతత్వం కూడా మంచిదికాదు. తమ సామర్థ్యాన్ని ఎక్కువగా అంచనా వేసుకోవడం కూడా నష్టమే. పని ప్రణాళికా బద్ధంగా లేనప్పుడు కూడా ఫలితాలను ఆశించలేము. చేసే పని సమయోచితంగా ఉండాలి. సమయం, సందర్భంలేని ఆచరణ నష్టం చేస్తుంది. ప్రత్యేక తెలంగాణ/ సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో సోషలిజం గురించి సెమినార్లు పెట్టగలమా? తీసుకున్న పని పట్ల దృఢ సంకల్పం వాండాలి. ఊగిసలాట పనికిరాదు. దీనివల్ల అరకొరగా అమలు జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే నిర్దిష్ట లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలి. ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా చిత్త శుద్ధితో అమలుచేయాలి.

అవరోధాలు తాత్కాలికం. ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకొంటే లక్ష్యం చేరడం సాధ్యమే. సవాళ్లనెదుర్కోవడం అసాధ్యమేమీ కాదు. ఇక్కడ లెనిన్ చెప్పిన చిన్న ఉదాహరణ ఎంతో అర్థవంతమైంది. పర్వతారోహకుడు మార్గమధ్యంలో దారి దొరకనప్పుడు వెనక్కి వస్తాడు. మరో మార్గంలో ఎక్కుతాడు. లక్ష్యాన్ని మాత్రం వదలడు. నిజమే కదా! ఇది అందరికీ వర్తిస్తుంది. అనుకున్న పని ఒక మార్గంలో కాకపోతే మరో మార్గంలో సాధించవచ్చు. చేతులెత్తేయవలసిన అవసరం లేదు.

అవరోధాలు నిన్ను ఆపకూడదు. నువ్వే వాటిని అధిగమించాలి.

కార్మికరంగం

# కార్మిక హక్కులు హరించే చట్ట సవరణలు: ప్రతిఘటనకు సిద్ధమవుతున్న కార్మికవర్గం

సిహెచ్. నర్సింగరావు



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు. సిఐటియు నాయకులు.**

కార్మికులు, సామాన్య ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పుడు కార్మిక వర్గం నెత్తిన ఇనుప పాదాలు మోపి పాతాళానికి అణచివేయడానికి ప్రయత్నిస్తోంది. గతంలో బిజెపీ నాయకత్వం లోని రాజస్థాన్ ప్రభుత్వం కార్మిక చట్టాలకు తిరోగమన మార్గంలో మార్పులు చేసి రాష్ట్రపతి అనుమతికి పంపింది. కేంద్రంలో అధిష్టించబడిన బిజెపీ ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే ఈ మార్పులను ఆమోదించింది. రాజస్థాన్ తరహాలోనే కేంద్ర కార్మిక చట్టాలు సవరించడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ చట్టాలను పార్లమెంటు ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇటువంటి ప్రయత్నాలు గతంలోనూ జరిగాయి. జనతా ప్రభుత్వ కాలంలోనూ, కాంగ్రెస్, గత బిజెపి ఆధ్వర్యం లోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలోనూ చట్టాల మార్పులకు ప్రయత్నించి చేతులు కాల్చుకుని ఉపసంహరించుకున్నారు. పారిశ్రామిక వివాద చట్టంలో మార్పుల ద్వారా ఇష్టంవచ్చినట్లు కార్మికులను తొలగించడానికీ (హైర్ & ఫైర్), యథేచ్ఛగా లాకౌట్‌లు, మూసివేతలకు పాల్పడడానికీ కంపెనీలకు అనుమతిచ్చేందుకు పూనుకున్నారు. 2002లో తమిళనాడులో అన్నాడిఎంకె అధినేత్రి జయలలిత ప్రభుత్వం మరింత ముందుకువెళ్లి చట్టం మార్చకుండానే వేలాది మంది రాష్ట్ర ఉద్యోగులను ఒకే కలం పోటుతో తొలగించింది. రాష్ట్ర కార్మికవర్గం నిరసనలతో తమిళనాడు అట్టుడికి పోయింది. సుప్రీంకోర్టు చివాట్లతో తొలగించిన వారందరినీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. జనతా ప్రభుత్వం ఈ చట్టం నుంచి అత్యవసర సర్వీసు ఉద్యోగులను (విద్యుత్, రవాణా, హాస్పటల్స్) మినహాయించాలని తీవ్ర ప్రయత్నాలు చేసినా కార్మిక పోరాటాలతో ఉపసంహరించింది.

కార్మికులపై దాడి చేసిన ఆ ప్రభుత్వాలన్నీ మట్టిగొట్టుకుపోయాయి. 1999 నుంచి 2004 వరకు బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ సారథ్యంలో కార్మిక హక్కులపై చేసిన పలురకాల దాడులకు 2004లో బిజెపి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఢిల్లీ, కలకత్తా, ముంబయ్, మద్రాసు తదితర పారిశ్రామిక పట్టణాలన్నింటిలో ఘోర ఓటమికి గురైంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్‌పై కోపంతో బిజెపి అధికారంలోకి వచ్చింది. కేంద్రంలో కేవలం 31శాతం ఓట్లతో దాదాపు 60శాతం సీట్లు, రాజస్థాన్‌లో 81శాతం సీట్లు సంపాదించింది. ఈ బ్రూట్ మెజారిటీ కార్మిక చట్టాలు మార్చడానికి బిజెపికి కొమ్ములు తెప్పించింది. కానీ చరిత్రలో స్వాతంత్ర్యం ముందు నుంచి పారిశ్రామిక ప్రాంతాలు ఏర్పడిన ప్రతిచోటా కార్మికవర్గాన్ని అణచివేయడానికీ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికీ పూనుకున్నప్పుడల్లా కార్మికవర్గం ప్రతిఘటించింది. ఎమర్జెన్సీ చీకటి రోజులు చరిత్రలో కాంగ్రెస్‌కు ఘోర ఓటమిని చూపించాయి. అణచివేతకు పూనుకుంటే బంతిని ఎంతగట్టిగా కొడితే తిరిగి అంతకు అనేక రెట్లు ఎత్తుకు ఎగురుతుందని రుజువు చేశాయి.

### కేంద్ర ప్రభుత్వ అడ్డగోలు వాదనలు

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను ఎందుకు మారుస్తున్నారని అడిగితే చల్లకు వచ్చి ముంత దాచినట్లు డొంకతిరుగుడు వాదనలు చేస్తోంది. కార్మిక చట్టాలు సవరిస్తే విదేశీ, స్వదేశీ పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడతాయనీ, ఉత్పత్తి ఉరకలు వేస్తుందనీ, తద్వారా ఉపాధి కూడా భారీగా పెరుగుతుందనీ వీరి వాదన. వాస్తవానికి ఇది బడా పెట్టుబడిదారుల వాదనే. 1991లో నూతన ఆర్థిక విధానాలు ఆరంభం నుంచే ప్రస్తుత కార్మిక చట్టాలు అభివృద్ధికి అవరోధంగా ఉన్నాయని వీరు వాదిస్తూ వస్తున్నారు. ఇది పూర్తి అవాస్తవం. కార్మిక చట్టాలు వాస్తవానికి స్వాతంత్ర్యం ముందునుంచే వచ్చాయి. ట్రేడ్ యూనియన్ చట్టం 1926లో వచ్చింది. కార్మిక అశాంతిని నివారించడానికి.. ఏడుగురు కార్మికులు కలిస్తే యూనియన్ పెట్టుకోవచ్చునీ, ఆ యూనియన్ నాయకుల్లో సగం మంది కార్మికులు కాని బయటివారు కూడా ఉండవచ్చునీ చట్టం వచ్చింది. తర్వాత కాలంలో మూకుమ్మడి సమ్మెలు, కంపెనీల్లో తిరుగుబాట్లు తగ్గి కార్మిక ప్రశాంతత ఏర్పడిందని చరిత్ర చెబుతోంది. కానీ బడాపెట్టుబడిదారులు పాత చరిత్రను మరిచి తమ లాభాలు బాగా పెరగాలంటే యూనియన్‌లే ఆటంకం అని భావిస్తున్నారు. కార్మికుల కష్టాలను గురించి చెప్పేవారు ఉండరాదనేది వీరి ఆకాంక్ష. దేశ అభివృద్ధికి కార్మిక చట్టాలు ఆటంకం అనే వాదన పూర్తి అవాస్తవం. భారతదేశంలోని ఈ కార్మిక చట్టాలు అమలు జరిగిన కాలంలోనే పారిశ్రామిక అభివృద్ధి పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందింది. విద్యుత్‌రంగంకానీ, రసాయనక ఎరువులుకానీ, ప్రాణరక్షణ మందులుకానీ ఆ కాలంలో లేవు. అలాంటి పరిస్థితుల నుంచి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుమారు 200 రంగాల్లో అభివృద్ధి చెందిన భారదేశం స్వయం సమృద్ధి సాధించింది. అంతకు మించి జాతీయ స్థూల అభివృద్ధి (జిడిపి) 2005 నుంచి 2009 సంవత్సర కాలంలో 6 శాతం నుంచి 9 శాతం వరకు పెరిగింది. మరి కార్మిక చట్టాలు ఉండగానే అంత అభివృద్ధి ఎలా సాధ్యమైంది? కార్మిక చట్టాలు మార్చడానికి కేంద్ర ప్రభుత్వం చెప్పే సాకుల్లో ముఖ్యమైనది ఉత్పత్తి పెరగడం ద్వారా ఉపాధి బాగా పెరగడం. ఇది పచ్చిబూటకం. ప్రపంచంలోగానీ, భారతదేశంలోగానీ ఆర్థిక పరిస్థితి పరిశీలిస్తే ఉపాధి రహిత అభివృద్ధి కొనసాగుతున్నది. ఉత్పత్తి ఎంత పెరిగినా ఉపాధి క్రమేణా తగ్గుతోంది. లేదా ఉన్న ఉపాధి నిలబడుతున్నదే తప్ప పెరగడం లేదు.

ఆధునీకరణ, ఆటోమేషన్, విధానాల ఫలితం ఇది. భారతదేశంలో 2000–2005 సంవత్సరాల మధ్య ఉపాధి పెరుగుదల రేటు 2.7 శాతం నుంచి 0.7 శాతానికి పడిపోయింది. పెరిగిన ఉపాధిలో 90శాతం అసంఘటిత రంగమే. కానీ వీరి జీతాలు దారుణంగా పడిపోతున్నాయి.

కార్మిక చట్టాలన్నీ పోరాడి సాధించుకున్న హక్కులే. ఏ కార్మిక చట్టం కూడా ప్రభుత్వాలు, యాజమాన్యాల దయాదాక్షిణ్యాలతో వచ్చినవి కావు. కార్మిక వర్గం అశేష త్యాగాలతో సాధించింది. ఉరికంబాలెక్కి, ఉద్యోగాలు కోల్పోయి, జైళ్లు, లాఠీలకు వెరవకుండా పోరాడి కార్మిక హక్కులు సాధించారు. అందుకే 130 సంవత్సరాల తరువాత కూడా మేడే రోజున నేటికీ ఉరికంబం ఎక్కిన అమరవీరులను స్మరించుకుంటున్నాం. భారతదేశంలో కార్మిక వర్గం ప్రజాస్వామ్య హక్కులు సాధించిన తర్వాత ప్రజలు ప్రజాస్వామ్య ఓటింగ్ తదితర హక్కులు సాధించుకున్నారు. బ్రిటీష్ వారు తప్పనిసరి పరిస్థితుల్లోనే పోరాటాల ఫలితంగా కార్మిక చట్టాలు భారతదేశంలో చేయాల్సి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం కార్మిక వర్గం పాత్ర దేశాభివృద్ధిలో కార్మికవర్గం పాత్ర అత్యవసరమని నెహ్రూ ప్రభుత్వం గుర్తించింది. కార్మిక చట్టాలను సంక్షేమ పథకాల ద్వారా అమలు చేశారు. తర్వాత ప్రభుత్వాలు ఆ దిశగా చట్టాలు చేశాయి. ఫలితంగానే బోనస్, పిఎఫ్, పెన్షన్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ, ప్రమాద నష్టపరిహారంలాంటి అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. 1991 ముందు పాలకులు ఎవరైనా కార్మికులకు అనుకూలంగా చట్టాల్లో మార్పులు చేశారు. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి జరగాలంటే కార్మిక వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం అవసరమైంది. ప్రత్యక్షంగా కార్మిక నాయకులుగా పనిచేసిన అనేకమంది ప్రజల మన్ననలు పొందారు. వివి గిరి (రాష్ట్రపతి), జ్యోతిబసు (పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి), టి.అంజయ్య (ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి), బిందేశ్వర దుభే (బీహార్ ముఖ్యమంత్రి) లాంటి అనేకమంది దేశ ప్రముఖులుగా పనిచేశారు.

**కార్మిక చట్టాల ఉల్లంఘన**

*1991 తర్వాత నూతన ఆర్థిక విధానాలు ప్రారంభం నుంచి కార్మిక చట్టాల మార్పుల కోసం పాలక వర్గాలు పడరాని పాట్లు పడుతున్నాయి. మార్పులు సాధ్యం*

# కార్మిక చట్టాల్లో మార్పు ప్రతిపాదనలు

| కార్మిక చట్టాలు | ప్రస్తుతం ఉన్న నిబంధన | కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన |
|---|---|---|
| **1 పారిశ్రామిక వివాదాల (ఐడి) చట్టం 1947** | **100 మందిలోపు కార్మికులున్న పారిశ్రామిక సంస్థల్లో కార్మికులను రిట్రెంచ్ (తొలగింపు) చేయడానికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. వందకు మించితే అనుమతి అవసరం** | **ఇప్పుడు 300మందిలోపు కార్మికులున్న సంస్థలు ప్రభుత్వ అనుమతి లేకుండానే తొలగించవచ్చని ఐడి చట్టాన్ని సవరించారు. రాజస్థాన్‌లో 7622 ఫ్యాక్టరీలుండగా అందులో 300 మందిలోపు కార్మికులున్న ఫాక్టరీలు 7252. అంటే 95 శాతం ఫ్యాక్టరీలు ప్రభుత్వ అనుమతి లేకుండానే కార్మికులను తొలగించవచ్చు.** |
| **2. ట్రేడ్ యూనియన్ చట్టం –1926** | **ఒక సంస్థలో ఏడుగురు కార్మికులుంటే చాలు ట్రేడ్ యూనియన్‌ను రిజిస్టర్ చేసుకోవచ్చు. కార్మిక సమస్యలకు ప్రాతినిధ్యం వహించవచ్చు.** | **ఒక ట్రేడ్ యూనియన్ రిజిస్టర్ అవ్వాలంటే ఆ సంస్థలో 30శాతం కార్మికులు సభ్యులుగా ఉండాలని చట్టాన్ని సవరించారు.** |
| **3 ఫ్యాక్టరీ చట్టం –1947** | **విద్యుత్‌తో పనిచేసే కార్మికులు 10 మంది ఉన్న, లేదా విద్యుత్ అవసరం లేకుండా పనిచేసే కార్మికులు 20 మంది ఉన్న సంస్థలకు ఈ చట్టం వర్తిస్తుంది.** | **ఈ పరిమితులను రెట్టింపు అంటే 20. 40గా మార్చారు. దీనివలన ఈ చట్టం అధిక మంది కార్మికులకు వర్తించకుండా పోతుంది.** |
| **4.కాంట్రాక్టు లేబర్ (ఎబాలిషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం –1970** | **ఐదుగురికి పైబడి ఉన్న కార్మికులకు ఈ చట్టం వర్తిస్తుంది.** | **50మందిలోపు కాంట్రాక్టు కార్మికులను నియమించిన యాజమాన్యానికి ఇది వర్తించదు. ఫలితంగా అత్యధికులకు ఈ చట్టం వర్తించదు.** |
| **5.అప్రెంటీస్ చట్టం** | **కార్మికులకు వృత్తిలో నైపుణ్యం పొందడానికి అప్రంటీస్ చట్టం తెచ్చారు. ఆ సమయంలో అతితక్కువ స్టైఫండ్ మాత్రమే చెల్లిస్తారు. పనిని గమనించడం, నేర్చుకోవడం చేయాలి.** | **ఈ చట్టాన్ని సవరించడం ద్వారా అతితక్కువ (70శాతం) స్టైఫండు చెల్లించి కాంట్రాక్టు/క్యాజువల్, రెగ్యులర్ కార్మికులకు బదులుగా నియమించుకునేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పించారు.** |
| **6.ఫ్యాక్టరీ చట్టం – 1947** | **అవసరమైన సందర్భంలో కార్మికునితో 10.30 గంటలు పనిచేయంచుకోవచ్చునని, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అనుమతితో మాత్రమే 12 గంటలు పనిచేయించ వచ్చని ఈ చట్టంలో ఉంది. మూడు నెలల్లో ఒక కార్మికునితో 50 గంటలకు మించి ఓవర్ టైమ్ (ఓటి) చేయించకూడదని ఈ చట్టం చెబుతోంది.** | **చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అనుమతి లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా పెంచ వచ్చని చట్టాన్ని సవరించారు. ఇది కార్మికులను నిర్బంధంగా అదనపు చెల్లింపు లేకుండానే పనిచేయించుకునేందుకు దారితీస్తుంది. మూడు నెలల్లో ఒక కార్మికునితో 100 గంటలు ఓవర్‌టైమ్ చేయంచ వచ్చనీ, రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో 125 గంటలు చేయించుకోవచ్చనీ చట్టాన్ని సవరించారు. దీనివల్ల ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది.** |
| **7 కనీసవేతన – చట్టం 1948** | **15వ లేబర్ కాన్ఫరెన్సు సిఫార్సును, సుప్రీంకోర్టు రాప్టాకోస్ బ్రెట్ కేసులో ఇచ్చిన తీర్పును దృష్టిలో పెట్టుకుని కనీసవేతనాన్ని నిర్ణయించాలని 43వ జాతీయ లేబర్ కాన్ఫరెన్స్ ఏకాభిప్రాయానికి వచ్చింది. కేంద్ర చట్టం కనీసవేతనంపై ధరల పెరుగదలకు అనుగుణంగా డిఎ చెల్లింపును నిర్దేశించింది. షెడ్యూల్‌లో ప్రకటించిన రంగాలు/వృత్తుల్లో పనిచేసే కార్మికు లకు ఇతర షెడ్యూల్‌లో అదే వృత్తిలోని కార్మికుని వేతనం చెల్లించాలని ఉంది.** | **ఈ సిఫార్సులతోనూ, సుప్రీంకోర్టు తీర్పుతోనూ సంబంధం లేకుండా ప్రభుత్వం/ప్రభుత్వాలు కనీస వేతనం నిర్ణయించడానికి ఒక ప్రాతిపదిక లేకుండా తమ ఇష్టం వచ్చినట్లు నిర్ణయించే అవకాశాన్ని చట్ట సవరణ ద్వారా కల్పించింది. కరువు భత్యం (డి.ఎ) ఇవ్వనవసరం లేకుండా ఐదేళ్లలోపు కనీస వేతనాన్ని సవరించాలని ప్రతిపాదించింది. షెడ్యూల్‌లోని రంగాల్లో పనిచేసే కార్మికులకు అధిక నైపుణ్యం ఉన్నాసరే నైపుణ్యం లేని కార్మికునికిచ్చే కనీసవేతనాన్నే వర్తింపజేయాలని ఈ చట్టంలో సవరణలు ప్రతిపాధించారు.** |
| **8. కార్మిక చట్టాలు** | **కార్మిక చట్టాలు అమలుకు సంబంధించిన రిటర్న్‌లు, రిజిష్టర్లు మెయిన్‌టెయిన్ చిన్న పారిశ్రామిక సంస్థ అయినా అమలు చేయాల్సి ఉంది.** | **రిజిష్టర్లు, రిటర్న్‌లు మెయింటెయిన్ చేయనవసరం లేకుండా యజమానులకు మినహాయింపు ఇవ్వాలని చట్ట సవరణలో ప్రతిపాదించారు. ఈ చట్టం సవరణలు ద్వారా 72శాతం ఫ్యాక్టరీలలో యజమానులు తమ ఇష్టం వచ్చి నట్టు చట్టాలు ఉల్లంఘించి కార్మికులపై దోపిడీని మరింత తీవ్రం చేసే పరిస్థితి ఏర్పడుతుంది.** |

కాకపోవడంతో ఉన్న చట్టాలను అమలు చేయ కుండా ఆటంకాలు కల్పిస్తున్నారు. నేడు చట్టాల అమలుకన్నా ఉల్లంఘన ఎక్కువగా సాగుతున్నది. స్పెషల్ ఎకనమిక్ జోన్స్‌లో (సెజ్) కార్మిక చట్టాలు అన్నీ అమలు చేయాలి. కానీ యూని యన్ రిజిస్ట్రేషన్‌గానీ, సంప్రదింపులు గానీ, ఒప్పందాలుగానీ ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. సెజ్‌లు ఆధునిక జైళ్లుగా ఉన్నాయి. చట్టం అనుమ తించకున్నా కాల్ సెంటర్లలో ఆడవాళ్ల తో 12 గంటలు – ఓ.టి లేకుండా – పనిచేయి స్తున్నారు. జిందాల్, ఎస్సార్, ఎల్ అండ్ టి తదితర బడాపెట్టుబడి దారుల కంపెనీల్లో పర్మినెంట్ కార్మికులనేవారు ఒక్కరూ ఉండరు. పర్మినెంట్ స్వభావం గల పనులన్నీ కాంట్రాక్టు కార్మికులే చేస్తున్నారు. మారుతీ ఉద్యోగ్, యానాం రీజెన్సీ లాంటి అనేక కంపెనీల్లో పోరాడే కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయకుండా క్రిమినల్ చట్టాలు ప్రయోగించి సంవత్సరాల తరబడి జైళ్లలో కుక్కుతున్నారు. కార్మికుల పనిప్రదే శాల్లో ఇన్‌స్పెక్షన్‌ను ఎప్పుడో ఎత్తేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే కార్మిక వివాదాలకు సంబంధించిన సమస్యల్లో 90శాతం కార్మిక చట్టాలు ఉల్లంఘించబడుతున్నాయి. అన్నిచోట్లా 'హైర్ అండ్ ఫైర్' అమలవు తోంది. యజమా నులు యథేచ్ఛగా తమకు ఇష్టంలేనివారిని కష్టపడకుండా తొలగిస్తు న్నారు. కాంట్రాక్టీకరణ శరవేగంతో కొనసా గుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే వీరు ప్రభుత్వ రంగంలో 50శాతం, ప్రయివేటు రంగంలో 70శాతం పైగా ఉన్నారు. స్కీమ్ కార్మికుల పేరుతో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం లాంటి ఐసిడిఎస్ కార్మికులు ఇతర ఆరోగ్య కార్మికులకు అతిస్వల్ప జీతాలతో పనులు చేయిస్తూ కనీస వేతన చట్టం అమలు చేయడంలేదు. చట్టాల ఉల్లంఘన ద్వారా దోపిడీని తీవ్రం చేసి విదేశీ, స్వదేశీ పెట్టుబడి దారులకు లాభాలను దోచిపెట్టే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఫలితంగా యాజమాన్యాల లాభాల వాటా

> **" కార్మిక చట్ట సవరణలను దేశవ్యాప్తంగా కార్మికవర్గం యావత్తు రాజకీయాలతో సంబంధం లేకుండా వ్యతిరేకిస్తు న్నాయి. అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే సంప్రదించాయి. చట్టం పార్లమెంటులో పెట్టేముందు తమను సంప్రదించాలనీ లేకుంటే నిరవధిక సమ్మెకు కార్మికవర్గం పూనుకుంటుందనీ హెచ్చరించాయి. "**

1980లో 20శాతం ఉంటే 2010 నాటికి 60శాతం (మూడురెట్లు) పెరిగింది. కొన్ని పరి శ్రమల్లో పదిరెట్లు కూడా పెరిగింది. అప్రెంటీస్ చట్టంలో మార్పులు చేస్తే ఇప్పుడున్న కాంట్రాక్టు కార్మికులను కూడా తొలగించి ఇంకా తక్కువ జీతాలు ఇచ్చే అప్రెంటీసులను నియమించి అన్ని పనులు బానిసల్లాగా చేయించు కోవచ్చు. అప్రెంటీసులు కాబట్టి వారు ఏ యూనియన్‌లో సభ్యులుగా చేరడానికి చట్టాలు అనుమ తించవు.

### చట్టసవరణ ప్రభావం

వాస్తవానికి కార్మిక వర్గం చట్టాలను పురో గమన దిశగా మార్చాలని కోరు కుంటున్నది. కానీ బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను తిరో గమన దశకు మార్చడానికి పూనుకుంటోంది. దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. కార్మికుల తొలగింపు, కంపెనీలు లాకౌట్, లే ఆఫ్, మూసివేతలకు ప్రభుత్వ అనుమతులు, వేతన ఒప్పం దాలు... తదితర ముఖ్య అంశా లకు సంబంధించిన కార్మిక వివాదాల చట్టం 1947ను 300మంది లోపు ఉన్న పరిశ్రమలకు వర్తించకుండా చట్టాన్ని మారిస్తే దేశంలో 80 శాతం కార్మికులకు చట్టమే వర్తించకుండా పోతుంది. కాంట్రాక్టు కార్మిక చట్టాన్ని ఇప్పుడున్న ఒక కాంట్రాక్టరు వద్ద 20 మందికి వర్తించే బదులు 49మంది వరకు వర్తించితే 80శాతం మంది చట్టపరిధిలో నుంచి బయటకు పోతారు. ఫ్యాక్టరీ చట్టం 50 మంది మాత్రమే ఉన్న పరిశ్రమలకు అమలు చేస్తే 71.3 శాతం పరిశ్రమలకు వర్తించ కుండా పోతుంది.

ఇప్పుడున్న చట్టాల్లో అనేక లొసుగులు ఉ న్నాయి. హత్యచేసిన నేరస్తుడు కూడా నేరుగా కోర్టుకు వెళ్లవచ్చు. కానీ కార్మికుడు నేరుగా కోర్టుకు వెళ్లే విధంగా కార్మిక చట్టాలు లేవు. లేబరు ఆఫీసరు వద్ద విచారణ జరిగి కన్సిలియేషన్ విచారణలో అధికారులు అనుమతిస్తేనే కార్మికుల తొలగింపు న్యాయమా? అన్యాయమా? అని కార్మిక కోర్టు విచారిస్తుంది. బోనస్, గ్రాట్యుటీ చట్టంలో సీలింగ్ విధించారు. పెన్షన్ చట్టాలు మార్పుచేసి వచ్చే పెన్షన్‌ను ఊడబెరికారు. నష్టపరిహారచట్టం ప్రకారం కార్మికుని నెల జీతం రూ.10వేలు దాటితే చట్టం వర్తించదు. సీలింగు ల పేరుతో అనేక చట్టాలు అమలుకాకుండా చట్టా లు చేసేటప్పుడే అనేక కన్నాలు పెట్టి యజమా నులకు లాభించేలా నేటికీ చట్టాలు ఉన్నాయి.

### పోరాటాలు తప్పవు

ప్రజల అవసరాలు తీర్చే సరుకులను శ్రమ శక్తిని ధారబోసి ఉత్పత్తిచేసే కార్మిక వర్గంపై బిజెపి కేంద్ర ప్రభుత్వం కక్షబూ నడం దుర్మార్గం. పాలకులు తాము బడా పెట్టుబడి దారుల అనుకూలురం అని బరితెగించి చాటుకోవడమే. కేంద్ర ప్రభుత్వం పాలకవర్గాల ఒత్తిడికి లొంగి కార్మిక చట్టాల సవరణకు పూనుకున్నది. కార్మిక చట్ట సవరణలను దేశవ్యాప్తంగా కార్మికవర్గం యావత్తు రాజకీయాలతో సంబంధం లేకుండా వ్యతిరేకిస్తున్నాయి. అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే సంప్రదించాయి. చట్టం పార్ల మెంటులో పెట్టేముందు తమను సంప్రదించాలనీ లేకుంటే నిరవధిక సమ్మెకు కార్మికవర్గం పూనుకుంటుందనీ హెచ్చరిం చాయి. 2014 సెప్టెంబర్ 15న ఢిల్లీలో కార్మిక సంఘాలు ఐక్యంగా జాతీయ సదస్సును నిర్వహి స్తున్నాయి. అయినా కేంద్ర ప్రభుత్వం మొండిగా సవరణలకు పూనుకుంటే దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవడం అనివార్యం. ⊕

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!


'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

ఆర్థిక రంగం

# సంస్కరణలు - పేదరికం


కొండూరి వీరయ్య



అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులు.


**భా**రతదేశంలో పేదరికాన్ని నిర్ధారించటానికి ప్రధాని ఆర్థిక సలహాదారుల మండలి అధ్యక్షులు సి. రంగరాజన్ అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ జూలై మొదటి వారంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దాంతో దారిద్ర్యరేఖ నిర్ధారణ గురించి మరోసారి చర్చ మొదలైంది. ఏ దేశంలోనైనా ఆర్థిక వ్యవస్థ మౌలిక లక్ష్యం పేదరిక నిర్మూలన. అయితే ఈ రెండింటి మధ్య సంబంధం అంత సూటిగా, స్పష్టంగా కనిపించదు. పేదరికం కేవలం ఆర్థిక ప్రాధాన్యత కలిగిన అంశమే కాదు. రాజకీయ ప్రాధాన్యత కలిగిన అంశం కూడా. ఆర్థిక వ్యవస్థకు దిశా నిర్దేశం చేసే ప్రభుత్వాలు కూడా ఈ లక్ష్యాన్ని గమనంలోకి తీసుకుని విధి విధానాలు రూపొందించటం ఆనవాయితీ. ఈ మధ్య కాలంలో ప్రభుత్వ మేధావులు, ఆర్థికవేత్తలు, సంస్కరణలవాదుల నాయకత్వంలో హోరెత్తుతున్న చర్చ అంతా అభివృద్ధి గురించే. అయితే అభివృద్ధికీ, పేదరిక నిర్మూలనకూ మధ్య ఉన్న సంబంధం గురించి ఈ చర్చల్లో ఎక్కడా కనిపించదు. ఆయా సందర్భాల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు విస్తృత ప్రజా ప్రయోజనాలను ఏ మేరకు తీర్చగలుతున్నాయన్నది అర్థం చేసుకోవటానికి పేదరికం గణాంకాలు ఒక ముఖ్యమైన ప్రమాణం. ఈ దిశగా ప్రభుత్వ విధానాలు, పేదరికం మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవటం అనివార్యమైన అవసరం. అందువల్లనే దేశంలో పేదరికానికి సంబంధించిన అంచనాలు విడుదలైనప్పుడల్లా అటు మేధావులు ఇటు రాజకీయ పక్షాలు, విశ్లేషకులు పేదరికాన్ని నిర్ధారించే ప్రమాణాలు, గణాంకాలు, వాటి ప్రామాణికతల గురించి చర్చ ముందుకు తెస్తూ ఉంటారు. అందువల్లనే చివరకు ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థతో సహా అంతర్జాతీయ మేధోమథన కేంద్రాలన్నీ అయిష్టంగానే అయినా పేదరికం గురించి ప్రస్తావించాల్సి వస్తోంది.

అయితే గత రెండు దశాబ్దాలుగా ఆర్థిక సంస్కరణలు వేగం పుంజుకున్న తర్వాత పేదరికం గురించి ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదన్న భావన వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి కొందరు ఆర్థిక వేత్తలు ఇంకా ముందడుగు వేసి పేదరిక నిర్మూలన ప్రభుత్వ ప్రత్యేక లక్ష్యాల్లో అంతర్భాగం కావాల్సిన అవసరం లేదని, ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుంటే పేదరికం దానంతట అదే తగ్గిపోతుందని వాదిస్తున్నారు. దీనికి భిన్నంగా రంగరాజన్ తన నివేదికకు రాసిన ఉపోద్ఘాతంలో “ఆర్థిక విధానాల అంతిమ లక్ష్యం అభివృద్ధి ఒక్కటే కాదు. సదరు అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రజలందరికీ అందేలా చూడాలి” అని ముక్తాయింపు ఇచ్చారు. చివరకు ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయంగా ఆర్థికాభివృద్ధి పరుగులు తీసినా దారిద్ర్య నిర్మూలనలో దాని ప్రభావం అంతగా కనిపించకపోవటంతో ఐక్యరాజ్యసమితి సహస్రాబ్ది లక్ష్యాల పేరిట దారిద్ర్య నిర్మూలన ప్రత్యేక లక్ష్యంగా ఎంచుకుని ప్రభుత్వాలు అందుకు కృషి చేయాలని తీర్మానించింది. ఈ లక్ష్యాల అమలును కూడా పర్యవేక్షించటానికి ప్రత్యేక సలహా సంఘాలు నియమిస్తోంది. ఈ నేపథ్యంలో రంగరాజన్ కమిటీ నిర్ధారించిన పేదరికం ప్రమాణాలు, పేదరికం స్థాయి, గత రెండు దశాబ్దాల పాటు దేశంలో అమల్లో ఉన్న ఆర్థిక విధానాలకూ, నేటి పేదరికానికీ మధ్య ఉన్న సంబంధం గురించి చర్చించాల్సిన అవసరం ఉంది.

## పూర్వరంగం

స్వాతంత్ర్యానికి పూర్వం దారిద్ర్య రేఖను నిర్ధారించే తొలిప్రయత్నం గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన దాదాభాయి నౌరోజి చేశారు. 1876లో లండన్ ఈస్టిండియా సంఘం బొంబాయి బ్రాంచిలో “భారతదేశంలో పేదరికం” అన్న అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. అప్పట్లో “మనిషి ఆరోగ్యంగా, గౌరవంగా జీవించటానికి అవసరమైన కనీస ఆదాయమే” దారిద్ర్య రేఖకు ప్రమాణంగా నిర్వచించారు. ఈ నిర్వచనంలో ఆయన మాటల్లోనే, “మనిషి పని చేయటానికి అవసరమైన శక్తి, వినోదం, సామాజిక మత పరమైన అవసరాలు, సంతోషం, దు:ఖం సమయంలో పెట్టే ఖర్చులు, కరువు కాటకాల సమయంలో ఆధారపడటానికి అవసరమైన పొదుపు”లను పరిగణనలోకి తీసుకోలేదు. దారిద్ర్యరేఖను నిర్వచించే రెండో ప్రయత్నం 1938లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన జాతీయ ప్రణాళికా కమిటీ చేపట్టింది. “స్వతంత్ర భారతదేశంలో దారిద్ర్య నిర్మూలన ప్రణాళిక సంఘం ప్రాథమిక లక్ష్యంగా ఉంటుంది” అని ప్రణాళిక కమిటీకి అధ్యక్షుని హోదాలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. కానీ స్వాతంత్ర్యానంతరం ప్రణాళిక సంఘం మార్గదర్శకత్వంలో రూపొందించి అమలు జరిపిన ఆర్థిక విధానాలు అప్పుడే రెక్కలు విచ్చుకుని స్వేచ్ఛగా విహరించటానికి సిద్ధమైన జాతీయ బూర్జువావర్గం ప్రయోజనాలే లక్ష్యంగా రూపొందాయి తప్ప నెహ్రూ చెప్పినట్లు దారిద్ర్య నిర్మూలన లక్ష్యంతో ఆర్థిక విధానాలు రూపొందలేదు. స్వాతంత్ర్యానంతరం పాలకవర్గాల స్వభావంలోనూ, ఆలోచనలోనూ వచ్చిన మార్పులను వర్గ దృక్పథాన్ని ఈ పరిణామం నిర్ధారిస్తుంది. స్వాతంత్ర్యోద్యమంలో అంతర్భాగంగా సాగిన సాయుధ రైతాంగ పోరాటాల ఫలితంగా భూసంస్కరణలు వంటి కొన్ని ప్రజాప్రయోజనకరమైన విధానాలు తెరమీదకు తెచ్చినా స్థూలంగా చూసినపుడు ప్రభుత్వం జాతీయాభివృద్ధిని పక్కన పెట్టి పాలకవర్గాల అభివృద్దే జాతీయాభివృద్ధిగా పరిగణించటం ప్రారంభించింది. దాంతో దేశంలో ఆర్థిక, సామాజిక పరిస్థితులు తలకిందులయ్యాయి. కరువుకాటకాలు పెచ్చరిల్లాయి. ఈ పరిస్థితుల్లో దేశంలో తలెత్తిన ప్రజా ఉద్యమాలు, ప్రత్యేకించి రైతాంగ ఉద్యమాల ఒత్తిడి మేరకు ప్రభుత్వం పేదరికం గురించి పున:పరిశీలన చేయాల్సి వచ్చింది. మారుతున్న పరిస్థితులతో పాటు అప్పుడే కాంగ్రెస్‌ను చీల్చి స్వంత కుంపటి పెట్టుకున్న ఇందిరా గాంధీ గరీబీ హటావో నినాదం ముందుకు తెచ్చింది. ఈ నినాదంతో ప్రజల మద్దతు పొందిన ఇందిరాగాంధీ నాయ

కత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన వర్గ ప్రయోజనాల పరిరక్షణకు పూనుకుని తొలిసారి అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వద్దకు అప్పుకెళ్లింది. నాటి ఇందిరా గాంధీ నుండి నేటి ప్రపంచ బ్యాంకు వరకు దారిద్ర్య నిర్మూలనే లక్ష్యంగా ప్రకటిస్తూ తమ వర్గప్రయోజనాలు కాపాడుకునే ఆర్థిక విధానాలు తెర మీదకు తేవటం పాలకులకు ఆనవాయితీగా మారింది. అందువల్లనే ప్రపంచ బ్యాంకు పేదరికం గురించి ఎంత గట్టిగా మాట్లాడినా అప్పు తీసుకున్న ప్రభుత్వాలకోసం రూపొందించే ఆర్థిక విధానాల్లో ప్రైవేటీకరణకే పెద్ద పీట వేస్తుంది. దాంతో ఈ విధానాలు అమలు జరిగిన దేశాల్లో పేదరికం నిర్మూలన ఎలా వాన్నా సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు.

1979లో ప్రణాళిక సంఘం దారిద్ర్య రేఖను నిర్ధారించటానికి ప్రాతిపదికగా తీసుకోవాల్సిన ఆహార అవసరాలను నిర్ధారించటానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయటం భారతదేశంలో దారిద్ర్యరేఖను నిర్ధారించే మూడో ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. ఈ టాస్క్‌ఫోర్స్ వయో,లింగ వైవిధ్యంతో పాటు గ్రామీణ పట్టణ వైవిధ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లో 2400 కిలో కెలోరీలు ఇచ్చే ఆహారం, పట్టణ ప్రాంతాల్లో 2100 కిలో కెలోరీలు ఇచ్చే ఆహారం తీసుకోవటాన్ని దారిద్ర్య రేఖకు ప్రమాణంగా నిర్ధారించింది. ఈ అంచనాలను 1973–74 నాటి జాతీయ నమూనా సర్వేలో వెల్లడైన వినిమయ వ్యయం లెక్కల ఆధారంగా దేశంలో పేదల సంఖ్యను నిర్ధారించింది. ఈ నిర్ధారణ ప్రకారం 1973–74లో గ్రామీణ ప్రాంతాల్లో 56.4 శాతం, పట్టణ ప్రాంతాల్లో 49 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారని ప్రణాళిక సంఘం నిర్ధారించింది.

### పేదరికంపై తాజా చర్చ

సంస్కరణల కాలంలో పేదరికం తీరు తెన్నులు గురించి తెలుసుకోవటానికి 1993–94 నాటి పేదరికం అంచనాలను కూడా పరిశీలించాలి. ఎందుకంటే అప్పట్లో లక్డావాలా అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం అంచనాలు నేడు రంగరాజన్, ఆయనకు ముందు దివంగత సురేష్ టెండూల్కర్‌ల నేతృత్వంలో ఏర్పాటైన నిపుణుల సంఘాల అంచనాలు ఈ రెండు దశాబ్దాల కాలంలో పేదరికం తీరుతెన్నులను గుర్తించటానికి ఉపయోగపడతాయి. అంతే కాదు. స్థూలంగా చూసినపుడు ఈ రెండు దశాబ్దాల కాలంలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన వేగంతో అభివృద్ధి చెందింది.

> **“ఈ రెండు దశాబ్దాల కాలంలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన వేగంతో అభివృద్ధి చెందింది. సంస్కరణ వాదులు కోరుకున్న అభివృద్ధి లక్ష్యం ఒక మేరకు నెరవేరింది. సంస్కరణలు చోదకశక్తిగా సాధించిన అభివృద్ధి పేదరికాన్ని ఏ మేరకు తగ్గించిందో తెలుసుకోవటానికి ఈ పోలిక దోహదం చేస్తుంది.”**


రంగరాజన్


సురేష్ టెండూల్కర్

సంస్కరణ వాదులు కోరుకున్న అభివృద్ధి లక్ష్యం ఒకమేరకు నెరవేరింది. సంస్కరణలు చోదకశక్తిగా సాధించిన అభివృద్ధి పేదరికాన్ని ఏ మేరకు తగ్గించిందో తెలుసుకోవటానికి ఈ పోలిక దోహదం చేస్తుంది.

లక్డావాల కమిటీ కనీస ఆహార అవసరాల ప్రాతిపదికన పేదరికాన్ని నిర్ధారించే ప్రయత్నాన్ని కొనసాగించాలని తీర్మానించింది. ఈ ఆహార అవసరాలు తీర్చుకోవటానికి అయ్యేంత ఆదాయం సంపాదించుకోగలిగితే పేదలు కాదనీ, వారి సంపాదన ఈ మాత్రం అవసరాలు కూడా తీర్చలేకపోతే అటువంటి ప్రజలను పేదలుగా గుర్తించాలని లక్డావాలా కమిటీ సిఫార్సు చేసింది. ఆ తర్వాత జాతీయ స్థాయిలో పేదరికాన్ని అంచనా వేయటానికి జరిగిన తొలి ప్రయత్నంగా సురేష్ టెండూల్కర్ కమిటీని చెప్పుకోవచ్చు. ఈ మధ్య కాలంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాల్లో సంస్కరణలు అమలు చేయటానికి స్వతంత్రంగా కొన్ని సర్వేలు చేసినా అవి పచ్చకామెర్ల కళ్ల సామెతనే గుర్తు తెచ్చాయి తప్ప పేదరికం నిర్ధారణలో సార్వత్రిక ప్రమాణాలు నెలకొల్పలేకపోయాయి. కేంద్రంలో మొదటిసారి యుపిఎ ప్రభుత్వం అధికారానికి వచ్చాక 2005లో ప్రఖ్యాత ఆర్థికవేత్త సురేష్ టెండూల్కర్ అధ్యక్షతన పేదరికం అంచనాలకు ఒక కమిటీ నియమించింది కేంద్ర ప్రభుత్వం. ఈ కమిటీ 2009లో తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అప్పటివరకు పట్టణ ప్రాంత పేదరికం, గ్రామీణ ప్రాంత పేదరికం వేర్వేరు ప్రమాణాలతో అంచనా వేసే సాంప్రదాయం ఉండేది. దీని స్థానంలో టెండూల్కర్ కమిటీ పట్టణ ప్రాంత పేదరికం అంచనాకు అనుసరించే ప్రమాణాలనే గ్రామీణ ప్రాంత పేదరికానికి వర్తింప చేయాలని సూచించింది. ఆ ప్రాతిపదికనే పేదరికం అంచనాలు లెక్కించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పేదరికం గణనీయంగా తగ్గిందని నిర్ధారించింది. టెండూల్కర్ “ప్రాథమికంగా పేదరికం భావన కనీస మానవ అవసరాల కొరత గురించి సామాజిక పరిశీలన పై ఆధారపడి ఉంటుంది” అని నిర్ధారించటం ద్వారా పేదరికాన్ని అంచనా వేయటానికి శాస్త్రీయ ప్రమాణమేమీ ఉండబోదనీ, ఎవరికి తోచిన అంచనాలు వారు వేసుకోవచ్చన్న అవగాహనకు తలుపులు తీశారు. అంతేకాదు. జీవన ప్రమాణాల కొరత, వనరుల లేమి ప్రజల నిజ జీవితంలో అంతర్భాగం అన్న వాస్తవాన్ని ఆయన గుర్తించనిరాకరించారు. ఈ అవగాహనే సుప్రీం కోర్టులో ప్రణాళిక సంఘం ఇచ్చిన అఫిడవిట్‌లో వ్యక్తమైంది. ఈ అఫిడవిట్‌లో రోజుకు 32 రూపాయలు సంపాదించే వాళ్లు పేదలు కాదని ప్రణాళిక సంఘం నిర్ధారించటంతో మేథో వర్గాలు, రాజకీయ పక్షాల్లో పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో టెండూల్కర్ కమిటీ అంచనాలు పునః పరిశీలించటానికి రంగరాజన్ అధ్యక్షతన మరో కమిటీని నియమించింది యుపిఎ2 ప్రభుత్వం.

ఈ వ్యాసంలో చూపించిన మొదటి పట్టికలో టెండూల్కర్ కమిటీ, రంగరాజన్ కమిటీల మధ్య నెలసరి తలసరి వినిమయంలో ఉన్న తేడాలు వివరించగా, రెండో పట్టిక పేదరికం అంచనాలకు సంబంధించి రెండు కమిటీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తుంది. 2009–10 నాటికి ఒక వ్యక్తి గ్రామీణ ప్రాంతంలో నెలకు రు.673, పట్టణ ప్రాంతాల్లో రు.860 వెచ్చించ గలిగితే సదరు వ్యక్తి దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నట్లుగా టెండూల్కర్ నిర్ధారించారు. అంటే 2009–10లో గ్రామీణ ప్రాంతంలో రోజుకు 22.43 రూపాయలు, పట్టణ ప్రాంతంలో రోజుకు 28 రూపాయలు ఖర్చు చేయగలిగితే

> **❝ టెండూల్కర్ కమిటీ పట్టణ గ్రామీణ ప్రాంతాలకు ఒకటే తలసరి వినియోగం లెక్కించటం, రోజువారీ సగటు తలసరి వినియోగాన్ని 22 రూపాయలకు తగ్గించటం ద్వారా పేదరికం తగ్గినట్లు చూపిస్తే రంగరాజన్ కమిటీ మరో అడుగు ముందుకేసి వైద్య ఆరోగ్య ప్రమాణాల ప్రకారం ప్రజలు తీసుకోవాల్సిన అహారం మోతాదునే తగ్గించేసింది. ❞**

మనిషి గ్రామీణ ప్రాంతంలో 2155 కిలో కేలోరీలు, పట్టణ ప్రాంతంలో 2090 కిలో కెలోరీల శక్తినిచ్చే ఆహారం తీసుకుంటే సరిపోతుందని నిర్ధారించింది. అంటే మొత్తం ఆహార అవసరాల్లో 10 శాతం తగ్గించేసింది. తద్వారా వ్యక్తిగత ఆహార అవసరాలు, కుటుంబ అహార అవసరాలకు అయ్యే ఖర్చును కూడా ఆ మేరకు తగ్గించటానికి రంగరాజన్ కమిటీ నివేదిక మార్గం సుగమమం చేసింది. తలసరి వినియోగ వ్యయం తగ్గటం అంటే ప్రజల చేతిలో ఆ మేరకు అదనపు ఆదాయం ఉన్నట్లే. అంతేకాదు, అవసరమైన వ్యయాన్ని తగ్గించినట్లే. అవసరమైన వ్యయాన్ని తగ్గించటం ద్వారా దారిద్ర్యరేఖ ప్రమాణాలు కూడా తగ్గుతాయి. తద్వారా మొత్తంగా పేదల సంఖ్య తగ్గుతుంది. ఇది రంగరాజన్ కమిటీ నివేదిక నిర్వాకం. ఈ విధంగా అంకెల్లో మతలబు చేయటం ద్వారా పేదరికం తగ్గినట్లు చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయటం అనైతికం. ఆ ప్రయత్నానికి దేశవ్యాప్తంగా పేరున్న ఆర్థిక వేత్తలు, విశ్లేషకులు మద్దతు పలకటం వారి గౌరవానికి తగిన పని కాదు.

**పట్టిక 1 నెలసరి తలసరి వినియోగంలో చూపించిన తేడాలు, రూపాయల్లో**

| | 2009-10 | | 2011-12 | |
|---|---|---|---|---|
| | గ్రామీణ ప్రాంతం | పట్టణాలు | గ్రామీణ ప్రాంతం | పట్టణాలు |
| టెండూల్కర్ కమిటీ | 673 | 860 | 816 | 1000 |
| రంగరాజన్ కమిటీ | 801 | 1198 | 972 | 1407 |

**పట్టిక 2 మొత్తం పేదరికం అంచనాల్లో తేడాలు**

| | 2009-10 | | | 2011-12 | | |
|---|---|---|---|---|---|---|
| | గ్రామీణ ప్రాంతం | పట్టణాలు | మొత్తం | గ్రామీణ ప్రాంతం | పట్టణాలు | మొత్తం |
| టెండూల్కర్ కమిటీ | 278.2 | 76.5 | 354.7 | 216.7 | 61.5 | 269.8 |
| రంగరాజన్ కమిటీ | 325.9 | 128.7 | 454.6 | 260.5 | 102.5 | 363 |

సదరు వ్యక్తి పేదవాడు కాదు. రంగరాజన్ కమిటీ ఈ మొత్తాన్ని గ్రామీణ ప్రాంతంలో రూ. 801 కి పట్టణ ప్రాంతంలో రూ. 1198కి పెంచింది. రంగరాజన్ కమిటీ అంచనాల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో ఒక మనిషి నెలకు రూ. 801, పట్టణ ప్రాంతంలో రూ. 1198 వెచ్చించగలిగితే సదరు వ్యక్తి పేదవాడు కాదు. టెండూల్కర్ కంటే రంగరాజన్ కమిటీ అంచనాలో గ్రామీణ ప్రాంతంలోని వ్యక్తి రోజుకు రూ. 26.7 ఖర్చు పెట్టగలిగితే పేదవాడు కాదు. పట్టణ ప్రాంతంలో రోజుకు రూ. 39.93 ఖర్చు పెట్టగలిగితే పేదవాడు కాదు. నేడున్న ధరలు, ప్రజలకు అందుబాటులో ఉన్న వనరులు, వారి ఆదాయాలు పరిశీలిస్తే 2009 నాటి ధరలలో రోజుకు 26 రూపాయలకు ఆహారం, ఆరోగ్యం, విద్య, ఇల్లు అవసరాలు ఎలా తీరతాయన్న పెద్ద ప్రశ్న మనముందున్నది. వాస్తవికంగా రోజువారీ జీవితంలో అయ్యే ఖర్చులు లెక్కిస్తే ఈ పేదరికం అంచనాలు కనీసం రెండు రెట్లు పెరుగుతా యన్నది తథ్యం.

రెండో పట్టిక ఈ రెండు కమిటీల అంచ నాల ప్రకారం దేశంలో ఉన్న పేదల సంఖ్యను తెలియచేస్తుంది. టెండూల్కర్ కమిటీ అంచనా ప్రకారం పైన చెప్పిన ప్రమాణాలు పాటిస్తే 2009-10లో భారతదేశంలో 35.47 కోట్ల మంది పేదలు ఉన్నారు. 2011-12 నాటికి వీరి సంఖ్య 26.98 కోట్లకు తగ్గింది. అంటే రెండేళ్లలో 8.49 కోట్ల మంది దారిద్ర్య రేఖను దాటి ముందుకొచ్చారు. రంగరాజన్ కమిటీ అంచనాల ప్రకారం 2009-10 నాటికి దేశం లో 45.46 కోట్ల మంది (టెండూల్కర్ కమిటీ అంచనా కంటే 10 కోట్ల మంది అదనంగా) పేదలున్నారు. 2011-12 నాటికి వీరి సంఖ్య 36.3 కోట్లకు తగ్గింది. ఆశ్చర్యం ఏమిటంటే రెండు కమిటీల అంచనాల్లోనూ సంవత్సరానికి 8.7 శాతం మంది పేదలు దారిద్ర్యరేఖను అధిగమించారు. సంవత్సరానికి 8.7 శాతం చొప్పున ప్రజలు దారిద్ర్యరేఖను అధిగమించగలి గారంటే మరి దేశంలో ఇంత కాలం పేదరికం ఎందుకున్నట్లు అన్న ప్రశ్న మనలను తొలుస్తుంది.

### తప్పుడు పద్ధతులు - తప్పుడు అంచనాలు

టెండూల్కర్ కమిటీ పట్టణ గ్రామీణ ప్రాంతాలకు ఒకటే తలసరి వినియోగం లెక్కించటం, రోజువారీ సగటు తలసరి విని యోగాన్ని 22 రూపాయలకు తగ్గించటం ద్వారా పేదరికం తగ్గినట్లు చూపిస్తే రంగరాజన్ కమిటీ మరో అడుగు ముందుకేసింది. వైద్య ఆరోగ్య ప్రమాణాల ప్రకారం ప్రజలు తీసుకోవాల్సిన అహారం మోతాదునే తగ్గించేసింది రంగరాజన్ కమిటీ. భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధీనం లోని భారత ఔషధ పరిశోధన మండలి ప్రజల ఆహార వ్యవహారాలు, సంస్కృతి, చేసే పని, వయసు, లింగం వంటి వ్యత్యాసాలను గమనంలోకి తీసుకుని గ్రామీణ ప్రాంతంలో సగటు ఒక మనిషి రోజుకు 2400 కిలో కెలోరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోవాలనీ, అప్పుడే ఆరోగ్యంగా ఉండగలరనీ నిర్ధారించింది. 1979లో వై కె అలఘ్ కమిటీ మనిషి ఆరో గ్యంగా ఉండటానికి, తన పని తాను చేసు కోవటానికి అవసరమైన ఆహారాన్ని ప్రమాణంగా తీసుకుని తలసరి దినసరి కనీస వినియోగాన్ని లెక్కించింది. నాటి నుండి పేదరికం నిర్ధారణల్లో ఈ అంశం కేంద్ర స్థానంలో ఉంది. కానీ రంగరాజన్ కమిటీ నిర్ధారణ ప్రకారం ఒక

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. గత 35 సంవత్సరాల కాలంలో శ్రామిక పని ప్రదేశాల్లో తక్కువ శ్రమ శక్తితో పని చేయగలిగిన ఏ కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చిందని వ్యక్తిగత ఆహార అవసరాలు తగ్గించారో ఎవ్వరికీ అంతుబట్టని సమస్య. గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 2155 కిలో కెలోరీల ఆహారం తీసుకుంటే వ్యక్తి ఆరోగ్యం గా ఉంటాడు, సమర్థవంతంగా పని చేయగలుగు తాడు అని రంగరాజన్ కమిటీ నిర్ధారణకు వచ్చిందంటే వాస్తవిక గ్రామీణ జీవితానికీ, ప్రభు త్వం నియమించే నిపుణుల కమిటీ అంచనాలకూ మధ్య ఎంత వ్యత్యాసం ఉందో తెలుస్తుంది. ఈ మేథోపరమైన అనైతిక చర్య కేవలం సంస్క రణలు ద్వారా పేదరికం తగ్గాయన్న వాదనకు అవసరమైన సాక్ష్యాధారాలు సిద్ధం చేయటానికి దాపయోగపడుతుంది తప్ప వాస్తవిక పరిస్థితుల్లో

మార్పులు తేవటానికీ, పేదల స్థితిగతులు మెరుగుపర్చటానికీ ఉపయోగపడేది కాదు.

**అనైతిక నిర్ధారణలు**

అంతేకాదు. మరో ముఖ్యమైన సమస్య మనముందుకొస్తుంది. అంతర్జాతీయ పెట్టుబడి దారీ సంక్షోభం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 9 శాతం నుండి 4.5 శాతానికి పడిపోయిన కాలం ఇది. ప్రత్యేకించి 2009-2010 నుండి 2011-12 మధ్య కాలంలో ఆర్థికాభివృద్ధి పతనం అయ్యిందని, అభివృద్ధిని నిలబెట్టే చర్యలు తీసుకోలేకపోయారన్న అపవాదు పరాజిత మన్మోహన్ సింగ్ ప్రభుత్వం మీద ఉంది. ఈ పతనం అయిన అభివృద్ధిని పట్టాలు ఎక్కించటానికే తాను అధికారానికి వచ్చానని చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం సర్వే సర్వత్రా ప్రైవేటు మయం, ప్రైవేటు భాగస్వామ్య మయం అవుతోంది. అంటే గత నాలుగు సంవత్సరాల్లో ఆర్థికాభివృద్ధి ఆశించిన స్థాయిలో లేకపోవటమేకాదు. ఉన్న స్థాయి నుండి కూడా పడిపోయింది. ఉత్పత్తి, ఎగుమతులు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అన్నీ పడిపోయాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఉదాహరణకు జాతీయ నమూనా సర్వే 68వ దఫా సర్వే వివరాలు పరిశీలిద్దాం.

ఈ సర్వే ప్రకారం 2011-12 నాటికి దేశంలో శ్రమ చేయగలిగిన వారి సంఖ్య 30.9 మిలియన్లకు చేరుకుంది. కానీ ఈ కాలంలో కేవలం 1.5 మిలియన్ల మందికే కొత్తగా ఉద్యోగాలు వచ్చాయి. 2009-2010 నాటికి ప్రతి వెయ్యి మందిలో 392 మంది ఏదో ఒక పని చేసే స్థితిలో ఉంటే (ఆర్థిక వ్యవస్థలో శ్రమ శక్తి భాగస్వామ్యం నిష్పత్తి) 2011-12 నాటికి ఈ నిష్పత్తి 1000 కి 364కి పడిపోయింది. అంటే రంగరాజన్ కమిటీ పేదరికం తగ్గిందన్న కాలంలోనే అదనంగా ప్రతి వెయ్యిమందిలో 28 మందికి పని చేసే అవకాశాలు, ఆర్థిక నిపుణుల భాషలో ఉపాధి అవకాశాలు కోల్పోయారు. తద్వారా జీవనోపాధి కోల్పోయిన, జీవన ప్రమాణాలు దిగజారిన వారి సంఖ్య వెయ్యికి 28 చొప్పున అదనంగా పెరిగింది. స్థూలంగా ఆర్థికాభివృద్ధి పతనం అవుతూ, ఉపాధి అవకాశాలు మృగ్యం అవుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం, వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోతూ, వస్తూత్పత్తి రంగం తిరోగమిస్తూ, సేవా రంగం, విదేశీ ఎగుమతుల రంగం స్థబ్దతకు చేరుకున్న సమయంలో, ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం ప్రభావం నుండి దేశ ఆర్థిక వ్యవస్థ బయటికి రాలేదు అని స్వయంగా ఆర్థిక మంత్రులే నొక్కి వక్కాణిస్తున్న సమయంలో భారతదేశంలో ఏడాదికి 8.7 శాతం చొప్పున పేదరికం ఎలా తగ్గింది? సంవత్సరానికి 8.7 శాతం మంది దారిద్ర్యరేఖ దాటి ఎలా పురోగమించగలిగారు? ప్రభుత్వం టెండూల్కర్ కమిటీ రూపంలో కానీ రంగరాజన్ కమిటీ రూపంలో కానీ దేశం ముందుంచిన పేదరికం అంచనాలు అనైతికం అని నిర్ధారించటానికీ, ఆధార రహితం అని నిరూపించటానికీ ఈ రెండు ఉదాహరణలు చాలు.

> **"ప్రపంచ సంక్షోభం ప్రభావం నుండి దేశ ఆర్థిక వ్యవస్థ బయటికి రాలేదు అని ఆర్థిక మంత్రులే నొక్కి వక్కాణిస్తున్న సమయంలో ఏడాదికి 8.7 శాతం చొప్పున పేదరికం ఎలా తగ్గింది? సంవత్సరానికి 8.7 శాతం మంది దారిద్ర్యరేఖ దాటి ఎలా పురోగమించగలిగారు? ప్రభుత్వం టెండూల్కర్ కమిటీ రూపంలో కానీ రంగరాజన్ కమిటీ రూపంలో కానీ దేశం ముందుంచిన పేదరికం అంచనాలు అనైతికం అని నిర్ధారించటానికీ, ఆధార రహితం అని నిరూపించటానికీ ఈ రెండు ఉదాహరణలు చాలు."**

**ఎందుకిలా చేశారు?**


అటు టెండూల్కర్ కానీ, రంగరాజన్ కానీ మేధోపరంగా చూసుకున్నపుడు వారి సామర్థ్యాలను శంకించలేము. ప్రపంచంలో వర్తమాన ఆర్థికవేత్తల సరసన ఉండగలిగిన నిపుణుల కోవకే చెందుతారు. మరి అటువంటి మేధో సామర్థ్యం ఉన్న వ్యక్తులు ఇటువంటి వివాదాస్పదమైన, సాధారణ ఆర్థిక పరిజ్ఞానం లేని వాళ్లు కూడా విమర్శించే పద్ధతుల్లో నివేదికలు ఎందుకు రూపొందిస్తారు? ప్రభుత్వాలు ఆ నివేదికల ఆధారంగా విధానాలు ఎందుకు ప్రతిపాదిస్తాయి? ఇక్కడే పాలకవర్గాల ప్రయోజనాలు, పాలకవర్గాల భావజాలం తెరమీదకు వస్తాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచీకరణ, సరళీకరణ, ఆర్థిక సంస్కరణలు ఆధిపత్య మేధో భావజాలంగా ముందుకొచ్చాయి. ఈ సంస్కరణలను విమర్శించిన వాళ్లు, వ్యతిరేకించిన వాళ్లపై సైద్ధాంతిక, మేధోపరమైన దాడులు పెరిగాయి. బెంగాల్‌లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ వామపక్ష ఉద్యమంపై జరుగుతున్న సైద్ధాంతిక దాడిని ఈ నేపథ్యంలోనే చూడాలి. ఈ ఆధిపత్య ఆర్థిక భావజాలం ప్రకారం ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలు సర్వరోగ నివారిణి. పేదరికాన్ని కూడా తగ్గిస్తాయి. ప్రజలను సంపన్నులను చేస్తాయి. ఆర్థికాభివృద్ధి నికరంగా పురోగమించేలా చేస్తాయి. అయితే ఈ వాదనను సమర్థించేవాళ్లు, సంస్కరణల పుట్టినిళ్లు అయిన యూరప్, అమెరికా దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు ఎందుకు సంక్షోభంలో పడ్డాయి, ఈ సంక్షోభం నుండి ఆర్థిక సంస్కరణలు అమలు జరుపుతున్న భారత దేశం వంటి వర్ధమాన దేశాలు సైతం ఎందుకు బయటపడలేకపోతున్నాయి అన్న ప్రశ్నలు వినటానికి కూడా సిద్ధం కారు. విన్నా సమాధానం ఇవ్వరు. పచ్చకామెర్ల కళ్ల సామెతే మనకు కనిపిస్తుంది.

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక పేదరికం పెరిగిందని ప్రభుత్వ లెక్కలే రుజువు చేస్తున్నాయి. ఈ లెక్కలను అంగీకరించటం అంటే ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలు విఫలం అయ్యాయన్న వాస్తవాన్ని అంగీకరించటమే. మొన్నటివరకు అధికారంలో ఉన్న యుపిఎ2 ప్రభుత్వం కానీ, నేడు అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కానీ ఈ వాస్తవాన్ని అంగీకరించటానికి సిద్ధంగా లేరు. ఈ వాస్తవాన్ని అంగీకరించటం అంటే ప్రస్తుత ప్రభుత్వ విధానాలకు ప్రామాణికంగా ఉన్న ఆలోచన నుండీ, భావజాలం నుండీ పక్కకు తప్పుకోవాలి. ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలకు ప్రత్యామ్నాయ విధానాల గురించిన చర్చ ముందుకు తేవాలి. ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాలు పరిశీలించాలి. ఈ కాలంలో పేదరికం పెరిగింది అని అంగీకరించటం అంటే సంస్కరణల ద్వారా జరిగిన అభివృద్ధి పేదరికాన్ని తగ్గించటంలో విఫలం అయ్యిందని అంగీకరించాలి. ఇలా అంగీకరించటం పాలకవర్గాల ప్రయోజనాలకు భిన్నం. విరుద్ధం. ఈ మేధావులు కూడా సదరు పాలక వర్గాల్లో భాగం, సమర్థకులు, ప్రచారకులు కాబట్టి ప్రభుత్వ, పాలక వర్గ ప్రయోజనాలు ప్రాతిపదికగా వాస్తవాలతో నిమిత్తం లేని ఇటువంటి నివేదికలు విడుదల చేస్తూ ఉంటారు. అందువల్ల ఈ అనైతికత వ్యక్తిగతం కాదు. దోపిడీ వ్యవస్థలో సంస్థాగతమైన వర్గ స్వభావం వ్యక్తీకరించే మార్గమే.

మతతత్వం

# చరిత్ర పరిశోధనా పీఠంపై ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకుడు


రామ్ పునియాని



బొంబాయి ఐఐటిలో బయోమెడికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసి స్వచ్ఛంద పదవీరమణ చేశారు. అప్పటినుండి సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు. మంచి రచయిత


అవకాశవాద శక్తుల రాజకీయ లక్ష్యం నెరవేరటానికి రాజకీయాలు, ఎన్నికలు అనేవి ప్రధాన సాధనాలుగా ఉపయోగపడతాయి. ప్రజల మనసులు గెలవటానికీ, తమ రాజకీయ ఎజెండా నిలబెట్టడానికీ, శాశ్వతం చేయటానికీ, సైద్ధాంతిక ప్రచారం విస్తృత పరచటం అనేది ఒక ప్రధాన అస్త్రంగా పని చేస్తుంది. అందువల్లనే దక్షిణ ఆసియా దేశాలలో మతతత్వాన్నీ, మత తత్వవాదాన్నీ వ్యాప్తి చేయటానికి చరిత్ర పాఠ్యాంశాలలో మార్పులు చేయటం ద్వారా, చరిత్రలోని అంశాలను ఒక వర్గానికి అనుకూలంగా మార్చి మతతత్వాన్ని బోధించటం ద్వారా ఈ లక్ష్యాలను చేరుకుంటున్నారు. 8వ శతాబ్దంలో సింధ్ ప్రాంతంలో మొహమ్మద్ బిన్ ఖాసిమ్ విజయం ద్వారా పాకిస్థాన్ దేశం ఏర్పడటానికి పునాది పడిందని పాకిస్థాన్‌లోని మతతత్వ శక్తులు ఇప్పటికీ బోధిస్తున్నారు. రాజ్యాలు, జాతీయ రాజ్యాంగ వ్యవస్థల మధ్య ఉన్న మౌలిక భేదాన్నీ, తేడానూ తెలిసిన వారెవ్వరూ ఈ రకంగా ప్రచారం చేసుకోరని మనందరికి తెలుసు. అవునులే, అధికార యంత్రాంగం తమ గుప్పిట్లో ఉంటే మతతత్వ శక్తులు ఏదైనా చేయగలవనటానికి ఇది మచ్చుతునక. అందులోనూ, విద్యావ్యవస్థ తమ చేతుల్లో ఉంటే దానిని తమ లక్ష్యాలకు అనుగుణంగా మార్చివేసి మెజారిటీ ప్రజానీకానికి నూరిపోయటానికి ఇది చక్కటి అవకాశం. అందువలనే 1999లో బిజెపి నాయకత్వంలోని ఎన్.డి.ఏ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చరిత్ర పుస్తకాలను మార్చివేసి గతంలో ఉన్న మతతత్వ వాదనలు వినిపించే ప్రయత్నం చేసింది. ఈసారి ఎన్నికలలో బి.జె.పి ఒంటరిగానే భారీ మెజారిటీతో అధికారంలోకి రావటంతో రానున్న రోజులలో పరిస్థితులు ఈ దిశగా మారే అవకాశాలు, మరీ ముఖ్యంగా విద్యారంగంలో హెచ్చుగా కనిపిస్తున్నాయి.

చరిత్రకు సంబంధించిన చెప్పుకోతగ్గ అవగాహనగానీ, పరిశోధనలో ఎటువంటి విద్యార్హతలూ, నైపుణ్యమూ గానీ లేనటువంటి ప్రొఫెసర్ వై.సుదర్శన్‌రావును జాతీయ చరిత్ర పరిశోధన కౌన్సిల్ అధ్యక్షుడిగా నియమించటం ఈ కోవలోనిదే. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు చారిత్రికత ఉన్నదా, లేదా అనే అంశంపై సుదర్శన్‌రావు పరిశోధన చేస్తున్నారు. అత్యున్నతమైన నిపుణులు పరిశోధనల ద్వారా తెల్చి చెప్పిన సారాంశాన్ని తోసిరాజని, ఆయన తన మనసులో భావాలను, తనకున్న సిద్ధాంతపరమైన పునాదులను బ్లాగు ద్వారా తెలియ చేస్తున్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కూ, తనకూ ఎటువంటి సంబంధం లేదని ఆయన బయట ఎంత వాదించినా, ఆయన ప్రచారం చేస్తున్న అంశాలను పరిశీలిస్తే హిందూత్వ ప్రచారం మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అంతేకాదు ఆయన ప్రసంగాలలో గత చరిత్రలో ఉన్న హిందూ సమాజాన్ని ఘనంగా పొగడటం, విదేశీ ముస్లింల వలన అది నాశనమయ్యిందని చెప్పటం, కుల వ్యవస్థను ఘనంగా కీర్తించటం ఆయన భావజాలం ఎక్కడ ఉందో స్పష్టంగా తెలియచేస్తోంది. దేశంలో నాన్న సామాజిక కట్టుబాట్లు, వాటి పుట్టక, ఇతర వ్యవస్థలు ఉత్తర భారతదేశంలో ఏడు శతాబ్దాల క్రితం ముస్లింలు పరిపాలన సాగించినప్పుడు ప్రారంభమయ్యాయని దేశ, విదేశీ విద్యావేత్తలు, ఆంగ్లంలో విద్యనభ్యసించిన మేధావులు చెప్పినట్లు ఆయన ప్రకటించాడు. పురాతన కాలంలో కుల వ్యవస్థ ఎటువంటి సమస్యలు లేకుండా, అద్భుతంగా నడిచేదనీ, దానికి ఎవరూ అభ్యంతరం తెలపలేదనీ ఆయన తన వాదనలో పేర్కొన్నారు.

సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అంటరానితనం, ఇతర సామాజిక కట్టుబాట్లను కొంచెం లోతుగా హేతుబద్ధంగా రావుగారు పరిశోధన చేసి ఉంటే, స్వాతంత్రోద్యమం ఊపందుకుంటున్న రోజులలో ఈ దుర్మార్గాలను ప్రశ్నించిన అనేక మంది మేధావుల విశ్లేషణలను పరిశీలిన చేసిఉంటే, కుల వ్యవస్థ దుష్ఫలితాలకు ముస్లిం చక్రవర్తుల పరిపాలన కారణం కాదనీ, మత గ్రంథాలలో అంతర్గతంగా, సహజ సిద్ధంగా చెప్పబడినటువంటి సామాజిక కట్టుబాట్ల చరిత్ర అప్పటికే ఆచరణలో ఉన్నదనీ ఆయనకు అర్థమవుతుంది. అంతేకాదు ఆనాడు ఏర్పరిచిన సామాజిక పొందికలు ఆ తర్వాత కాలంలో వారసత్వపు సాంప్రదాయాలుగా మారిపోయాయి. అందువలనే, సచ్ఛీలత, ఛండాలత అనేవి ముస్లిం చక్రవర్తుల పాలనకు ముందే భారతదేశంలో ఆవిర్భవించాయని మనమిక్కడ గుర్తుంచుకోవాలి.

ముస్లిం చక్రవర్తులు ఏనాడూ ఈ సామాజిక పొందికలైన కులాలు, వ్యవస్థలను మార్చటానికి ప్రయత్నం చేయలేదు. అది వారి లక్ష్యం కూడా కాదు. దానికి భిన్నంగా ముస్లిం కమ్యూనిటీ కూడా కుల వ్యవస్థను దత్తత తీసుకునే విధంగా ప్రయత్నించింది. పాకిస్థాన్‌లో మతతత్వవాదం హిందువుల మనుగడను గుర్తించటానికి ఎలా నిరాకరిస్తోందో, భారతదేశంలో హిందూ మతోన్మాదులు తమ భావజాలంలో ఈ హీనమైన, జుగుప్సాకరమైన సామాజిక సాంప్రదాయాకు కారణం విదేశీయుల ప్రభావం అని ఘోషిస్తారు. దానికి అనుగుణంగానే జాతీయ చరిత్ర పరిశోధనా కౌన్సిల్ నూతన కిరీటధారుడైన సుదర్శన రావు దేశంలో విధ్వంసకర ప్రభావం చూపుతున్న కులవ్యవస్థకు మూలకారణం బాహ్య అంశాలేననీ, ముఖ్యంగా ముస్లిం చక్రవర్తుల పాలనేననీ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రొఫెసర్ రావుగారు అభూతకల్పిత చరిత్రలో, ఇబ్బందికరంగా ఉన్నటువంటి అంశాలను కావాలనే పక్కనపెట్టి దేశంలోని అన్ని రకాల దురాగతాలకూ ముస్లిం ప్రభువులు కారణమని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ప్రాథమికంగా (కావాలనే) మర్చిపోయిన దేమిటంటే ముస్లిం ప్రభువులు ఇక్కడ ఉన్న సామాజిక వ్యవస్థను కొనసాగించటానికే ఇష్టపడ్డారు. అలాగే వారి పరిపాలనా యంత్రాంగం కూడా మిశ్రమ వ్యవస్థగా ఉండేది. ఉదాహరణకు ఔరంగజేబు కాలంలో న్యాయవ్యవస్థలోని అధికా రులలో 34 శాతం హిందువులే ఉండేవారు. కుల

వ్యవస్థ, లింగ వివక్షత మను స్మృతిలో స్పష్టంగా పేర్కొనబడిందనీ, క్రీ॥శ॥ ఒకటి, రెండు శతాబ్దాలలో ఇది సామాజిక కట్టుబాట్లు, సాంప్రదాయాలుగా సమాజంలో వేళ్ళూనుకున్నదనే సంగతి మనం మరిచి పోవాలని ఈ ప్రొఫెసర్‌గారు భావిస్తున్నారు.

నిమ్న కులాల వారు అగ్రకులాలతో సమానంగా అభివృద్ధి చెందకూడదనీ, వారు గ్రామంలో కాకుండా, గ్రామ వెలుపలనే ఉండాలనీ పేర్కొన్న ఉదంతాలు రుగ్వేదం, మను స్మృతిలో అనేకం ఉన్నాయి. అయితే ఋగ్వేద కాలంలోనే కుల వ్యవస్థ సంపూర్ణంగా రూపు దిద్దుకున్నదనికాదు. నాలుగు వర్ణాల సామాజిక సంస్కృతి అప్పటికే ప్రారంభమై, ఆ తరువాత మను స్మృతి కాలం నాటికి పూర్తి స్థాయిలో కఠినమైన సాంప్రదాయాలను అనుసరించే కుల వ్యవస్థ ఆచరణలోకి వచ్చిందనేది సారాంశం. పదవ శతాబ్దపు కాలంలోని వజసానియి సంహిత గ్రంథంలో ఛండాలుడు, పాల్కణుడు (ఉత్తముడు) అనే పదాలు వాడబడ్డాయి. 8వ శతాబ్దంలో రచింపబడిన ఛందోగ్యోపనిషద్‌లో ఏ వ్యక్తులైతే హీనమైన, జుగుప్సాకరమైన పనులు చేస్తారో వారు అతి త్వరిత కాలంలోనే కుక్కగానో, పందిగానో, ఛండాలుడిగానో పుడతారని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటి ముస్లిం ఆక్రమణదారుల చొరబాట్లు పదకొండవ శతాబ్ద కాలంలో జరిగాయి. అలాగే యూరప్ దేశాల ఆక్రమణలు 17, 18వ శాతాబ్ధపు మధ్య కాలంలో జరిగాయి. శూద్రులు కుల వ్యవస్థ నుండి బయటికి గెంటివేయబడ్డారు. అగ్రకులాల వారు శూద్రులతో సహపంక్తి భోజనాలు చేయటం కానీ, వివాహాలు జరపటం కానీ నిషేదించబడింది. సచ్ఛీలత, ఛండాలత అనేటు వంటి అంశాలు చాలా కఠినంగా అమలు చేసి, కుల వ్యవస్థ చట్రం కొనసాగేలా చూశాయి. అది కూడా శూద్రులను అంటరాని వారిగా చూడటం ప్రారంభించకముందే జరిగింది. మను ధర్మశాస్త్రం సూత్రీకరించినట్లుగా ఈ దుర్మార్గమైన సామాజిక విభజన అమలు చేయబడింది.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అగ్రనేత సర్ సంగ్ చాలక్ ఎం.ఎస్.గోవల్కర్ ఈ వర్ణాల సంస్కృతిని ఉన్నత స్థాయిలో నిలబెట్టే ప్రయత్నం చేశారు. “హిందూ సామాజిక సాంప్రదాయాలలో ఉన్న కొద్దిపాటి అవాంఛిత అంశాలు అని చెప్పబడుతున్నవేవీ మనకు పూర్వ కాలపు వైభవాన్ని తెచ్చి పెట్టడానికి ఎటువంటి అడ్డుగోడలు కావు” అని ఆయన రాసిన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో దానిని మళ్లీ వేరే విధంగా చెప్పే యత్నం చేశారు. “ఒక

**“ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కూ, తనకూ ఎటువంటి సంబంధం లేదని ఆయన బయట ఎంత వాదించినా, ఆయన ప్రచారం చేస్తున్న అంశాలను పరిశీలిస్తే హిందూత్వ ప్రచారం మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అంతేకాదు ఆయన ప్రసంగాలలో గత చరిత్రలో ఉన్న హిందూ సమాజాన్ని ఘనంగా పొగడటం, విదేశీ ముస్లింల వలన అది నాశనమయ్యిందని చెప్పటం, కుల వ్యవస్థను ఘనంగా కీర్తించటం ఆయన భావజాలం ఎక్కడ ఉందో స్పష్టంగా తెలియచేస్తోంది. ”**



యల్లాప్రగడ సుదర్శనరావు

అభివృద్ధి చెందిన సమాజం, తనలో ఉన్నటువంటి భిన్నత్వానికి కారణం శాస్త్రీయ సామాజిక పొందికగా గుర్తిస్తే, అవి శరీరంలో అనేక అవయవాలవంటివని గ్రహిస్తే, ఈ భిన్నత్వం అనేది సమాజంలో ఉన్న అతి పెద్ద దోషంగా పరిగణించరాదు” అని ఆర్ఎస్ఎస్ పత్రిక అయిన ఆర్గనైజర్‌లో వ్యాఖ్యానించారు. సంఘ్ పరివార్ సిద్ధాంతకర్తలలో ఒకరైన దీనదయాల్ ఉపాధ్యాయ, ఈ నాలుగు వర్ణాల సంస్కృతి అనే మా విధానం, విరాట్ పురుషుని (ఆది మానవుడు) నాలుగు శరీర భాగాలుగా భావించాలని పేర్కొన్నారు. ఈ నాలుగు భాగాలు ఒక దానికొకటి పరస్పర సహకారులుగా ఉండమేకాక, వ్యక్తిగతంగానూ, ఐక్యతతోనూ ఉంటా యి అని తెలిపాడు. వీటి మధ్య పరిపూర్ణమైన ఉమ్మడి లాభాలు, గుర్తింపు, సౌభ్రాతృత్వం ఉంటాయని, అటువంటి భావనే లేకపోతే కులం అనేది పరస్పర ఉపయోగకారిగా కాక, వినాశన కారిగా మారుతుందని సెలవిచ్చారు. కాని ఇదంతా కొంత మంది చేసే వక్రీకరణే అని పేర్కొన్నారు.

కుల వ్యవస్థను నిర్మూలించాలనీ, అంటరానితనాన్ని వ్యతిరేకించాలనీ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ తీసుకున్న మార్గానికీ, గోల్వాల్కర్ తీసుకున్న మార్గానికీ చాలా వ్యత్యాసం ఉంది. కుల వ్యవస్థకు మనుస్మృతే మూలకారణమని, చెబుతూ ఒక సామాజిక ఉద్యమాన్ని నడిపించి, మత గ్రంథాలను దహనం చేసే వరకు పోరాడింది అంబేద్కర్ అయితే, మనువు రచించిన మను స్మృతి, అందులో సూత్రీకరించిన కుల వ్యవస్థ న్యాయ సూత్రాలను పొగడ్తలతో ముంచెత్తింది గోల్వాల్కర్.

“ఈ కులాల విధానం వలన అందరికీ మంచే జరిగింది. ఎవరూ దీనిని వ్యతిరేకించ లేదు. అభ్యంతరాలు లేవనెత్తలేదు” అనే వ్యాఖ్యానం సగం నిజం, సగం అసత్యం. నిజం, అది అగ్రకులాల వారికి ఇబ్బందిలేకుండా ఉపయోగపడింది. నిజం, అది నిమ్న కులాల వారిని అణగత్రొక్కటానికీ, అమానవీయంగా చూడటానికీ ఉపయోగపడింది. నిజం, కుల వ్యవస్థకి వ్యతిరేకంగా ఎటువంటి అభ్యంతరాలు రాలేదు. ఎందుకంటే విద్యావకాశాలు అనేవి నిమ్న కులాల దరి చేరకుండా చేయబట్టి వారి అసంతృప్తి ఏనాడు రికార్డు చేయబడలేదు. కేవలం బుద్ధుడి కాలం నుండి మాత్రమే కుల వ్యవస్థకు వ్యతిరేకంగా నిరసనలు మొదలైనాయి. అసలు బౌద్ధ ఉద్యమమే తరతరాల నుండి అమలు చేయబడుతున్న కుల వ్యవస్థకు వ్యతిరే కంగా మొదలైంది. మధ్య యుగాల నాటి గురువులు, సాధువులైన కబీర్, అతని అను చరులు నిమ్మ కులాలపై జరుగుతున్న అణచితేకు వ్యతిరే కంగా తమ గళాన్ని విప్పారు. అటువంటి కుల వ్యవస్థ నమూనాను మన ప్రొఫెసర్ సుదర్శన రావు అమితంగా అభిమానించి, ప్రచారం చేస్తూ దానిని మరింత ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. గత చరిత్రలో మన మతతత్వ మేధావులు చూపించిన దారిలో, కుల, లింగ భేద వారసత్వాన్ని కొనసాగించే విధంగా చరిత్ర సాగాలని మన జాతీయ చరిత్ర పరిశోధనా కౌన్సిల్‌లో మార్పులు చేస్తున్నారు. రాబోయే కాలం ఎలా ఉండబోతోందో చెప్ప టానికి ఇదొక సంకేతం. తస్మాత్ జాగ్రత్త.

(అనువాదం : ఎల్.ఎస్.భారవి)

**నేటి భారతం**

# స్మార్ట్ సిటీల్లో పేదలకు చోటేది?

**స్మార్ట్ సిటీలు నయా–మధ్యతరగతి ప్రజలకోసమని అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. "అభివృద్ధి ఫలాలు రానురాను మరింత మంది ప్రజలకు చేరుతున్నందున గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. ఒక నయా–మధ్యతరగతి అభివృద్ధి చెందుతోంది. అది మరింత మెరుగైన జీవన ప్రమాణాలను కోరుకుంటోంది" అని ఆయన చెప్పారు.**

**దివ్య త్రివేది**

ఎన్డీయే ప్రభుత్వం దేశంలో 100 స్మార్ట్ సిటీలను నిర్మించటానికి రూపొందించిన ప్రణాళిక పూర్తిగా ఊహాజనితమైనది. అది పట్టణ పేదలను పరిగణలోకి తీసుకుని తయారు చేసిన ప్రణాళిక కాదు. ప్రాథమిక సదుపాయాలు కల్పించడం ద్వారా పట్టణ ప్రజల జీవితాలను అదుపులో ఉంచడానికి ఉద్దేశింపబడిన ఈ ఆలోచన... ప్రజలందరి జీవితాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలనే భావనపై కాకుండా కలిగిన వారికే అన్నీ కల్పించాలనే పెట్టుబడిదారీ ఆలోచనలపై ఆధారపడింది.

స్మార్ట్ సిటీలను నిర్మించాలని గత దశాబ్ద కాలంగా ప్రపంచాన్ని పట్టి కుదుపుతున్న భావాలు నరేంద్ర మోడీని కూడా ప్రభావితం చేసి చివరకు భారతదేశంలో కూడా స్థానం సంపాదించగలిగాయి. దేశంలో 100 కొత్త స్మార్ట్ సిటీలను నిర్మించటానికి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ కేంద్ర బడ్జెట్‌లో రూ. 7,060 కోట్లు కేటాయించారు. జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ (జెఎన్ఎన్‌యుఆర్ఎం) కార్యక్రమాలకు కాలం చెల్లిపోతున్న తరుణంలో, దాని స్థానంలో ఒక కొత్త సంస్థను ఏర్పాటు చేయాల్సి ఉందనీ, దానిని కీర్తిశేషులైన ఒక జాతీయ నాయకుని పేరుతో ప్రారంభిస్తామనీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖమంత్రి వెంకయ్య నాయుడు ప్రకటించాడు. హరిత నగరాలలో ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించాలనే భావం ప్రధానం కాగా, మధ్యస్థాయి నగరాలనూ ఆధునీకరించాలనీ, పెద్ద నగరాల చుట్టూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలనీ ప్రయత్నిస్తున్నారు.

భారతదేశ పట్టణ జనాభా 2001లో 27.8% వున్నదనీ, 2026 నాటికి 38.2% చేరుతుందనీ వెంకయ్యానాయుడు చెబుతున్నారు. 2011 జనాభా లెక్కల్లో పట్టణ ప్రజలు 31.6% వున్నారు. పెరుగుతున్న పట్టణ జనాభా నివసించటానికి అనువుగా కొత్త నగరాలను నిర్మించకపోతే ఉన్న నగరాలు కొద్దికాలంలోనే నివాసానికి పనికిరాకుండా పోతాయని అరుణ్ జైట్లీ చెప్పారు.

స్పెయిన్‌కు బార్సిలోనా నగరం, దక్షిణ కొరియాకు సోంగ్‌డో నగరం, పోర్చుగల్‌కు ప్లాన్ ఐ.టి. వాలీ నగరం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు మస్‌దర్ నగరం... ఉన్నట్లే చివరికి భారతదేశం కూడా తన సొంత అత్యాధునిక నగరాన్ని నిర్మించుకుంటుందని దేశంలోని ప్రణాళికావేత్తలూ, ఉన్నతాధికారులూ ఇంజనీర్లు, భవన నిర్మాణ నిపుణులూ అత్యుత్సాహంతో చెబుతున్నారు.

భారతదేశంలోని లావాసా, అంబివ్యాలి, భోలెరా నగరాల మాదిరిగా రూపొందించడానికి తయారు చేసిన ఈ స్మార్ట్ సిటీల బ్లూప్రింట్ అంతా మనకు భ్రమలు గొల్పే ఒక అద్భుత విన్యాసం మినహా మరేమీ కాదు. స్వచ్ఛమైన ఆకాశం, పెద్ద భవనాలు, శుభ్రమైన రోడ్లు, స్వచ్ఛమైన పర్యావరణం, డ్రైవర్లు లేని కార్లు, కొత్త తరం లైటింగ్, స్మార్ట్ పరికరాలతో సకల సదుపాయాలు గల గృహాల్ని నిర్మిస్తారట. అన్నీ సూపర్ కంప్యూటర్‌లకూ, సెన్సార్‌లకూ అనుసంధానం చేయబడి వుంటాయట. అవి ఆటోమాటిక్‌గా ట్రాఫిక్ రద్దీని నివారిస్తాయట. స్మార్ట్ పార్కింగ్ విధానాన్ని అమలు చేస్తాయట. విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయగల శక్తివంతమైన పవర్ గ్రిడ్లను నిర్వహిస్తాయట. ఉన్నత పౌర సదుపాయాలు కల్పిస్తాయట. చెత్త కుప్పలు నిండగానే అలారం మోగే ఏర్పాటు చేస్తాయట. మొత్తంగా చూస్తే పట్టణ ప్రజల జీవితాలను మెరుగుపరిచే, అదుపు చేసే మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఊరిస్తున్నారు.

నగర పరిస్థితులను మార్చే ప్రయత్నంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కానీ జీవించటానికి తగిన పరిస్థితులను సృష్టించటానికి అది సరిపోతుందా? ఏదైనా నగరంలో ప్రధానంగా ప్రజలు కేంద్రంగా ఉంటారు. వారు శక్తియుక్తుల్నీ, మేధస్సునూ ఉపయోగించుకుని తమ అవసరాలను తీర్చుకొనేందుకు కిందినుండి నగరాన్ని అభివృద్ధి చేసుకుంటారు. కాని స్మార్ట్ సిటీల అభివృద్ధి ప్రణాళికలో ఈ భావం తలక్రిందులవుతున్నది. స్మార్ట్ సిటీలలో మొదట మౌలిక సదుపాయాలు కల్పించి, తద్వారా ప్రజలను అక్కడ నివాసం ఉండమనీ, ఆ సదుపాయాలను వినియోగించుకోమనీ ఆహ్వానిస్తున్నారు. ఈ విధంగా తలక్రిందులుగా, అత్యధిక పెట్టుబడులతో నిర్మిస్తున్న ఈ నిర్దిష్ట తరహా నిర్మాణాలు రెండు ముఖ్యమైన ప్రశ్నలను మన ముందుకు తెస్తున్నాయి. ఈ నగరాలను ఎవరు నిర్మించబోతున్నారు? ఈ నగరాలలో ఎవరు నివసించబోతున్నారు?

ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేయటంలో అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, నిపుణులతో కలిసి డిజైన్ చేసి, ప్రజలకు అందిస్తున్నారు. నాస్‌డాక్‌లో లిస్టయి ఉన్న ప్రముఖ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థ సిస్కో సిస్టమ్స్ ఈ రంగంలో ప్రధానపాత్ర వహిస్తుండగా, అమెరికా సంస్థ జనరల్ ఎలక్ట్రిక్, జర్మన్ సంస్థ సీమెన్స్, బహుళజాతి సంస్థ హులెట్ ప్యాకార్డ్, టెక్నాలజీ రంగంలో ముఖ్య సంస్థ

అయిన డచ్ కంపెనీ ఫిలిప్స్, కొరియా ఉక్కు దిగ్గజం పోస్కో, రియల్ ఎస్టేట్ అభివృద్ధి సంస్థ గాలె ఇంటర్నేషనల్ సంస్థలు కూడా ఈ పట్టణీ కరణ విప్లవంలో ప్రధాన వాటాదారులుగా వున్నారు. న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ రియల్ టైమ్ కంప్యూటర్ కాంప్లెక్స్‌ను ఐ.బి.ఎం. రూపొందించింది. 2014 ఫిఫా ప్రపంచ ఫుట్‌బాల్ వరల్డ్ కప్ పోటీలకు, 2016 వేసవి ఒలింపిక్స్‌కు రియో డిజనీరోలో అర్బన్ కమాండ్ సెంటర్‌ను ఐ.బి.ఎం. ఏర్పాటు చేసింది. మన దేశానికి వస్తే ముంబాయి సోదరినగరం పాలవాను, అన్ని అవకాశాలున్న నగరంగా నిర్మించటానికి లోథా గ్రూపు, ఐ.బి.ఎం.తో పొత్తు పెట్టుకున్నది.

అరుణ్ జైట్లీ తన బడ్జెట్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించిన భూమి, పెట్టుబడి నిబంధనలను సడలించారు. గతంలో 50,000 చదరపు మీటర్ల ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లో మాత్రమే విదేశీ పెట్టుబడులు పెట్టాలని ఉన్న నిబంధనను 20,000 చదరపు మీటర్లకు తగ్గించారు. విదేశీ ప్రత్యక్షపెట్టుబడి పరిమితిని గతంలో 1 కోటి డాలర్ల నుండి ఇప్పుడు 50 లక్షల డాలర్లకు తగ్గించారు. నిర్మాణం పూర్తి చేయటానికి 3 సంవత్సరాల అదనపు కాలం కేటాయించాడు. ఈ ప్రపంచస్థాయి కంపెనీలు మౌలిక సౌకర్యాలు కల్పించటం కోసం పెట్టుబడులు పెట్టటానికి, సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందచేయటానికి క్యూ కడతాయి.

బెంగళూరులో సిస్కో ఎలక్ట్రానిక్స్ సిటీ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌తో కలిసి 320 హెక్టారలలో ఉన్న బెంగళూరు ఎలక్ట్రానిక్స్ సిటీని స్మార్ట్ సిటీగా మారుస్తామని ప్రకటించింది. ఇక్కడ విప్రో, ఇన్ఫోసిస్ కంపెనీలతో కలిపి 186 కంపెనీలు ఉన్నాయి. వాటి టర్నోవర్ 40,000 కోట్ల రూపాయలున్నది. ఇది బెంగుళూరు నగరం, భారతదేశంలోని ఇతర నగరాలూ, ఈ ప్రాంతంలోని ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లూ అనుసరించదగిన నమూనాగా వుంటుందని సిస్కో చెబుతున్నది.

సూరత్‌లో మైక్రోసాఫ్ట్ కంపెనీ ఒక స్మార్ట్ సిటీ ప్రాజెక్టును నిర్మించింది. ది గుజరాత్ ఇంటర్నే షనల్ ఫైనాన్స్ టెక్ సిటీ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కలిసి కన్సార్టియంను ఏర్పాటు చేసి సిస్కో, కొరియన్ టెలికాం సంస్థ కెటి కార్పొరేషన్‌తోపాటు న్యూజెన్ ఐ.టి.ఇ.ఎస్. ప్రైవేట్ లిమిటెడ్, న్యూజెన్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో పాటు కలిసి కన్సార్టియంను ఏర్పాటు చేసింది. మాల్టా స్మార్ట్ సిటీ నమూనాలో నిర్మాణమౌతున్న కోచిలోని ఐటి ప్రత్యేక ఆర్థిక మండలిలోని స్మార్ట్ సిటీలో దుబాయ్ హోల్డింగ్ అనుబంధ సంస్థ అయిన టెకామ్ ఇన్వెస్ట్‌మెంట్ 84 శాతం వాటా కలిగి వున్నది.

**“అరుణ్ జైట్లీ తన బడ్జెట్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించిన భూమి, పెట్టుబడి నిబంధనలను సడలించారు. గతంలో 50,000 చదరపు మీటర్ల ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లో మాత్రమే విదేశీ పెట్టుబడులు పెట్టాలని ఉన్న నిబంధనను 20,000 చదరపు మీటర్లకు తగ్గించారు. విదేశీ ప్రత్యక్షపెట్టుబడి పరిమితిని గతంలో 1 కోటి డాలర్ల నుండి ఇప్పుడు 50 లక్షల డాలర్లకు తగ్గించారు.”**



**ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 100 స్మార్ట్ సిటీల నిర్మాణంలో భాగంగా కేంద్ర బడ్జెట్‌లో రూ. 7.060 కోట్లు కేటాయించారు**

స్మార్ట్ సిటీలకు సంబంధించి బడా వ్యాపార సంస్థలకు ఎక్కువ ప్రయోజనాలున్నాయి. భారతదేశంలోని అత్యధిక స్మార్ట్ సిటీలు, వ్యాపార, ఐ.టి.లకు కేంద్రాలుగా వుండి... తమ షాపులను ప్రారంభించవలసినదిగా ఫార్చ్యూన్ 500 జాబితాలోని ప్రపంచ కంపెనీలను ఆహ్వానిస్తున్నాయి. అంతర్జాతీయ బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ కంపెనీల రాకతో ఆర్థికాభివృద్ధికి ఊపు వస్తుందనీ, సరుకులు, సేవల రంగాల వేగం పెరగటంతో వినియోగదారీతత్వం పెరిగి, చిల్లర వాణిజ్యం విస్తరిస్తుందనీ ఆ సంస్థలు భావిస్తున్నారు. భారీస్థాయిలో వస్తున్న విదేశీ పెట్టుబడుల వలన దీర్ఘకాలంలో భారతదేశ ఆర్థికవ్యవస్థ తీవ్ర ఒడిదుడకులనెదుర్కొంటుంది. ఈ ప్రాజెక్టులు లాభసాటిగా మారటానికి పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ మంత్రాన్ని జపిస్తున్నాయి. ఒక నగరంలోని ప్రజలలో పట్టణ పేదలు గణనీయమైన భాగంగా వుంటారు. స్మార్ట్ సిటీల కోసం రూపొందిస్తున్న ప్రణాళికలను బట్టి చూస్తే అందులో వీరికెలాంటి స్థానమూ లేదు. స్మార్ట్ సిటీలు నయా-మధ్యతరగతి ప్రజలకోసమని అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. “అభివృద్ధి ఫలాలు రానురాను మరింత మంది ప్రజలకు చేరుతున్నందున గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. ఒక నయా-మధ్య తరగతి అభివృద్ధి చెందుతోంది. అది మరింత మెరుగైన జీవన ప్రమాణాలను కోరుకుంటోంది” అని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రజలు మూడు కారణాల చేత - విద్య, ఉద్యోగం. వినోదాల కోసం నగరాలకు వలసలు వస్తున్నారని వెంకయ్యనాయుడు చెప్పారు. ఇది అభివృద్ధి చెందిన నగరాలపై పెద్దభారం మోపుతున్నదని అన్నారు. ఉన్న నగరాలపై భారం తగ్గించాలంటే కొత్తనగరాల నిర్మాణం గురించి ఆలోచించాల్సి వస్తున్నదంటున్నారు.

**పేదల్ని నగరాలకు దూరంగా ఉంచటం**

పుణెకు దగ్గరలో నిర్మాణమౌతున్న ఐదు నగరాల సముదాయం ‘లావాసా’ను మనం పరిశీలిద్దాం. 10,000 హెక్టార్ల స్థలాన్ని కొనుగోలు చేసి నిర్మిస్తున్న ఈ కళాత్మక నగరాన్ని హిందూస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్మిస్తున్నది. ఆ సంస్థ నిర్మించిన టౌన్‌షిప్‌లలో ఒకటైన దాస్వే ను ఇటాలియన్ నగరం ‘పోర్టోఫినో’ నమూనాలో నిర్మించామని, ప్రపంచస్థాయి సౌకర్యాలన్నీ ఇక్కడ ఉన్నాయని గొప్పలు చెప్పుకుంటున్నది. రెండుపూటలా తిండి సంపాదించుకోవటం కోసం ప్రజలు తీవ్రంగా శ్రమిస్తున్న భారతదేశంలో లావాసా లాంటి సకల సదుపాయాలున్నవి దీవుల్లాగా గోచరిస్తున్నాయి. లావాసా సదుపాయాల్ని ఎప్పటికీ పొందలేని భారత ప్రజలలోని మెజారిటీకి అదొక ఊహాలోకంగా మిగిలిపోతుంది.

పర్యావరణ నిబంధనలను అతిక్రమించి చేస్తున్న నిర్మాణాలపై 2010లో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ స్టే ఆర్డర్ జారీచేసింది. 2011 నవంబర్‌లో ఆ ఆర్డర్‌ను రద్దు చేశారు.

లావాసాలో ఇప్పటికీ 18 గ్రామాల ప్రజలు తమ భూముల్ని అమ్మలేదు. లావాసా

> **❝ లావాసాలో అనేకమంది ఆస్థిని కొనుగోలు చేసినప్పటికీ సదుపాయాల కల్పన పూర్తికాపోవడంతో కొద్దిమంది మాత్రమే అక్కడికి చేరారు. వాళ్లలో దేశంలో ఉన్నతస్థాయిలో ఉన్న సినిమానటులు, క్రికెటర్లు, బ్యాంకుల చైర్‌పర్సన్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నారని అక్కడి మాజీ ఉద్యోగి ఒకరు చెప్పారు. ❞**

యాజమాన్యం వారిని తొలగించే ఉద్దేశ్యం తమకు లేదనీ, వారితో కలిసిమెలసి వుంటామనీ చెబుతున్నది. ఈ ప్రాజెక్టు ప్రారంభమైనప్పుడు కొందరు రైతులు తమ భూములు ఎకరం 5 వేల రూపాయలకు అమ్ముకున్నారు. ఇప్పుడు మంచి ధర పొందుతున్నారు. ఈ 18 గ్రామాల ప్రజలు తమ భూముల్ని అమ్మకుండా ఎంత కాలం నిలబెట్టుకోగలరనేది కోటి రూపాయల ప్రశ్నగా మారింది. భూములపై సొంతంగా వ్యవసాయం చెయ్యకుండా బొంబాయి, పుణె లాంటి నగరాలకు జీవనాధారం వెతుక్కుంటూ వెళ్ళిన భూయజమానులు ఇప్పుడు తిరిగి వచ్చి అభివృద్ధి చెందుతున్నారని లావాసా చెబుతున్నది. ఒక మందుల షాపు, ఒక పాఠశాల, వెదురు ఉత్పత్తులను తయారుచేసే ఒక ఫ్యాక్టరీ, పోలీస్ స్టేషన్, పోస్టాఫీస్ ఏర్పాటయ్యాయి. గ్రామస్తులందరికీ ఉచితంగా నీరందిస్తున్నారు. ఇది వారి హక్కుగా కాకుండా, దయతో ఇస్తున్నారు.

ప్రజల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, ప్రజలు తమ హక్కులకోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తారు, సమస్యలు పరిష్కరించుకుంటారు, కానీ ఒక పెట్టుబడిదారీ సంస్థ ప్రజల్ని ఉద్ధరించటానికి పూనుకోదు అనితన పేరు బయటకు వెల్లడించవద్దని కోరుతూ ఒక మాజీ ఉద్యోగి చెప్పాడు. ఇక్కడ ప్రజల బాగోగులు చూసే సంస్థగా పెట్టుబడిదారులు ముందుకొచ్చి ప్రభుత్వాన్ని పక్కన పెట్టారు.

లావాసాలో అనేకమంది ఆస్థిని కొనుగోలు చేసినప్పటికీ సదుపాయాల కల్పన పూర్తికాకపోవడంతో కొద్దిమంది మాత్రమే అక్కడికి చేరారు. వాళ్లలో దేశంలో ఉన్నతస్థాయిలో ఉన్న సినిమానటులు, క్రికెటర్లు, బ్యాంకుల చైర్‌పర్సన్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నారని అక్కడి మాజీ ఉద్యోగి ఒకరు చెప్పారు.


స్థానిక ప్రజలు కొద్దిమందికి అక్కడ ఉద్యోగాలు దొరకడంతో వారు దరిద్రం నుండి బయటపడ్డారు. అక్కడ నివసిస్తున్న ధనికులకు వివిధరకాల సేవలందించటమే ప్రధానమైన పరిమిత అవకాశాలే వున్నాయి. వారిలో కొందరు భవన నిర్మాణ కార్మికులుగా ఉంటూ, ధనికులకు దూరంగా లేబర్ కాలనీల్లో నివసిస్తున్నారు. చిన్న దుకాణాలు నడుపుకోడానికీ కాంట్రాక్టు వర్కర్లుగా పనిచేయటానికి అవకాశాలున్నాయి. ఈ విధంగా ప్రజల్ని సామాజికంగా, నివాసాల వారీగా వేరుచేయటం పెట్టుబడిదారీ సమాజంలో తీవ్ర వివక్ష అవుతుంది. ఇది లావాసా నిర్మాణంలోని ప్రాథమిక సూత్రాలకే భిన్నమైనది. ఈ నూతన పట్టణాలలో చేరిన వారందరికీ సమాన హక్కులుంటాయనీ, సమానంగా జీవిస్తారనీ చెప్పారు. కానీ ఆచరణలో సంచారజాతి అయిన కోలీ తెగ, ధంగర్ తెగవారి పశువులను లోలప తిరగటానికి అనుమతించరని మాజీ ఉద్యోగి ఒకరు చెప్పారు.

దీనితో ఈ నగరాలు ఎవరికోసం నిర్మించారన్న ప్రశ్న మనకు ఎదురవుతుంది. స్మార్ట్ సిటీలలో సంపన్నులు మాత్రమే బాగా బటకటానికి, పౌరసత్వం పొందే వైపుకు మనం క్రమంగా వెళుతున్నామా. కార్పొరేట్ల చేతిలో క్రమబద్ధీకరించబడుతున్న నగరాలలో భిన్న ప్రమాణాలుండే వైపుకు వెళతున్నామా? లావాసాలో ప్రధాన భారతీయ పండుగలను అట్టహాసంగా చేస్తుండగా, స్థానిక ప్రజల పండుగలు, సంస్కృతి క్రమంగా మసకబారి పోతున్నాయి. ఏ విధమైన రాజకీయ కలయికను, సాంస్కృతిక చట్టాల్ని సృష్టిస్తున్నారు? ప్రస్తుతమున్న నగరాలకు చరిత్ర వుంది. తాము ఆ నగరాలకు చెందిన వారిగా ప్రజలు భావించు కుంటారు. కలిసి చెప్పుకునే కథలుం టాయి. దీనికి భిన్నంగా స్మార్ట్ నగరాలకు ఏమాత్రం జీవం లేని కృత్రిమ సంస్కృతి వుం టుంది. లావాసా ప్రాథమిక అమ్మ కాలు అభివృద్ధి గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పటానికి హెచ్.సి. సి. సిద్ధం కాలేదు.

**ప్రపంచంలోని కొన్ని స్మార్ట్ సిటీలు**



పోర్చుగల్‌లోని ప్లాన్ ఐటి వాలీ



దక్షిణ కొరియాలోని సోంగ్డో నగరం



స్పెయిన్‌లోని బార్సిలోనా నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపుదిద్దుతున్నారు

### ‘స్మార్ట్‌నెస్’ కోసం పరుగు

స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాల్ని ఇంకా రూపొందించాల్సి వుండగానే పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఒక స్వతంత్ర సంస్థగా వ్యవహరిస్తున్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ సంస్థకు ఈ పథకం అమలుచేసే బాధ్యతను అప్పగించవచ్చుని పుకార్లు వ్యాపిం చాయి. కాని ఆ సంస్థ డైరెక్టర్ ప్రొ॥ జగన్‌షా ఇంకా ఏ విషయమూ నిర్దిష్టంగా నిర్ణయించలేదని చెప్పారు. స్మార్ట్ సిటీలకు తనకు తాను స్వయంగా నియమించుకున్న దేవదూతగా ప్రకటించుకున్న షా ఇవి ఆటలో గెలుపును మార్చటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించగల సత్తా కలిగి వున్నాయనీ, టెక్నాలజీ మాత్రమే స్మార్ట్‌నెస్‌ను తెస్తుందనేది ఒట్టి చెత్త అనీ కొట్టిపారవేశాడు.

డిజిటల్ టెక్నాలజీ లేకుండా బొంబాయి

> ❝ ప్రస్తుతానికి బడా కంపెనీలు, ప్రభుత్వాలకు చెందిన మార్కెటింగ్ బృందాల కాగితాల్లోనే ఈ స్మార్ట్ సిటీ కలలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం భారత దేశంలోని నగరాలలో ఉన్న సమస్యలను పరిష్కరించటానికి స్మార్ట్ సిటీల ఆలోచన పరిష్కారం కాదని స్పష్టమౌతున్నది. ❞

లోకల్ ఇన్ని సంవత్సరాలు ఎలా పనిచేసినట్లు? నగరం కోరుకోవటం వల్ల ఒక తరగతి ప్రజలు అందుకోసం కృషి చేశారని అతను చెప్పాడు. చెత్తను శుద్ధి చేయటానికి సూరత్‌లో స్మార్ట్ టెక్నాలజీని వినియోగిస్తుండగా జబల్‌పూర్, విశాఖపట్నంలలో ఈ-గవర్నెన్స్ ద్వారా చేస్తున్నారు. ఇవి స్మార్ట్‌నెస్‌కు సంబంధించిన వివిధ అంశాలు కాగా, అవి సమగ్రతను కోరుతున్నాయా లేక వివిధ విభాగాలు వేర్వేరుగా పనిచేస్తున్నాయా అనేది ముఖ్యాంశమని చెప్పాడు. మున్సిపాలిటీలు స్మార్ట్‌గా ఉండి సిబ్బంది తక్కువగావుంటే పన్ను వసూళ్ళను కూడా పరిమితం చేయవచ్చని, విషయాలు పారదర్శకంగా వుంటాయని చెప్పాడు.

మన వద్ద సమగ్ర పరిశీలన చేయని సమాచారం కుప్పలుగా వుంది. అది మన జీవితాలను మెరుగుచేయటానికి ఉపయోగించ వచ్చు. కానీ ఈ 'గ్రీన్ ఫీల్డ్' (స్మార్ట్) నగరాలకు చైనాలో ప్రజలు లేక కునారిల్లుతున్న (ఘోస్ట్ సిటీస్) చాలా నగరాలకు పట్టిన గతే పట్టవచ్చునని అతను హెచ్చరించాడు. అందరికీ కనిపిస్తున్నదానికి ఊహాగానాలెందుకు అన్నట్లు స్మార్ట్ సిటీల నిర్మాణం జరిగిపోతున్నది కనుక దానికి సంబంధించి ఊహాగానాలు చేయాల్సిన అవసరం లేదు. స్మార్ట్ సిటీల ఆలోచన ఇక ముందు కూడా కొనసాగుతుందని చెబుతూ దీంట్లో అంతా అద్భుతంగా, మంచిగా మాత్రమే ఉంటుందనుకుంటే పొరపాటు, తెలియని చాలా అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయి అని ఆయన అన్నారు.

స్మార్ట్ సిటీల ఆలోచన మంచిదే అని నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో స్మార్ట్ సిటీలపై పరిశోధన చేస్తున్న మడకం సోమయ్య అంటారు. అవి పట్టణాలలోని ప్రజలకు, ముఖ్యంగా ధనికులకు నాణ్యమైన జీవితాన్ని గడిపే అవకాశం కల్పిస్తాయనీ, పేదలకు కూడా అనేక విధాలుగా ప్రయోజనం కల్పిస్తాయని చెప్పారు. ఉదాహరణకు డాక్టర్లు లేని అనేక గ్రామీణ ప్రాంతాలలో టెక్నాలజీని వినియోగించి వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా వైద్యం అందజేయటంలో జోక్యం చేసుకోవచ్చంటారు. "పిల్లలు స్కూలుకు వెళ్ళటానికి రోజుకు 10 కిలోమీటర్లు ఎందుకు ప్రయాణించాలి? ప్రజలు ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్ళాల్సిన అవసరం ఏముంది?" అని ఆయన అంటారు.

పుణె కేంద్రంగా గల నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ అథారిటీ పారిశ్రామిక కారిడార్ల



మన దేశంలో పుణె దగ్గరలో నిర్మితమవుతున్న స్మార్ట్ సిటీ 'లావాసా'

అభివృద్ధిని సమన్వయం చేయటానికీ, స్మార్ట్ సిటీలను పారిశ్రామిక కారిడార్‌లతో అనుసంధానం చేయటానికీ బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయలు కేటాయించారు. స్మార్ట్ సిటీలు అమృత్‌సర్, కోల్‌కతా కారిడార్‌ల (ఏడు రాష్ట్రాల్లో ఏడు స్మార్ట్ సిటీలు) చెన్నై-బెంగళూరు (తమిళనాడుల పొన్నేరి, ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణపట్నం, కర్ణాటకలో తుంకూరు)లు వరుసలో వున్నాయి.


ప్రజలు స్మార్ట్ సిటీల గురించి కాగితాలపై కలలు కంటూ ఉంటే వాటిని అమలు చేయడం మాత్రం అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వానికైనా అంత సులభం కాదు. జె.ఎన్.ఎన్.యు. ఆర్.ఎం.కార్యక్రమం ద్వారా పట్టణాల్లో మౌలిక సదుపాయాలు కల్పించటానికి 65 పెద్ద నగరాల్ని ఎంపిక చేశామని వెంకయ్యనాయుడు చెప్పాడు. అయితే ఈ పథకం కింద నిధుల పొందే రాష్ట్రాలు, కేంద్రపాలిక ప్రాంతాల 73.50 శాతం కేంద్ర సాయాన్ని మాత్రమే ఇస్తారు. అంటే కేంద్రం నుండి రావాల్సిన 12,397 కోట్ల రూపాయలను ఈ రాష్ట్రాలు నష్టపోతాయి. అంటే కేంద్రం ఇస్తానన్న మొత్తంలో 49 శాతం అవి నష్టపోతాయన్నమాట. మొత్తం 668 చిన్న, మధ్యస్థాయి పట్టణాలు జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. నిధుల్ని బాగా వినియోగించుకుంటున్నాయనీ, మొత్తంగా 76 శాతం కేంద్ర సాయాన్ని వినియోగించుకున్నాయనీ వెంకయ్యనాయుడు చెప్పాడు.

ప్రస్తుతానికి బడా కంపెనీలు, ప్రభుత్వాలకు చెందిన మార్కెటింగ్ బృందాల కాగితాల్లోనే ఈ స్మార్ట్ సిటీ కలలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం భారతదేశంలోని నగరాలలో ఉన్న సమస్యలను పరిష్కరించటానికి స్మార్ట్ సిటీల ఆలోచన పరిష్కారం కాదని స్పష్టమౌతున్నది. దక్షిణ భారత దేశంలోని ఒక చిన్న పట్టణంలో నివసిస్తూ విస్తారంగా పర్యటించిన సిద్ధార్థ మూర్తి ఈ విధంగా చెప్పారు: "బుల్లెట్ ట్రైన్‌లు, స్మార్ట్ సిటీలు నిర్మిస్తామని వాగ్దానం చేయటం కన్నా ఉన్న వనరుల్ని ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు కల్పించటానికి వినియోగిస్తే, ఉదాహరణకు, మౌలికావసరమైన రైళ్ళలోమరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచితే ఎక్కువ ప్రయోజనకరంగా వుంటుంది." ⦿

ఈ మాసం ప్రత్యేకం

# సోషలిజం కోసం ఉద్యమాలు: ముందున్న సవాళ్లు

సమీర్ అమీన్



ప్రపంచ ప్రఖ్యాత మేధావి, రచయిత.

పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఈ వ్యాసంలో చర్చించే ప్రయత్నం చేద్దాం. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రెండు రకాల ఉద్యమాలు సాగుతున్నాయని భావిస్తున్నాను. 1.ఆధునిక ఉత్పత్తి సాధనాలపై పెట్టుబడిదారీ ఆధిపత్యాన్ని నిర్మూలించి, కార్మికుల ఉమ్మడి ఆధిపత్యాన్ని నిర్మించే అంతిమ లక్ష్యంతో సాగుతున్న ఉద్యమాలు. 2. పెట్టుబడి–శ్రమ శక్తి మధ్య సమతౌల్యాన్ని శ్రమశక్తికి అనుగుణంగా మార్చే దిశగా సాగుతున్న ఉద్యమాలు. ఈ రెండు రకాల ఉద్యమాలు పెట్టుబడిదారీ వ్యవస్థను నిలదీస్తున్నాయి. అదేసమయంలో కార్మికోద్యమ డిమాండ్లపట్ల పెట్టుబడిదారీ వ్యవస్థ సర్దుబాటు ధోరణి ప్రదర్శించాలన్న అభిప్రాయం కూడా ఈ ఉద్యమాలు కలిగించే అవకాశం లేకపోలేదు. ఈ రెండు రకాల ఉద్యమాలు అనుసరించే ఎత్తుగడలు ఆయా ఉద్యమాల అంతిమ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించటం ఒకింత కష్టసాధ్యమైన పని.

అంతిమంగా చూసినపుడు ఈ ఉద్యమాలను "సోషలిజం దిశగా సాగుతున్న ఉద్యమాలు" అని వర్గీకరించవచ్చు. లాటిన్ అమెరికాలో వివిధ దేశాల్లో జరుగుతున్న ప్రయత్నాల్లో ఈ పదజాలం విరివిగా వాడకంలో ఉంది. లాటిన్ అమెరికా దేశాల్లోని పార్టీలు సాంప్రదాయక వామపక్ష పార్టీల లక్ష్యం (సోషలిస్టు వ్యవస్థ స్థాపన) నుండి పక్కకు జరిగి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన భూమిక సిద్ధం చేయటం లక్ష్యంగా పని చేస్తున్నాయి. ఈ దిశగా పని చేస్తున్న వారిలో కొందరు తాము మార్క్స్ వారసులమని కూడా చెప్పుకుంటున్నారు. నిజం చెప్పాలంటే ఒకవైపు పారిశ్రామిక విప్లవం, సామ్రాజ్యవాద విస్తరణ ద్వారా జరుగుతున్న ప్రపంచీకరణ విధానాలు మరోవైపున నాగరికతను మరింత ఉన్నతమైన సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థలవైపు నెట్టటానికి అనువైన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో అనేక ధోరణులు వచ్చాయి. మార్క్సిజం అంటే ఇంగ్లాండ్‌లో నిర్దిష్ట రూపం తీసుకున్న రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రాన్స్‌లో ఊపిరి పోసుకున్న ఊహాజనిత సోషలిజం, జర్మనీలో వేళ్లూనుకున్న హెగెల్ తాత్విక చింతనల సారమని మొదట్లో ఎంగెల్స్, తర్వాత లెనిన్ వక్కాణించారు. అయితే ఈ నిర్ధారణ, మొత్తం సైద్ధాంతిక నేపథ్యాన్ని సంక్షిప్తీకరిస్తుంది. మార్క్స్‌కు పూర్వం, మార్క్స్ అనంతరం తెరమీదకు వచ్చిన సైద్ధాంతిక ధోరణులను విస్మరిస్తుంది.

ఒక విషయం విస్పష్టం. పెట్టుబడిదారీ వ్యవస్థకు శక్తివంతమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని తెరమీదకు తేవటంలో మార్క్స్ పాత్ర అద్వితీయం. పెట్టుబడిదారీ వ్యవస్థను దాని చారిత్రక నేపథ్యంలో పరిశీలించి సమగ్రంగా విశ్లేషించటం వల్లనే మార్క్స్ ఆలోచనలు ఈ స్థాయికి పరిణతి చెందాయి. అయితే మార్క్స్‌కు పూర్వం గానీ, మార్క్స్‌ని తోసిపుచ్చటానికి ఆయన తదనంతరం గానీ తెరమీదకు వచ్చిన సామాజిక సైద్ధాంతిక ప్రయత్నాల్లో ఇటువంటి విస్పష్టత కరువైంది. పెట్టుబడిదారీ విధానపు విలువ సిద్ధాంతం, దీర్ఘకాలంలో పెట్టుబడి సంచయం ప్రక్రియ తీరు తెన్నులు, అందులోని వైరుధ్యాలు, అంతర్జాతీయ ఘర్షణలు, వర్గపోరాటాల మధ్య సంబంధం, పెట్టుబడిసంచయంలోనూ, పరిపా లనలోనూ వస్తున్న మార్పులు, వేరుపర్చబడిన సామాజిక చైతన్య ధోరణులు ఇవన్నీ మార్క్స్ ఆలోచనల్లో అంతర్భాగం. ఈ ఆలోచనలు, సైద్ధాంతిక అన్వేషణ పరాకాష్టగానే చారిత్రకంగా మార్క్సిజం ప్రత్యేకించి, రెండవ, మూడవ అంతర్జాతీయ సంస్థలు, లెనినిజం, మావోయిజం రూపు దిద్దుకున్నాయి.

ఆధునిక ఆర్థిక వ్యవస్థను సామాజీకరించటం అనేది నేడు విప్లవకర సోషలిస్టు శక్తుల ముందున్న ప్రధాన ప్రశ్న. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క చారిత్రక విస్తరణ ద్వారా అంటే అటు పెటుబడిదారీ కేంద్రాల్లోనూ, ఇటు వర్ధమాన దేశాల్లోనూ జరిగిన విస్తరణ ద్వారా – ఆధునిక పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. పెట్టుబడిదారీ కేంద్రాల్లో సోషలిజం కోసం జరిగిన పోరాటాల్లో అపభ్రంశాలు జరగడం, చివరికి అవి మార్క్స్‌నే మరిచిపోవడంతో అక్కడ "పెట్టుబడిదారీ వ్యవస్థ అనంతర" సమస్యలగురించిన చర్చే లేకుండా పోయింది.

కానీ వలస దేశాల్లో జరిగిన విప్లవాలూ, విప్లవానంతర ప్రభుత్వాల వల్ల ఆర్థిక వ్యవస్థలను సామాజీకరించడం అనే అంశంపై చర్చ కొనసాగింది. అదేసమయంలో మిగిలిన దేశాల్లో ఈ ధోరణిని అనుసరించి ప్రత్యామ్నా మార్గాన్ని ఎంచుకోవటం అత్యావశ్యకం అయ్యింది. ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నంలోనే ఆయా దేశాల్లో రాజ్య సోషలిజం, రాజ్య పెట్టుబడిదారీ విధానం ముందు కొచ్చాయి. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసం గురించి అంత స్పష్టత లేదు. ఏది ఏమైనప్పటికీ సోషలిజం సాధన కోసం పని చేస్తున్న రాజకీయ శక్తుల సైద్ధాంతిక విశ్లేషణల్లోనూ, ఆయా పార్టీలు రాసుకున్న కార్యక్రమాల్లోనూ ఆధునిక ఆర్థిక వ్యవస్థను సామాజికీకరించటం, ప్రజాతంత్రీకరించటం అనేది సమాజ రాజకీయ నిర్వహణలో అంతర్భాగమైంది. సోషలిస్టు వ్యవస్థ సాధన లక్ష్యంగా ఎంచుకున్న పార్టీలు ఈ సూత్రాన్ని అంగీకరించటం అనివార్యతగా మారిందన్న విషయాన్ని గుర్తించాలి. ఎందుకంటే చైనా, సోవియట్ యూనియన్‌లలో జరిగిన రాజ్య సోషలిజం ప్రయోగాల్లో ఈ లక్ష్యాన్ని పక్కన పెట్టడం జరిగింది.

### పెట్టుబడికి వసంతమా?
### ప్రజా ఉద్యమాలకు శిశిరమా?

పెట్టుబడిదారీ వ్యవస్థకు వసంత రుతువు లాంటి పరిస్థితులు ప్రజా ఉద్యమాలకు శిశిర రుతువు లాంటి పరిస్థితులు ఒకే నాణేనికి రెండు ముఖాలు కాదు.

19వ శతాబ్దం చివర్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి గుత్తపెట్టుబడిదారీ విధానం రూపం తీసుకోవటంతో పతాక స్థాయికి చేరుకుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ అభివృద్ధి

లక్షణాలకు తగ్గట్లుగానే ఈ పరిణామం ఉన్నది. స్వల్ప కాలంలోనే ఈ స్థాయికి చేరుకున్న పెట్టుబడిదారీ విధానం సాధించాల్సిన సామాజిక లక్ష్యాల నుండి వైదొలగింది. అంటే 19వ శతాబ్దం వరకు పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న సృజనాత్మక శక్తి విధ్వంసక శక్తిమీద పైచేయి సాధించిన కాలంగా చెప్పుకోవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రక పరిణామం నుండి సామ్రాజ్యవాద విస్తరణను వేరు చేసి చూడలేము. ఈ దశలో వర్ధమాన దేశాలను తన కౌగిలిలో బంధించిన పెట్టుబడిదారీ విధానం వర్ధమాన దేశాల్లో విధ్వంసక పాత్ర పోషించింది. కానీ తర్వాతి దశలో పెట్టుబడి దారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధానం రూపం తీసుకున్న తర్వాత విధ్వంసక పాత్ర స్థానంలో సృజనాత్మక శక్తి పైచేయి సాధించింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ సుదీర్ఘ ప్రయాణంలో రెండు సంక్షోభాలు చూస్తాం. ఒకటి 1871–73 నుండి 1945–55 మధ్యకాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తిన సంక్షోభం. రెండో సంక్షోభం 1971–73 లో ప్రారంభమై నేటికీ కొనసాగుతూ ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గత లక్షణంగా ఉన్న శాశ్వత సంక్షోభం నుండి బయట పడటానికి అనుసరించిన మౌలిక సాధనాల్లో మూడవది, అంటే సామ్రాజ్యవాద దోపిడీ, గుత్తపెట్టుబడి సాగించే దోపిడీల ద్వారా అదనపు విలువను స్వంతం చేసుకోవటానికి నిర్మాణం, ద్రవ్య చలామణి రంగాల్లో వచ్చిన మార్పులు ఇక్కడ ముఖ్యమైనవి.

పెట్టుబడిదారీ విధానంలో వచ్చిన ఈ గుణాత్మక మార్పును గుర్తించిన మొదటి వ్యక్తి లెనిన్. అయితే ఆయన పొరపడిందల్లా ఒక్కటే. పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తిన ఈ సంక్షోభమే మొదటిదీ, ఆఖరిదీ అని ఆశించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగమైన వలస దేశాల్లో జరుగుతున్న విధ్వంసాన్నీ, పెట్టుబడిదారీ వ్యవస్థ పరిరక్షణలో ఈ విధ్వంస ఫలాలు పోషిస్తున్న పాత్రనూ లెనిన్ తక్కువ అంచనా వేశాడు. ఈ మార్పులను అధ్యయనం చేసిన మావో సోషలిజం సాధన సుదీర్ఘమైన ప్రయాణం అని నిర్ధారించుకున్నాడు. ఆదుర్దా పడలేదు. 20వ శతాబ్దంలో మొదటిసారిగా పేద దేశాలు, సామ్ర్యాజ్యవాద పదఘట్టనల కింద నలుగుతున్న దేశాల్లో విముక్తివాద చైతన్యం వెల్లి విరిసింది. ఈ దిశగా చూసినపుడు 20వ శతాబ్దంలో మాత్రమే ప్రజలే చరిత్ర నిర్మాతలన్న నానుడి రుజువైంది. తద్వారా తైపింగ్ విప్లవంతో ప్రారంభమైన సామ్రాజ్యవాద ఆధిపత్య వ్యతిరేక ధోరణులను మూడు ఖండాల్లో ప్రజలు ముందుకు తీసుకెళ్తూ ఉన్నారు.

దీనికి భిన్నంగా పశ్చిమ దేశాల్లో పారిస్ కమ్యూన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరగలేదు. సామ్రాజ్యవాద గుత్తాధిపత్యానికి ప్రత్యామ్నాయం నిర్మించటంలో మూడో ఇంటర్నేషనల్ కొంత మేర ప్రయత్నం చేసింది కానీ సఫలంకాలేదు. 20వ శతాబ్దం వైఫల్యం ఇక్కడే ఉంది. వర్ధమాన దేశాల్లో వెల్లివిరిసే చైతన్యంలో ఉన్న సమస్యల కంటే సంపన్న దేశాల్లో చైతన్యం వికసించకపోవటం 20వ శతాబ్దపు ప్రధాన సమస్యగా చెప్పుకోవాలి. సంపన్న దేశాల్లో సామ్రాజ్యవాద శిబిరం నుండి ప్రజలు బయటకొచ్చినట్లైతే వర్ధమాన దేశాల్లో జరిగిన పొరపాట్లు సరిచేసుకునే అవకాశం ఉండేది.

"20వ శతాబ్దం తొలి దశకాల్లో విజయం సాధించిన ప్రజా ఉద్యమాలు కాలక్రమేణా వాటి సానుకూల ప్రభావాన్ని కోల్పోయాయి. పెట్టుబడి దారీ వ్యవస్థ దాడికి కకావికలమైన వర్ధమాన దేశాలు దశల వారీగా తమ లక్ష్యం నుండి పక్కకు మళ్లాయి. మితవాదం వైపు నెట్టుకు పోయాయి. ఈ పతనం 1990 దశకంలో వరుసగా తెరమీదకు వచ్చిన ప్రతీఘాత విప్లవాలు ఈ వైఫల్యాలను మరింత బహిర్గత పర్చాయి."

20వ శతాబ్దం తొలి దశకాల్లో విజయం సాధించిన ప్రజా ఉద్యమాలు కాలక్రమేణా వాటి సానుకూల ప్రభావాన్ని కోల్పోయాయి. పెట్టుబడి దారీ వ్యవస్థ దాడికి కకావికలమైన వర్ధమాన దేశాలు దశల వారీగా తమ లక్ష్యం నుండి పక్కకు మళ్లాయి. మితవాదం వైపు నెట్టుకు పోయాయి. ఈ పతనం 1990 దశకంలో వరుసగా తెరమీదకు వచ్చిన ప్రతీఘాత విప్లవాలు ఈ వైఫల్యాలను మరింత బహిర్గత పర్చాయి. ఈ పరిస్థితుల్లో ఆయా దేశాల్లో వామపక్ష పంథా అనుసరించేందుకు ఉన్న అవకాశాలు, భవిష్యత్తు పట్ల ఆశ కలిగించే పరిణామాలు మూడు కారణాల రీత్యా కనుమరుగయ్యాయి. 1. ప్రజా ఉద్యమాలు కేలం దైనందిన సమస్యలకు పరిమితం కావటం. విస్తృతమైన సామాజిక, భౌగోళిక రాజకీయ సమస్యలపై స్పందిచకపోవటం, 2. తీవ్రమైన దోపిడీ వ్యవస్థల పెత్తనం, పట్టు, అణచివేత, 3. పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద జోక్యం... ఈ మూడు కారణాలు. ఇలాంటి పరిస్థితుల్లో రష్యాలోనూ, తూర్పుయూరప్‌లోని ఇతర దేశాల్లోనూ తలెత్తిన విప్లవోద్యమాల ఆధారంగా ఈ కాలం ప్రజా ఉద్యమాలకు శిశిర రుతువు అని నిర్ధారించటం ఒక ఫార్సు మాత్రమే అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ వాస్తవికతల గురించి పెద్దఎత్తున భ్రమలకు ప్రపంచం లోనైంది. అందువల్లనే ఈ దేశాల ప్రజలు విప్లవాల తరువాత కూడా తమ అవకాశాల కోసం ఎదురుచూస్తూండిపోయారు.

20వ శతాబ్దం నాటి నుండి నేటి వరకూ తెరమీదకు వచ్చిన పెట్టుబడి వసంతం, ప్రజా ఉద్యమాల శిశిరం రెండూ భిన్నమైనవి. అందువల్లనే పెట్టుబడి వసంతం నూతన దశకు తెరతీసింది. పెట్టుబడి ఆధిపత్యాన్ని నిలుపుకోవటానికి, కొనసాగించటానికి మరిన్ని దారుణాలకూ, అరాచకత్వాలకూ ఒడిగట్టింది పెట్టుబడి దారీ వ్యవస్థ. సామ్రాజ్యవాద అరాచకత్వం, రాక్షసత్వం రెట్టింపు అయ్యింది. మొత్తం భూగోళాన్ని అమెరికా, నాటో కూటమి తమ సాయుధ గుప్పెట్లోకి తీసుకొన్నది. ఈ అరాచకత్వం లక్ష్యం ఒక్కటే. సామ్రాజ్యవాదానికి మూడు మూల స్థంభాలైన అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్‌లకు చెందిన గుత్తపెట్టుబడిదారీ సంస్థల లాభాలు కాపాడి విస్తరింపచేయటమే. ఈ అరాచకత్వానికి ప్రజల స్పందన కూడా అనేక కొత్త ధోరణులను తనలో నింపుకున్నది.

ప్రజల శిశిరం విశ్వవ్యాప్తం అయ్యే వరకు ఈ సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ముగింపు లేదు. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ముగింపు పలకాలంటే ప్రపంచ వ్యాప్తంగా సోషలిస్టు ప్రత్యామ్నాయానికి తెరతీయాలి. 20వ శతాబ్దంలో ఉత్తరార్ధగోళంలో ప్రజలు సామ్రాజ్యవాదంతో మమేకం అయిన తరుణంలో దక్షిణార్ధ గోళంలో ప్రజలు తిరబడిన పరిణామాలే 21వ శతాబ్దంలో జరుగుతాయా అన్నిది పరిశీలించాల్సిన అంశం.

## భిన్నత్వంలో ఏకత్వాన్ని నిర్మించాల్సిన అవసరం

పెట్టుబడిదారీ వ్యవస్థతో ఘర్షణ పడుతున్న వైవిధ్యభరితమైన సామాజిక శక్తులు, ప్రజల మధ్య ఐక్యత నిర్మించకుండా విప్లవాత్మక అవకాశాలు ముందుకు రావటం సాధ్యం కాదు. వైవిధ్యాన్ని గుర్తించటమే ఇక్కడ ముఖ్యమైన సమస్య. ఏయే అంశాల్లో వైవిధ్యం ఎక్కువగా ఉంది ఏయే అంశాల్లో వైవిధ్యం తక్కువగా ఉంది అన్నది కూడా గుర్తించాల్సిన అవసరం ఉంది. వైవిధ్య రూపాలు, వైవిధ్యానికి కారణాలు

**❝ నయా-ఉదా రవాదం 1. అత్యధిక ప్రజానీకాన్ని కార్మికులుగా మార్చింది. 2. పెట్టుబడిపై ఆధారపడాల్సిన పరిస్థితులు సంపన్న దేశాల్లోనూ, వర్ధమాన దేశాల్లోనూ అంత కంతకూ పెరగటంతో స్వంతత్ర ఆర్థిక కార్యకలా పాలకు ఉన్న అవకాశాలు కనుమరుగవుతున్నాయి. 3. చారిత్రకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తెరమీదకు వస్తున్నప్పుడు ఏర్పడిన సామాజిక నిర్మాణాల స్థానంలో సార్వత్రిక పెట్టుబడి కనుసన్నల్లో ఉండే నూతన సామాజిక నిర్మాణాలు ముందుకొస్తున్నాయి. ❞**

అనేకం. దీన్ని వివరించటానికి కుప్పలు తెప్పలుగా గణాంకాలు చెప్పాల్సి వస్తుంది.

సంక్లిష్టమైన వర్గ విశ్లేషణ ద్వారా మాత్రమే ఈ వైవిధ్యాన్ని మెరుగ్గా అర్థం చేసుకోవచ్చు. పెట్టుబడిదారీ వర్గం, కార్మికవర్గం మధ్య ఉన్న వైరుధ్యమే వ్యవస్థలో తొలి వైవిధ్యం అన్నది నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే ఈ వైవిధ్యం, వైరుధ్యం ఆయా దేశాల్లోని అనేక సామజిక ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కార్మికుల్లో కొందరు నైపుణ్యం కలిగిన వారున్నారు. ఈ తరగతికి చెందిన కార్మికులు తమకున్న నైపుణ్యంతో కాస్తో కూస్తో స్థిరమైన జీవితం గడపుతున్నారు. ఈ స్థిరత్వం లేని వారు రెండో కోవకు చెందినవాళ్లుగా ఉన్నారు. పెట్టుబడిదారుల్లో సైతం చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు కలిగిన వారున్నారు. గుత్తపెట్టుబడి, ద్రవ్య పెట్టుబడిరంగంలో కీలక స్థానాల్లో నిర్వహణ, యాజమాన్య బాధ్యతల్లో ఉన్న వాళ్లు కూడా ఉన్నారు.

ఒక దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ స్థాయికి ఎదిగింది, ఆధిపత్య స్థాయికి చేరిందా, సామ్రాజ్యవాద స్థాయికి చేరిందా, వర్ధమాన దేశాల స్థాయికి చేరిందా అన్నదాన్ని బట్టి వివిధ వర్గాల మధ్య వైవిధ్యం ఉంటుంది. సంపన్న దేశాల్లో కార్మికవర్గం పరిస్థితికీ, వర్ధమాన దేశాల్లో కార్మికవర్గ పరిస్థితికీ మధ్య వ్యత్యాసం ఉంటుంది. సంపన్న దేశాల్లో రైతాంగం నామమాత్రపు స్థాయికి నెట్టబడితే వర్ధమాన దేశాల్లో రైతాంగం గణనీయమైన శక్తిగా ఉంది.

పెట్టుబడి సంచయం ఆధారంగా సమాజాన్ని వర్గాలుగా విభజించటాన్ని సరళీకృతం చేసేందుకు పెద్దఎత్తున ప్రయత్నం జరుగుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజలు వివిధ వర్గాలుగా విభజించటంలో కొన్ని పొరపాటు ధోరణులు దొర్లే అవకాశం ఉంది. ఈ పొరపాటు ధోరణులను మూడు రకాలుగా క్రోడీకరించవచ్చు. 1. బూర్జువా, కార్మికవర్గాల మధ్య వైరుధ్యం ఉన్న కారణంగా సమాజంలోని మిగిలిన వర్గాలు రాజకీయ రంగం నుండి పూర్తిగా కనుమరుగు అవుతాయి. 2. ప్రజలందరూ ఒక వైపున బూర్జువావర్గం, మరో వైపున కార్మికవర్గం రెండు శిబిరాలుగా చీలిపోయి ాంటాయి. వారి మధ్య ఉండే వైవిధ్యం చాలా పరిమితం. 3. పెట్టుబడిదారీ విధానం విశ్వవ్యాప్తం కావటంతో సంపన్న దేశాల్లోని సామాజిక నిర్మాణాలు, వర్ధమాన దేశాల్లోని సామాజిక నిర్మాణాల మధ్య వ్యత్యాసం తగ్గిపోతుంది, అనేవి ఈ మూడు పొరపాటు అవగాహనలు.

ఉదాహరణకు 19వ శతాబ్దంలో యూరప్‌లో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి గురించి పరిశీలిద్దాం. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడిన ఏ దేశంలోనూ బూర్జువావర్గం తనకు ముందున్న ఆధిపత్యవర్గాలు, కులీన వర్గాలను సంపూర్ణంగా తెరమరుగు చేయలేదు. అధికార వ్యవస్థల్లో ఒక భాగంపై వాళ్ల ఆధిపత్యం కొనసాగే పద్ధతుల్లో బూర్జువావర్గం కులీన వర్గాలు, పూర్వపు ఆధిపత్య వర్గాలతో రాజీ పడింది. 1914లో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాద శక్తుల మధ్య జరిగిన ప్రపంచ యుద్ధమే. అయితే ఈ యుద్ధంలో అమెరికా ప్రవేశానికి ముందు కేవలం ఫ్రాన్స్ ఒక్కటే గణతంత్ర రాజ్యం. మిగిలిన దేశాలన్నింటిలోనూ రాచరికమే అధికార వ్యవస్థలో అగ్రస్థానంలో ఉంది.

ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగిన వారందరూ బూర్జువావర్గం నిర్వచనం పరిధిలోకి వస్తారని అనుకోవటం పొరపాటు. కంపెనీ వ్యవస్థ ఉనికిలోకి వచ్చిన తర్వాత యాజమాన్య హక్కు సమాజం అంతటా విస్తరించబడుతుంది. కానీ సదరు ఆస్తిని, సంపదను అజమాయిషీ చేసే హక్కు మాత్రం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుంది. బూర్జువావర్గం అంటే చిన్న పెట్టుబడిదారులు, వాళ్ల మీద మధ్యంతర దశలో ఉన్న పెట్టుబడిదారులు అందరికంటే మీద గుత్తపెట్టుబడిదారులు ఉండే ఏకీకృత వర్గం కాదు. ఈ వర్గంలో సమాజ రాజకీయ ఆర్థిక జీవితాన్ని అజమాయిషీ చేసే మధ్యతరగతి కూడా కలిసి ఉంటుంది. అదేవిధంగా పెట్టుబడిదారీ వర్గం వారి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే ప్రాంతం పురోగమిస్తుందా లేక స్థబ్దతకు లోనైందా అన్నదాన్ని బట్టి కూడా ఈ వర్గ పొందిక, అమరిక ఆధారపడి ఉంటాయి.

వర్ధమాన దేశాల్లో బూర్జువావర్గం అంటే సంపన్న దేశాలకంటే వెనక పుట్టి ప్రసుత్తం విలాసవంతమైన జీవితం గడుపుతున్న పెట్టుబడిదారులే కాదు. దక్షిణాది దేశాల్లో రైతాంగం పొందిక కూడా ఆయా దేశాల పరిస్థితులను బట్టి భిన్నంగా వైవిధ్యంతో ఉంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ ప్రాతిపదికన వీరిని తనలో అంతర్భాగం చేసుకుంటుంది, పాతకాలపు అధికార వ్యవస్థలు ఎంతవరకు మనుగడ సాగిస్తున్నాయి, వాటిలో ఈ రైతాంగం ఏ పాత్ర పోషిస్తున్నారు అన్న పలు అంశాల ఆధారంగా రైతాంగంలో వర్గపొందిక నిర్మాణమవుతుంది. ప్రపంచ పెట్టుబడి కేంద్రీకరణ పర్యవసానంగా ఏర్పడిన పరిస్థితుల్లో (దుర్భరదారిద్ర్య) వర్ధమాన దేశాల్లోని మెజారిటీ ప్రజానీకం తమకంటూ ఏ వనరులూ లేక కేవలం అసంఘటిత ఆర్థిక వ్యవస్థద్వారా పొట్ట పోసుకుంటున్నారు.

ప్రపంచీకరణ, ద్రవ్యీకరణ, సార్వత్రిక గుత్తాధిపత్యం నడుమ జరుగుతున్నపరిణామాలను గత మూడు దశాబ్దాలుగా మనం నయా-ఉదారవాదం శీర్షికన చర్చించుకుంటున్నాము. ఈ పరిణామాలు 1. అత్యధిక ప్రజానీకాన్ని కార్మికులుగా మార్చింది. (సంపన్న దేశాల్లో వేతనంపై ఆధారపడి శ్రమను అమ్ముకునే ప్రజలు 80 శాతం వరకు ాన్నారు). 2. పెట్టుబడిపై ఆధారపడాల్సిన పరిస్థితులు అటు సంపన్న దేశాల్లోనూ ఇటు వర్ధమాన దేశాల్లోనూ అంత కంతకూ పెరగటంతో స్వంతత్ర ఆర్థిక కార్యకలా పాలకు ఉన్న అవకాశాలు కనుమరుగవుతున్నాయి. దాంతో సబ్ కాంట్రాక్ట్ వ్యవస్థ తెరమీదకు వచ్చింది. ఈ సబ్‌కాంట్రాక్టర్లకు అంతర్జాతీయ గుత్త సంస్థలు పోగు చేసుకుంటున్న మిగులులో నామమాత్రపు వాటా చెల్లిస్తున్నారు. 3. చారిత్రకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తెరమీదకు వస్తున్నప్పుడు ఏర్పడిన సామాజిక నిర్మాణాల స్థానంలో సార్వత్రిక పెట్టుబడి కనుసన్నల్లో ఉండే నూతన సామాజిక నిర్మాణాలు ముందుకొస్తున్నాయి. దాంతో ద్రవ్య పెట్టుబడి నుండి గణనీయమైన వేతనాలు తీసుకుంటున్న ఉద్యోగవర్గం కూడా బూర్జువావర్గంలో అంతర్భాగంగా మారింది.

ఈ విధంగా సార్వత్రిక గుత్తపెట్టుబడిదారీ విధానం ఆధిపత్యం విస్తరిస్తున్నకొద్దీ సమాజంలో స్థిరత్వం ఏమీ రాలేదు. ప్రజల స్థితిగతులు మరింత దిగజారాయి. ప్రజల్లో ప్రతిఘటనా ధోరణులు పెంచేందుకు గల అవకాశాలు మెరుగయ్యాయి. అంతేకాదు, కొత్తగా సంపన్న దేశాల సరసన చేరిన దేశాల్లో సైతం ఈ సామాజిక స్థిరత్వం తగ్గింది. పైగా వీటి మధ్య వైరుధ్యాన్ని

పెంచుతోంది. చారిత్రకంగా సామ్రాజ్యవాద కేంద్రాలుగా ఉన్న దేశాలు పూర్వంలాగా తమ ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించలేకపోతు న్నాయి. ఆధిపత్యం కొనసాగింపుకు కేవలం సైనిక జోక్యం ఒక్కటే వీరికి సాధనంగా మారిం ది. నూతన విప్లవ పరిస్థితులు తలెత్తుతున్నాయని చెప్పటానికి ఈ ఒక్క పరిణామం చాలు. ఈ పరిస్థితుల్లో మనం ఎలా స్పందించాలి? ఈ పరిస్థితితుల్లో నిర్మించే ఉద్యమాలు సోషలిజం దిశగా సాగే ఉద్యమాలుగా పరివర్తవన చెందా లంటే అటువంటి ఉద్యమాలను ఎలా నిర్మిం చాలి? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటే ఐక్యత, వైవిధ్యాల గురించి మనం ఇంతకు ముందు ప్రస్తావించుకున్న అంశాలను పునఃప్రస్తా వించాలి.

గతంలో ఐక్యత, వైవిధ్యం అన్న అంశాలకు గతితార్కిక పద్ధతి ఆధారంగా నిర్ధిష్ట సమా 9ధానం చెప్పగలిగినప్పుడు నిర్ధిష్టంగా గుర్తించ గలిగినప్పుడు ఆయా దేశాల్లో ఇటువంటి పరిస్థి తులు తలెత్తినపుడు సోషలిజం దిశగా ముందడుగు వేయగలిగాము.

ఇక్కడ గతితార్కిక వైరుధ్యం గురించి ప్రస్తావించుకుందాం. ఈ రెండు పరిస్థితుల్లో (వైవిధ్యం, ఐక్యత) ఏదో ఒక దాన్ని ఎంచుకో వటం రెండో దాన్ని విడనాడటం గతితార్కిక పద్ధతి కాదు. ఈ రెండు ధోరణులను ఒకదాని కొకటి పరస్పర పోషకాలుగా ఉండేలా మార్చటం గతితార్కిక అవగాహన. ఊహాజనిత పరిస్థితు లను ప్రస్తావించుకుంటే వాటికి ఈ ప్రయత్నంలో సమాధానం దొరకదు. కానీ ఊహాజనిత అవగా హన సత్వర పరిష్కారాలు చూపిస్తుంది కనక ఆవైపే మొగ్గు చూపుతున్నాము.

పైన చెప్పుకున్నట్లు నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట అధ్యయనం నిర్ధిష్ట ఎత్తుగడలు వేసినపుడు విజయం సాధించాము. 1917లో సమాజం లోని వివిధ వర్గాల, తరగతుల ప్రజల మధ్య ఉన్న వైవిధ్యాన్ని గుర్తించినందువల్లనే వారిని ఈ విప్లవోద్యమంలో అంతర్భాగం చేయటం ద్వారా సాధ్యమైనంత ఎక్కువ ఐక్యతను సాధించ టానికి లెనిన్ కృషి చేశాడు. ఈ దిశగా శాంతి, భూమి వంటి ఉమ్మడి లక్ష్యాలను విప్లవ లక్ష్యా లుగా ముందుకు తెచ్చాడు. రైతాంగ కుటుంబాల నుండి వచ్చిన సైనికులకు భూమి ఇవ్వాలన్న ప్రతిపాదన ద్వారా లెనిన్ సైన్యం, రైతాంగం నుండి బోల్షివిక్ పార్టీ ఒంటరిపాటు కాకుండా ఉండేలా చూశాడు. అప్పటి వరకు రష్యాలో బోల్షివిక్ పార్టీకి గ్రామీణ ప్రాంతంలో ఆదరణ లేదు. ఈ ఎత్తుగడ ద్వారా గ్రామీణ ప్రాంతంలో చొచ్చుకుపోవటానికి వీలైంది. చైనాలో మావో పేదలు, దోపిడీకి గురవుతున్న వర్గాల మధ్య శాశ్వత మైత్రి ఆధారంగా కమ్యూనిస్టు పార్టీని నిర్మించాడు. 1949 విజయం వెనక ఉన్న రహస్యం ఇదే. ఆ తర్వాతి కాలంలో ఈ దేశాల్లో వైవిధ్యం, ఐక్యతల మధ్య సంబంధాల విషయం లో ఏమి జరిగిందన్నది వేరే ప్రశ్న.

పైన చెప్పిన రెండు సందర్భాల్లోనూ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్ట రాజకీయ స్పందన వచ్చింది. నిర్దిష్ట పరిస్థితుల్లో ఉన్న వైవిధ్యాలు ఏమిటి, ఏ వైవిధ్యం ముఖ్యమైనది, ఏ వైవిధ్యం ప్రస్తుత సమాయానికి ముఖ్యమైనది కాదు అన్న అంశంపై సరైన విశ్లేషణ చేయటం ద్వారా సరైన స్పందన రూపొందించటం సాధ్యం అయ్యింది. ఈ విషయంలో నిర్దిష్ట విశ్లేషణకు సంబంధించి శాశ్వతమైన ఫార్ములా అంటూ ఏమీ లేదు. ఈ ముఖ్యమైన వైవిధ్యాలు చైనా, అమెరికా, ఫ్రాన్స్‌లలో, భారతదేశం, కాంగో, పెరు దేశాల్లో ఒకే విధంగా ఉండవు. సంపన్న దేశాల్లో వామపక్ష శక్తులు జాతీయీ కరణ, ప్రభుత్వరంగం వంటి ప్రతిపాదనలు ముందుకు తెచ్చే ధైర్యం చేయాలి. తద్వారా ఆర్థిక వ్యవస్థపై ప్రజాతంత్ర సామాజికీకరణ సాధించటం వీలవుతుంది. తదనంతర కాలం లో తలెత్తే ప్రత్యేక పరిస్థితు లను గమనంలోకి తీసుకుని ముఖ్యమైన డిమాం డ్లపై సరైన విశ్లేషణ ద్వారా సరైన డిమాండ్లు ముందుకు తేవటం ద్వారా ప్రజాతంత్ర వాతావరణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లటం సాధ్యం అవుతుంది.

వర్ధమాన దేశాల్లో వామపక్ష శక్తులు దళారీ వర్గ శక్తుల ఆధిపత్యానికి భిన్నంగా సామాజిక ఆధిపత్యం తెరమీదకు తీసుకురా గలిగిన పద్ధతుల్లో వర్గపొందిక నిర్మించాల్సిన అవసరం ఉంది. దళారీ వర్గ ఆధిపత్యానికి వ్యతిరేకం ఆయా దశల్లో ఉమ్మడి పాక్షిక లక్ష్యా లు ఉద్యమ ఎజెండాగా మార్చటంలో నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా నిర్ధిష్టంగా స్పందించ గలిగినప్పుడే సాధ్యం అవుతుంది. ఈ పరిస్థి తులు తలెత్తినపుడే సదరు ఉద్యమాలు సోష లిజం నిర్మాణం దిశగా సాగే ఉద్యమా లుగా పరివర్తన చెందుతాయి.

### కమ్యూనిజం: మానవ నాగరికతలో అత్యున్నత దశ

పెట్టుబడిదారీ లక్షణాల పునాదుల కంటే భిన్నమైన ఉన్నతమైన పునాదులపై మానవ సమా జాన్ని పునఃనిర్మించటం సోషలిజం లక్ష్యం. ఇదేదో కేవలం న్యాయమైన సమాజం, మరింత సమర్ధవంతమైన సమాజం నిర్మించటం కాదు.

భవిష్యత్తు నిర్మాణం నేడే ప్రారంభమవు తుంది. ఎవరికి ఏమి కావాలో ఏ సూత్రాల ప్రాతిపదికన కావాలో తెలుసుకోవటం అవసరం. పరస్పరం పోటీని పెంచే విధ్వంసం ప్రాతిపది కనా లేక అందరికీ ప్రయోజనం కలిగించే సంఘీభావం ప్రాపదికన మనకు కావాల్సినవి సాధించుకోవాలా అన్నది కూడా తెలుసుకోవాలి. అసమానతలను చట్టబద్ధం చేసే స్వేచ్ఛ కావాలా, సమానత్వంలో కలసి నడిచే స్వేచ్ఛ కావాలా? భావితరాల అవసరాలు ప్రయోజనాలు మర్చి పోయి విచ్చలవిడిగా ప్రకృతి సంపదను దోపిడీ చేయటమా లేక భావితరాలు, ప్రకృతి పునరు తృత్తికి అవసరమైన పద్ధతుల్లో ప్రకృతి వనరులు వినియోగించుకోవటమా?

ప్రజాతంత్ర సోషలిజం ఉండాలి. ప్రజా తంత్రం లేకుండా సోషలిజం అసలు సాధ్యం కాదు. సమాజం ప్రజాతంత్రీకరించటం అంటే కేవలం ఎన్నికల్లో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి వీలుకల్పించటం మాత్రమే కాదు. సమాజ ప్రజాతంత్రీకరణ నిరంతర ప్రక్రియ. పశ్చిమ దేశాలు, వర్ధమాన దేశాల గురించి మాట్లాడే టపుడు ప్రజాస్వామ్యం మొదటి షరతుగా చెబు తుంటారు. అంటే వీరి దృష్టిలో బహుళ పార్టీ ఎన్నికల వ్యవస్థ ఉండాలి. కానీ అనేక వర్ధమాన దేశాలు ఈ దశను ఎప్పుడో దాటిపోయాయి. అయినా సామ్రాజ్యవాద దేశాలు, ఆయా దేశా ల్లోని వాళ్ల తైనాతీలు ఈ ఎజెండానే పదే పదే ముందుకు తేవటం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటం తప్ప మరోటి కాదు. సంపన్న దేశాల్లో కార్మికోద్యమాలు సమరశీల ఉద్యమాలుగా పరివర్తన చెందకుండా ఉండేలా చూడటంలో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం పెద్ద ఎత్తున దోహదం చేసింది. జీవన ప్రమాణాల్లో విస్తారమైన వైవిధ్యం కలిగిన పరిస్థితుల్లో కార్మికవర్గం తమ డిమాండ్లపై ఆందోళనకు దిగటానికి కాక ప్రాతినిధ్య ఎన్నికల్లో ప్రజా ప్రతి నిధులకు విన్నపాలు చేయటం ద్వారా ఈ పరిస్థితులనుండి బయటపడాలని ప్రయత్నం చేస్తుంది. తద్వారా కార్మికోద్యంలో సమరశీల తను ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం నిర్వీర్యం చేస్తుంది. ఎన్నికల కసరత్తు వివిధ తరగతుల ప్రజల మధ్య ఉమ్మడి అవగాహన, ఉమ్మడి లక్ష్యా లపై ఉద్యమ నిర్మాణానికి ప్రధాన ఆటంకంగా ఉంటుంది. ఈ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి మించిన ప్రత్యామ్నాయం లేదని పశ్చిమ దేశాల ప్రజాభిప్రాయం. చివరకు కమ్యూనిస్టు దేశాలు సైతం ఈ అంచనాకు వచ్చాయి. సార్వత్రిక గుత్తపెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించాక ఎన్నికల వ్యవస్థలో డొల్లతనం మరింత స్పష్టంగా ముందుకొస్తుంది.

రాజకీయ ప్రజాస్వామ్యం నిర్వహణలో నూతన అవకాశాలకు తెరతీయాల్సిన బాధ్యత సోషలిజం దిశగా సాగే ౹ాద్యమాలపై ఉంది. మార్క్స్ ప్రతిపాదించిన సోషలిజం పర్యావరణం తో సఖ్యతతో వ్యవహరించేదని జాన్ బెల్లమీ ఫాస్టర్ సరిగానే వ్యాఖ్యానించాడు. హరిత పెట్టు బడిదారీ విధానం నేటికీ ఊహాజనితమే అని నేను నమ్ముతున్నాను. ఎందుకంటే పెట్టుబడి పోగుపడటానికి దోహదం చేసే సూత్రాలు, పర్యావరణ పరిరక్షణ కోసం పని చేసే సూత్రాలు ఒకే ఒరలో పొసగవు. ఈ విషయంలో కూడా

సోషలిజం కోసం సాగే ఉద్యమాలు పర్యావరణ పరిరక్షణలో నూతన ఉద్యమాలకు తెరతీయాల్సిన బాధ్యతను కలిగి ఉన్నాయి. ఈ ఉద్యమాలు దీర్ఘకాలంలో ప్రకృతి పర్యావరణం పునరుత్పత్తికి దోహదం చేసే విధంగా సామాజిక సంబంధాలను పునఃప్రతిష్ఠించటంలో ప్రజాతంత్ర సామాజీకరణ తనవంతు పాత్ర పోషించాలి.

ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పే క్రమంలో సోషలిస్టు ఉద్యమాలు 19వ శతాబ్దపు ఊహాజనిత పరిష్కారాలకు పరిమితం కాకూడదు. 19వ శతాబ్దం నాటి సోషలిస్టు ఉద్యమం నాటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే నేటి సోషలిస్టు ఉద్యమాలు ఈ దిగువ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. 1. గతంలో ఊహాజనిత సోషలిజం నాటి అవగాహన కంటే నేటి అవగాహన సామాజిక శాస్త్రం, మానవావరణ శాస్త్రం పట్ల ఏ విధంగా మారింది? 2. ప్రకృతిలోని జీవావరణం పునరుత్పత్తి గురించి సమకాలీన ఆధునిక శాస్త్ర విజ్ఞానం ఏమిటి? 3. ఈ విజ్ఞానాన్ని మార్క్సిస్టు ఆలోచనా ధోరణిలోకి చొప్పించ గలమా?

ఈ ప్రశ్నలకు పూర్తి స్థాయిలో సమాధానం ఇచ్చే దిశగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను సమగ్రంగా పరిశీలించాలి. ఈ క్రమంలో 1950–80 మధ్య కాలంలో కురిసిన తొలకరి జల్లులు ఆవిరయ్యాయి. చరిత్ర పుటల్లో పేజీలు మారాయి. సామ్రాజ్యవాద శక్తులు తిరిగి తమ ఆధిపత్యాన్ని పునరుద్ధరించుకోగలిగాయి. నేడు ఈ ప్రపంచీకరణ బంధనాలు బలహీనపడుతున్నాయి. దీంతో వర్ధమాన దేశాల్లోని ప్రజలకు రెండో దశ విముక్తి పోరాటాలకు అవకాశాలు ముందుకొస్తున్నాయి. ఈ రెండో దశ విప్లవోద్యమాల లక్ష్యం ఏమిటన్న విషయానికి సంబంధించి వివిధ రాజకీయ సాంస్కృతిక దృక్పథాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

**వ్యవస్థీకృతమైన ప్రపంచీకరణ దృక్పథం నుండి వైదొలగటం**

వ్యవస్థీకృత ప్రపంచీకరణ నమూనాలో సోషలిజం దిశగా ఉద్యమాలకు ఏమాత్రం అవకాశం లేదు. అందువల్ల ఈ ఉద్యమాలు ప్రపంచీకరణ దృక్పథం నుండి వైదొలగటానికి అవసరమైన తాత్కాలిక, దీర్ఘకాలిక వ్యూహాన్ని కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. అలా లేని పక్షంలో వ్యవస్థీకృత ప్రపంచీకరణ నమూనా నుండి బయట పడటం సాధ్యం కాదు.

"సమస్య ప్రపంచ వ్యాప్తం. కనక పరిష్కారం కూడా ప్రపంచ వ్యాప్తంగా కావాలి" అన్న వాదన వినిపిస్తోంది. ఇందులో మొదటి అంశం సరైనదే. సమస్య ప్రపంచ వ్యాప్త సమస్య. అంత మాత్రాన ప్రపంచ వ్యాప్త పరిష్కారమే పరిష్కారం అన్నవాదనకు అర్థం లేదు. ఐక్యరాజ్యసమితి వంటి బహుళపక్ష సంస్థల ఒప్పందాల్లో మార్పులు తేవటం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందనేందుకు ఆధారాలు లేవు. ప్రపంచ చిత్రంలో మార్పులు ఎల్లప్పుడూ దిగువ స్థాయిలోనే ఆరంభమయ్యాయి. అప్పుడే ప్రపంచ వ్యాప్త సంబంధాల్లో మార్పులు రావటానికి గల అవకాశాలు మెరుగవుతాయి. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో సంబంధాలను దేనికి దానికి వేర్వేరు స్థాయిల్లో ముక్కలు చేసి చూడాలి. ఈ ప్రయత్నం ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చేందుకు దారితీసేదిగా ఉండాలి. ఉదాహరణకు యూరోపియన్ సంక్షోభాన్నే చూద్దాం. బ్రెస్సెల్స్ నుండి పాలకవర్గాలు ఎంత ప్రయత్నించినా ఈ సంక్షోభం నుండి బయట పడటం సాధ్యం కాదు. 'యూరోపియన్ యూనియన్' అవగాహనను మొదట కొన్ని యూరోపియన్ దేశాలు ఆ తర్వాత మరికొన్ని తిప్పికొట్టినపుడే మరో ప్రత్యామ్నాయ యూరప్ సాధ్యం అవుతుంది.

జాతీయ స్థాయిల్లో కార్యాచరణ ద్వారానే మార్పు సాధ్యం అయ్యేలా వ్యూహం పన్నేందుకు చేసే ప్రయత్నాలను ఒక్క వాక్యంలో చెప్పుకోవాలంటే 'ప్రపంచీకరణ అవసరాలకు అనుగుణంగా తనను తాను సర్దుబాటు చేసుకోవటాన్ని ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలి'. ప్రపంచీకరణ స్థానంలో సార్వభౌమదేశాల కర్తవ్యాలు, లక్ష్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా తలెత్తే అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచ సంబంధాలు మారుతూ ఉండాలి.

**సార్వభౌమత్వ దేశాల కర్తవ్యాలు లక్ష్యాలు అంటే అర్థం ఏమిటి?**

కొన్ని సందర్భాల్లో సార్వభౌమత్వ దేశాల పరిధిలో పని చేయటం సోషలిజం సాధన కోసం జరిగే ఉద్యమాలకు నూతన అవకాశాలు తెచ్చి పెడుతుంది. సార్వభౌమ లక్ష్యాలేమిటి అన్నదే చర్చనీయాంశం. అంతర్జాతీయ పెట్టుబడులు దేశాల్లోని వివిధ రంగాల్లో వివిధ రూపాల్లో వివిధ స్థాయిల్లో చొచ్చుకుపోయినపుడు ఏ సార్వభౌమ లక్ష్యాల గురించి మాట్లాడుతున్నాం అన్న ప్రశ్న ముందుకు రాకమానదు.

ప్రకృతి వనరులపై అంతర్జాతీయ వివాదాలు, వర్తమాన పెట్టుబడిదారీ వ్యవస్థ దశ, దిశలను ప్రభావితం చేస్తాయి. ఇది ప్రత్యేకంగా చర్చించాల్సిన అంశం. ప్రకృతి వనరులపై అమెరికా ఆధారపడం, పెరుగుతున్న చైనా అవసరాలు లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల వనరులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్న దేశాల చరిత్ర అంతా ఆ వనరులను దోచుకోవటం కోసం జరిగే ప్రయత్నాలను ప్రతిఘటించే చరిత్రే. ఈ పరిస్థితుల్లో ఏ దేశమైనా ప్రజలందరి ప్రయోజనాలకు అనుగుణంగా ప్రకృతి వనరుల వినియోగ విధానాన్ని రూపొందించగలదా? ఈ సమస్యపై చైనా, దక్షిణార్ధగోళంలోని మిగిలిన దేశాల మధ్య సంబంధాలను పునర్నిర్మించగలమా? ఆయా దేశాల్లో ప్రకృతి వనరులు అందుబాటులోకి తెచ్చుకునేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలు ఆ దేశాల పారిశ్రామికీకరణ మధ్య సానుకూల సంబంధం ఏర్పాటు చేయగలమా?

కేవలం అంతర్జాతీయ కార్యాచరణ ద్వారానే సార్వభౌమత్వ దేశాల ప్రయోజనాలు నెరవేర్చటం సాధ్యం కాదు. విస్తృత జనబాహుళ్యం మద్దతు లేకపోతే స్వంతంత్ర దేశాలు రూపొందించే లక్ష్యాలు ఆచరణ సాధ్యం కావు. విస్తృత జనబాహుళ్యం మద్దతు ఉండాలంటే అభివృద్ధి వల్ల ఆర్థికంగా సామాజికంగా లబ్దిపొందుతామన్న విశ్వాసం ఆయా ప్రజలకు కలగాలి. సామ్రాజ్యవాద శక్తులను ప్రతిఘటించి, తిరస్కరించి స్వంతంత్ర విధానాలను అనుసరించే ప్రయత్నం చేస్తున్న దేశాల్లో సాంఘిక సుస్థిరత ప్రధాన సమస్యగా ముందుకొస్తుంది. అందువల్ల అంతర్జాతీయ రంగంలో వివిధ దేశాల మధ్య ఉన్న సంబంధాలు ఎలా ఉన్నాయో కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

ఈ చర్చ నేపథ్యంలో కొన్ని దేశాల్లో ప్రభుత్వాలు అనుసరించబూనుకుంటున్న స్వంత్ర విధానాలను ఈ కింది విధంగా క్రోడీకరించుకోవచ్చు.

1. చైనా ఒక్కటే సార్వభౌమ లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పని చేస్తున్న దేశం. చైనా ప్రారంభించిన ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు. ఆధునిక పారిశ్రామికాభివృద్ధి మొదలు వ్యవసాయాభివృద్ధి వరకు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకున్నది. అయితే ఈ ప్రాజెక్టు భవిష్యత్తు లక్ష్యం ఏమిటి? ఇది జాతీయ బూర్జువావర్గపు సార్వభౌమ హక్కుగా ఉంటుందా జాతీయ ప్రజా బాహుళ్యపు సార్వభౌమ హక్కుగా ఉంటుందా? పరిపాలనలో శిఖరాగ్ర స్థాయికి చేరుకున్న నూతన జాతీయ బూర్జువావర్గం అమలు జరిపే జాతీయ పెట్టుబడి దారీ ప్రత్యామ్నాయమా అన్నదాన్ని చైనా మన ముందుకు తెచ్చింది. లేక చైనా అనుసరిస్తున్నది రాజ్యసోషలిజం దిశగా పరివర్తన చెందగలిగే సామాజిక విధానమా? ఈ ప్రశ్నలకు సమాధా నం చెప్పటానికి అవసరమైన్ని వివరాలు అందు బాటులో లేవు.

2. రష్యా తిరిగి అమెరికా ప్రత్యర్థిగా అంతర్జాతీయ రాజకీయ రంగంలో పునఃప్రవేశించింది. అయితే రష్యా చేపట్టిన ప్రాజెక్టు సార్వభౌమత్వ లక్షణాలు ముందుకు తీసుకెళ్లే ప్రాజెక్టు అని చెప్పగలమా? ఒకవేళ అవును అని చెప్పగలిగితే ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ గుత్తేదారుల ఆదేశాలు వదిలిపెట్టి జాతీయ పెట్టుబడి

(పక్క పేజీలో)

# తునికిపాడు రాజకీయపాఠశాల

(2వ పేజీతరువాయి)

నారాయణ, పోల్కంపల్లి వెంకట రామారావు, బండి తిరుపతయ్య, గురవారెడ్డి, గుర్రం వెంకట రెడ్డి, సూరావఝుల జానకిరామయ్య, మచ్చా వీరయ్య (ఈయన ఆ తర్వాత జరిగిన తెలంగాణా సాయుధ పోరాటంలో వీర మరణం చెందారు) తదితరులు హాజరయ్యారు.

ప్రతిరోజూ ఉదయమూ, సాయంత్రమూ మునిపల్లె రామారావు విద్యార్థులకు సైనిక కవాతు నేర్పారు. మధ్య మధ్య ఈ విద్యార్థులు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి కవాతు చేసేవారు. ప్రజలకు ధైర్యాన్నీ, ఉత్సాహాన్నీ ఈవిధంగా నింపేవారు. తరగతుల్లో శిక్షణ ఇలా ఉండేది: ఉదయం నాలుగున్న గంటల నుంచి ఐదు గంటల వరకూ ప్రతి విద్యార్థీ వ్యాయామం చేసేవారు. తర్వాత ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకూ డ్రిల్లు చేసేవారు. ఉదయం ఏడున్నర గంటల నుంచి 11 గంటల వరకూ, తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకూ తరగతులు జరిగేవి. అక్కణ్ణుంచి ఏడు గంటల వరకూ డ్రిల్లు, రాత్రి ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకూ తరగతిగానీ, గోష్ఠిగానీ ఉండేది.

శిక్షణా శిబిరంలో ఆచార్య రంగా చరిత్ర, పరిణామవాదం, హిందూదేశ చరిత్ర, స్వదేశీ సంస్థానాలు, జమీందారీ విధానం, భారత జాతీయ ఋణం, పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయ కూలీ–రైతు ఉద్యమం గురించి పాఠాలు చెప్పేవారు. మద్దకూరి చంద్రశేఖర రావు "రష్యా విప్లవం" గురించి.. కంభంపాటి సత్యనారాయణ "భారత స్వాతంత్ర్య పోరాటాలు"... శాసనమండలి సభ్యుడు గద్దె రంగయ్య నాయుడు "జమీందారుల దురంతాలు" అంశంపైన; బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డిలు "హైదరాబాద్ సంస్థాన సమస్యలు" పైన; మునిపల్లి రామారావు "యువజనులు క్రమశిక్షణ – రాష్ట్ర సమస్యలు – సామ్యవాద సిద్ధాంతాలు" గురించీ; శాసనమండలి సభ్యులు కాశీనాథుని పూర్ణమల్లిఖార్జునుడు "ఋణ నివారణ చట్టం" అంశంపైన; రాటకొండ నరసింహారెడ్డి "ఫెడరేషన్–అంతర్జాతీయ సమస్యలు" విషయం పైనా; శెట్టిపల్లి వెంకటరత్నం "సాహిత్యం – ప్రజానీకం" అంశంపైన; డి.సీతారామయ్య "సహకారోద్యమం"పైనా, డాక్టర్ యేజెళ్ల శ్రీరాములు "పశువైద్యం" అంశం గురించీ; ఎన్.శ్రీరామశర్మ "ఉద్యోగవర్గం" గురించి తరగతులు చెప్పేవారు.

తరగతుల సందర్భంగా జరిగిన గోష్ఠుల్లో చర్చించిన అంశాలు ఇవీ... 1) రాబోయే ప్రపంచ సంగ్రామంలో భారతదేశం పాల్గొన కూడదు. 2) సంస్థానాలను పూర్తిగా రద్దు చేస్తేనే భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యం అనుభవంలోకి వస్తుంది. 3) స్వరాజ్య పోరాటం బలపడాలంటే.. రైతు, కార్మికులకు రక్షణ కలగాలంటే.. సంస్థానాల్లోని జాగీర్దారీ విధానం, బ్రిటీషు ప్రాంతంలోని జమీందారీ విధానం సత్వరమే రద్దు కావాలి. 4) కార్మిక, కర్షక రాజ్యం త్వరితంగా స్థాపన కావాలంటే ఈనాడు మన దేశంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ విధానాన్నీ, అందువల్లనే కలుగుతున్నదనబడే పరిశ్రమాభివృద్ధినీ ఆపుచేయడం మంచిది. ఇవీ చర్చల సారం.

ఈ తరగతుల మధ్యమధ్యలో ఆ ఊరిలో బహిరంగ సభలు జరుగుతుండేవి. 1939 అక్టోబర్ ఆరున జరిగిన బహిరంగ సభలో 'రైతు పోరాటం– కాంగ్రెస్', 'రైతు ఉద్యమ సామరస్యం', 'మహిళా ఉద్యమం', 'సంస్థాన పోరాటం' అంశాలపై వక్తలు ప్రసంగించారు. 1939 నవంబర్ ఆరున మునిపల్లె రామారావు అధ్యక్షతన మునగాల రైతు సత్యాగ్రహ దినోత్సవం జరపబడింది. అదేరోజు రాత్రి పేట బాపయ్య అధ్యక్షతన సీతారామరాజు గ్రంథాలయ ప్రథమ వార్షికోత్సవం జరిగింది. జూన్ 12న విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. విద్యార్థులకు యోగ్యతాపత్రాలు అందజేశారు. ఈ సభకు సుంకర వీరభద్రరావు అధ్యక్షత వహించారు. సభలో విద్యార్థులేగాక తునికిపాడు గ్రామస్థులు కూడా పాల్గొన్నారు. విద్యాలయం ముగింపు సందర్భంగా గ్రామంలో పెద్ద ఊరేగింపు జరిపారు. ఈ ఊరేగింపుకు 10 వేల మంది ప్రజలు తరలివచ్చారు. ఈ శిబిరానికి రామన్నపేట, రాపల్లె, బ్రాహ్మణపల్లి, అల్లినగరం, దెందులూరు, మదుపల్లి గ్రామాల రైతులు విరాళాలిచ్చారు. ఊటుకూరు గ్రామస్తులు వంట పాత్రలు సరఫరా చేశారు, శిక్షణా శిబిరాన్ని (విద్యాలయాన్ని) అలంకరించారు. ●

---

దారీ విధానం దిశగా రష్యా ముందుకెళ్ల గలుగుతుందా? నేటికీ రష్యాలో ఆర్థికవ్యవస్థ పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థ తరహాలో ప్రైవేటు శక్తుల గుత్తాధిపత్యంలోనే ఉంది. దాంతో ఈ ప్రాజెక్టులో ప్రజలను తన వెంట నడిపించుకోగలిగిన సామాజిక కోణం లోపిస్తుంది.

3.భారతదేశంలో ప్రైవేటు పారిశ్రామికాధిపతులు అనుసరిస్తున్న విధానాలను సమర్థించే జాతీయ పారిశ్రామిక విధానాల రూపంలో సార్వభౌమ లక్ష్యాలు ఉనికిలో ఉన్నాయి. కానీ భారతదేశపు స్థూల ఆర్థిక విధానాలన్నీ ఉదారవాద, ప్రపంచీకరణ విధానాలే. ఈ విధానాలు అత్యంత వేగంగా రైతాంగాన్ని దివాళా తీయిస్తున్నాయి.

4. ఇదే తరహాలో బ్రెజిల్‌లో కూడా సార్వభౌమ లక్షణాలు కలిగిన విధానాలు అమలు జరుగుతున్నాయి. ఈ విధానాలు బ్రెజిల్‌లోని బడా పారిశ్రామిక ద్రవ్య పెట్టుబడిదారులు, పెట్టుబడిదారీ వ్యవసాయ పరిశ్రమ యజమానుల కనుసన్నల్లో అమలు జరుగుతున్నాయి. భారతదేశం తరహాలోనే బ్రెజిల్‌లో కూడా ఆర్థిక విధానాలు స్థూలంగా సరళీకరణ ఉదారవాద విధానాలుగానే ఉంటున్నాయి. ప్రజల పేదరిక నిర్మూలన దిశగా ఏ చర్యలూ చేపట్టలేదు. దేశంలో 90 శాతం ప్రజలు పట్టణ ప్రాంతాల్లో నివశిస్తున్నారు. అయితే ఒక విషయాన్ని గమనించాలి. మెరుగైన ఆదాయ పంపిణీ విధానాల వల్ల ఆ దేశంలో పేదరికం తీవ్రత కాస్త నెమ్మదిం చింది. భారతదేశంలో లాగానే బ్రెజిల్‌లో కూడా బడా పెట్టుబడిదారులు మరో ముందడుగు వేయ టానికి నిరాకరిస్తున్నారు. తద్వారా గుత్తపెట్టుబడి ఊగిసలాట సుస్పష్టంగా వ్యక్తం అవుతోంది. జాతీయ గుత్తపెట్టుబడి అంతర్జాతీయ గుత్త పెట్టుబడితో రాజీ పడుతోంది. అందువల్లనే బ్రెజిల్‌లోని అపరిమితమైన ప్రకృతి వనరుల దోపిడీకి పెట్టుబడిదారీ ప్రపంచీకరణ వ్యవస్థ విధించిన చట్రంలోనే కొనసాగుతూ బ్రెజిల్ ప్రపంచ పెట్టుబడిదారీ చట్రంలో తమ దేశాన్ని అంత కంతకూ అంతర్భాగంగా మారుస్తూ ఉంది.


5. దక్షిణాఫ్రికాలో కూడా ప్రభుత్వం సార్వభౌమత్వ లక్ష్యాల కోసం పని చేస్తుంది కానీ అక్కడ ఆర్థిక వ్యవస్థ నేటికీ సామ్రాజ్యవాద శక్తుల ఆధీనంలోనే ఉంది. ఆ పరిస్థితుల్లో భవిష్యత్తులో ముందుకొచ్చే సార్వభౌమ లక్ష్యాల సాధన ఎలా ఉంటుంది? అటువంటి నూతన లక్ష్యాల ఆవిష్కరణ పట్ల దక్షిణాఫ్రికా ఏ విధంగా స్పందిస్తుంది?

6. చిన్న చిన్న దేశాలు తమతమ దేశాలకు సంబంధించిన స్వంత సార్వభౌమత్వ ప్రణాళికలు ముందుకు తెచ్చి అమలు చేసుకోగలవా? ఒకవేళ అది సాధ్యం అయితే ఏ పరిమితుల్లో సాధ్యం అవుతుంది? ఏ రకమైన ప్రాంతీయ కూటములు ఈ ప్రయత్నాలను సాధ్యం చేస్తాయి ?

ఇవి ప్రపంచ సోషలిస్టు ఉద్యమం ముందున్న ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు ఏయే దేశం ఏయే రీతిలో స్పందిస్తుంది, ఏ వ్యూహాలు ముందుకు తెస్తుంది, ఇప్పటికే ప్రపంచీకరణ రూపంలో సంపూర్ణ ఆధిపత్యం వహిస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఈ ప్రయత్నాలకు ఏవిధంగా ప్రతిస్పందిస్తుంది అన్న అంశాలపై ప్రపంచ సోషలిస్టు ఉద్యమం దశ, దిశ ఆధారపడి ఉంటుంది.

**(సమీర్ అమీన్ రాసిన సుదీర్ఘ వ్యాసంలో ఇది చివరి భాగం.**
**అనువాదం: కె. వీరయ్య)** ●

# పరిస్థితులను మానవులు ఎన్నుకోలేరు, వారికి ఎదురైన పరిస్థితులపై పనిచేయాలి



**–కారల్ మార్క్స్**

“మనకు ఒక్క శాస్త్రం (సైన్సు) మాత్రమే తెలుసు. అది చరిత్రకు సంబంధించిన శాస్త్రం మాత్రమే. చరిత్రను రెండువైపులనుండి అర్థం చేసుకోవచ్చు. దాన్ని ప్రకృతి చరిత్రగానూ, మానవజాతి చరిత్రగానూ విభజించవచ్చు. అయితే రెండు పార్శ్వాలను వేరుచేయలేం. మానవజాతి మనుగడ సాగిస్తున్నంత కాలం ప్రకృతి చరిత్రను మానవుడూ, మానవుని చరిత్రను ప్రకృతీ పరస్పరం అదుపుచేస్తుంటాయి.”

“మానవ శాస్త్రం ప్రకృతి శాస్త్రాన్ని ఇముడ్చుకున్నట్లే ఒక్కోసారి ప్రకృతి శాస్త్రం తనలో మానవ శాస్త్రాన్ని ఇముడ్చుకుంటుంది: మొత్తం మీద వుండేది ఒక్క శాస్త్రమే.”

“మానవులే చరిత్ర నిర్మాతలు. కానీ వారు తాము కోరుకున్నట్లు మాత్రం దాన్ని నిర్మించుకోలేరు. పరిస్థితులను వారు ఎన్నుకోలేరు, వారికి ఎదురైన పరిస్థితులపై పనిచేయాలి, గతం వారికి అందించిన భౌతిక పరిస్థితులను వారు తీర్చిదిద్దుకోవాలి. గతించిన తరాల వారసత్వం బతికున్న వారి మెదళ్లమీద ఒక పర్వతం మాదిరిగా కూర్చుంటుంది.”

“జీవిని చైతన్యం నిర్ణయించదు, చైతన్యమే జీవిచేత నిర్ణయించబడుతుంది.”

“మతం పీడనకు గురయ్యే జీవుల నిట్టూర్పు, హృదయం లేని ప్రపంచపు హృదయం, మానవాంశ (స్పిరిట్) లేని పరిస్థితుల మానవాంశ. అది మానవుల మత్తుమందు. ప్రజలకు భ్రమాత్మక ఆనందాన్ని కల్పించే మతాన్ని రద్దు చేయాలంటే ముందుగా వారికి వాస్తవ ఆనందాన్ని ఇవ్వాలి.”

“తత్వవేత్తలు ప్రపంచాన్ని పరిపరి విధాలా వర్ణించారు, కావలసినది దాన్ని మార్చడం”

**(కారల్ మార్క్స్ స్వంతంగానూ, కొన్నిసార్లు ఫ్రెడరిక్ ఏంగెల్స్‌తోనూ కలిసి చేసిన రచనల నుండి సేకరించబడిన ముఖ్యమైన కొటేషన్లు)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.5. Published on September 1, 2014